ఆంధ్ర సచిత్ర వారపత్రిక

29-9-78
75 పైసలు



ముందుగా ఏమీ చెల్లించ కుండానే

మీరు చందాదారులుగా జేరవచ్చు!


అంతేకాదు

ఉచితం!!



చందాదారులుగా జేరితే కళ్ళు
చెదిరే సుందరాతిసుందర మైన
ముఖ చిత్రాలతో అత్యున్నత
స్థాయికిచెందిన అతి విలువైన

ఈ రెండు పుస్తకాలు
మీకు కేవలం ఉచితంగా లభిస్తాయి.



ప్రత్యేకబహుమతి



మీరు చందాదారులుగా జేరితే
పై రెండు పుస్తకాలతో పాటు
మరో ప్రత్యేకబహుమతి సైతం
అందించబడుతుంది.

ఈ అరుదైన అవకాశం స్త్రీలకు మాత్రమే!

- ప్రక్కనవున్న కార్డుపై సంతకంచేసి. మీ పూర్తి చిరునామా స్పష్టంగా వ్రాయండి.
- ఈ కార్డుకు మీరు స్టాంపులు అంటించనవసరం లేదు.
- ఈ కార్డు అందగానే మిమ్మల్ని చందాదారులుగా నమోదుచేసి ఈ రెండు పుస్తకాలు ఉచితంగా వి. పి. పి. ద్వారా పంపిస్తాము.
- రేపు మాసపత్రిక చందా నిమిత్తం వి. పి. పి. తెచ్చిన పోస్టుమాన్‌కు రూ. 25 చెల్లించితే చాలు. ఈ రెండు పుస్తకాలు మీకు ఆ క్షణంలోనే ఉచితంగా లభిస్తాయి. మరో ప్రత్యేక బహుమతి సైతం విడిగా అందించబడుతుంది. రేపు మాసపత్రికను ప్రతి నెలా ఒకటవ తేదికి జేరేలా సంవత్సరంపాటు పంపిస్తాము.

మీరు ఆనందమయ జీవితాన్ని
ఆహ్వానించుతుంటే

ఇప్పుడే ఈక్షణంలోనే చందాదారులుగా
జేరండి. ఈ కార్డు పోస్టుచేయండి.

రేపు
విజయవాడ-2.

DIMPLE/R/1500

ఉత్తరాలు

అట్టమీద బొమ్మ

ఈ వారం విఘ్నేశుని ముఖపత్రం, మా మనసులు దోచిన ముత్యాల చిత్రం. ముద్దుల ముద్దుగుమ్మల మధ్య వినాయకుడు, మురిపాల అపురూప గణ నాయకుడు ఎంత బావున్నాడు? మరెంత ముద్దొస్తున్నాడు?

ఆర్. ఉమాసత్యకళ, శ్యామల. (గోకవరము)

సీరియల్

8-9-78 ఆంధ్ర సచిత్ర వార పత్రిక చూడ ముచ్చటగానున్నది మోహన రూప సీరియల్ మంచి పసందుగా వున్నది. మాదిరెడ్డి సులోచన గారికి, ప్రచురించిన మీకు మా ధన్యవాదాలు. రాగద్వేషాలు సీరియల్ ప్రారంభములోనే మా హృదయాలను ఆకర్షించింది. మంచి మంచి కథలు ఎన్నుకొని పత్రికను చాల చక్కగా అలంకరించి మాకు అందించి ఆనందింపచేస్తున్న మీకు మా హృదయపూర్వక అభినందనలు.

యం. జై శంకర్‌రావ్ (హిందూపురం-515201)

వినాయకచవితి సంచిక

బొజ్జ గణపతి నిండైన విగ్రహముతో అతి నిండుగావుంది, మీ (మా) 15-9-1978 వార పత్రిక. మధ్య పేజీలోని "వానలు! వరదలు!! మమ్మ భయ కంపితుల్ని చేసింది." పనివేళలు మారితే... కార్టూన్లు కడుపుబ్బ నవ్వించిందంటే నమ్మండి.

గురువెళ్ళి గోవిందరావు [ఖర్గపూర్-1]

కథలు

15-9-78 వినాయక చవితి సంచిక పత్రిక అన్నిటికంటె "సుపర్బ్" పొట్ట బద్దలయిపోయింది నవ్వలేక. కలగూర గంపలా ఎవరికి, ఏది, ఎంత కావాలో అంతవరకే యిచ్చి చదువరుల అభిమానాన్ని చూరగొంటున్న పత్రిక ఇదొక్కటే. ఈ వారంలో నాకు నచ్చింది, నేను మెచ్చింది "స్లిప్పు" కథ. నేటి సమాజంలో యువతీయువకులకు కనువిప్పు కల్గించి, ఆలోచనా శక్తిని పెంపొందింప జేసింది ఈ కథ

తటవర్తి శ్యామలాగోపాలం (ఏలూరు)


కార్టూన్లు

వినాయక చవితి సంచిక చూడగానే ఈ ఉత్తరం వ్రాయాలనిపించింది అన్నిటికన్నా ముందుగా ఆకర్షించేది ముచ్చటైన ముఖచిత్రం. ఈ సంచికలోని కార్టూన్లు చదువుతూ ఉంటే కడుపుబ్బ నవ్వు వచ్చింది కాని, మధ్య పేజీల్లోని వానలు, వరదలు చూశాక, కళ్ళల్లో నీళ్ళు తిరిగాయంటే నమ్మండి.

వై. కుల్‌సుమ్‌బీ, ఇస్మాయిల్, షేక్‌షావలి, నూర్ మొహమ్మద్, [అనంతపురం.]



ఎమ్.ఎస్.గోపీనాథ సమర్పించు
సరోజిని ఆర్ట్స్
చెప్పింది చేస్తా
తప్పక చూడండి!
సినిస్కోప్ & ఈస్ట్‌మన్ కలర్
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
ఎమ్.ఎస్.గోపీనాథ్
కృష్ణ.గుంటూరు
జగపతి రిలీజ్
దాతలు
డా॥ఎ.వి.కె.రెడ్డి, డా॥టి.వి.ఎమ్.రెడ్డి, డా॥ఎస్.డి.అహమద్
డా॥సి.నటేశన్, ఎమ్.ఎ.అజీజ్ నిర్మాత: బి.కృష్ణమూర్తి
గుంటూరు: వెంకటేష్ ఎంటర్‌ప్రైజెస్ నెల్లూరు సుందరం మూవీస్
సీడెడ్ శ్రీశివశంకర్ ఫిలింస్ నైజాం: నరంగ్ ఎంటర్‌ప్రైజెస్ తమిళనాడు యు.ఎమ్.ప్రాద
ఒరిస్సా: సాయిలక్ష్మి ఫిలింస్



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
శుక్రవారం : 29–9–'78
కాళయుక్తినామ సం. భాద్రపద బ. ద్వాదశి
సంపుటము 72 : సంచిక 3
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

విరసంగా మారిన సరసం

బొంబాయిలో వో యువకుడు చుట్టూచూసి, పెళ్ళయిన వో పనిమనిషితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడట. ఆమెకూడా అతనితో ఆ హాయి ఝూమ్మని అనుభవించేదట. ఇలా చాలా కాలం జరిగాక, మనిద్దరం పారిపోదాంరమ్మన్నాడటా యువకుడు. దానికామె సుతరాం వొప్పుకోక తన యిల్లు, తనభర్తా పిల్లలూ అవన్నీ తనకర్తవ్యాలని, ఆ యువకునితో సరసం సరదా అనీ తేల్చిందట. దాంతో ఆ యువకునికి వీరావేశంవచ్చి, పరాయి యింట్లో పనిచేస్తున్న ఆమెను కత్తితో పొడిచి చంపి, యావజ్జీవ కారాగార శిక్షపద్దులో జమ అయ్యాడట

ఆరోపణలకు అసమ్మతి

తన కొడుకుమీద అవినీతి, తత్ సంబంధమైన ఆరోపణలన్నీ నిరాధారాలనీ, కనుక వాటిని విచారించే పనిలేనే లేదని, దానికి తాను సమ్మతించననీ ప్రధాని మొరార్జీ అన్నారట. తన కుమారునిమీద ఆరోపించిన నేరాలను ఉపసంహరించుకుంటే తాను చరణ్‌సింగ్‌ను తిరిగి ప్రభుత్వంలోకి తీసుకునే విషయంలో ఆలోచిస్తానన్నారటాయన. తనమీద నేరారోపణ చేస్తూ సవాలు చేసిన రాజ్‌నారాయణ్‌మీద తగిన చర్య తీసుకోవాల్సుంటుందనో హెచ్చరిక చేశారట. ఈనాటి కేంద్ర ప్రభుత్వ అంతర్యుద్ధాన్ని వివరాలనూ పరిశీలిస్తే పోయిన ప్రభుత్వమె బెటరనిపించట్లా ! ఏంటీ కొట్లాట !!

జనతా గద్దె దిగాలని రాజ్‌నారాయణ సూచన !

ప్రజలకు తాము చేసిన వాగ్దానాలనేగాక, నాయకులుగా తాము చేయాల్సిన కనీస విధులను కూడా నిర్వహించలేక పోయినందుకు జనతా ప్రభుత్వం తనంతట తానే గద్దెదిగడం మంచిదని రాజ్‌నారాయణ్ అన్నారట—టిట ఫర్ టాట్ !

హుండీ నంది

హిమాచలప్రదేశ్‌కు చెందిన వో శివాలయంలోని నంది విగ్రహం నోట్లోంచి కానుకలు వేసేట్టు, ఆ విగ్రహం హుండీగా పనిచేసేట్టూ వున్నదట. ఆ ప్రాంతపు గిరిజనులు,యితరజనులు వెండి బంగారునాణాలు, నాణాలు, నగలలు. సిగదు యీ నందీశ్వరుని నోట్లో వేస్తారట.

భర్త పోరు భరించలేక...

సేలం జిల్లా కరుంగల్లుపట్టికి చెందిన మాధవరాజన్ అనే అతనికి, అతనిభార్య 20 ఏళ్ళ ప్రేమావతికి ప్రతినిత్యం అనునిత్యం వడేది కాదట. తనభర్త తనను పెట్టే బాధలు భరించలేక ప్రేమావతి తన రెండేళ్ళ పసిపిల్లను వొళ్ళో చీరను కట్టుకుని, నూతిలో దూకిందట. ఫలితంగా తల్లీ, పిల్లా చనిపోయారట.

పత్రికా డైరీ

ప్రాథమిక విద్య—కుటుంబనియంత్రణ!

కుటుంబనియంత్రణ విషయం విపరంగా బాలబాలికలకు ఏ వయస్సులో ఆరంభించి బోధన చేయాలి అనే విషయంమీద కర్ణాటక ప్రభుత్వం వో నిర్ణయానికి వచ్చిందట. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి యీ విషయాన్ని చెపుతూ ఏకంగా ఎలిమెంటరీ స్కూలునుంచే యీ విషయాలు చెప్పవచ్చనీ, ఆ వయస్సులో పిల్లలకే యీ విషయాలు తెలుస్తున్నాయనీ అన్నారట.-నూటికి నూరు పాళ్ళు నిఝం యీ పాయింటు.

తమిళంలోనే సంతకాలు !

తమిళనాడు ప్రభుత్వరంగాలలో పనిచేస్తున్న వారు తమ సంతకాలను తమిళంలోనే పెట్టాలని తమిళ ప్రభుత్వం "చట్టం" చేసిందట. ఆహా ! ఉంగళ్ పేరెన్న !!

పొగ తాగితే శిరచ్ఛేదం !

పొగ త్రాగడం యీనాటికి వెయ్యేళ్ళకుముందు పంచలసంవత్సరాల క్రితం నుంచి భూమ్మీద వున్నదట. అలనాటి పొగ త్రాగిన వారికి చైనా దేశం శిరచ్ఛేదం శిక్ష విధించేదట. చైనాలో యీనాడు కూడా హోటళ్ళలోని గదులకు తాళాలు వేయరట లాడ్జీలలో వుండేవారు బయట పని మీద వెళ్ళేటప్పుడు తలుపు జారవేసి వెళ్తారటంతే!! శ్రీరామచంద్రుడేలేవాడు చైనా వాడా ! రామరాజ్యమనగానేమి !! అదెక్కడున్నది !

ప్రాణాలేపోతే స్టాంపులెందుకు ?!


"ఎంప్లాయిమెంటు న్యూస్ వీక్లీ" అనే పత్రికలో బాబా ఆటమిక్ రిసర్చి ఇన్‌స్టిట్యూట్ దరఖాస్తులు కోరుతూ వివరం యీ విధంగా వివరించిందట. "ఈవుద్యోగాలకు యుద్ధంలోగాని రక్షణ కర్తవ్యంలోగాని ప్రాణాలను శరీరావయవాలనూ కోల్పోయిన డిఫెన్సు మాజీవుద్యోగులు మాత్రం స్టాంపులు జతపరచిన కవర్లు పంప పనిలేదు."

మాటామాటా ముక్కుకుచేటా !

పెన్నాగ్రం అనే వూరికి చెందిన మునియప్పన్ అనే అతనికి, అతని భార్య సుశీలకు ఏదో విషయంమీద మాటా మాటా వచ్చి అది తగూలాటగా మారి, పోట్లాటగా రూపొంది, కొట్లాటస్థాయికి పెరిగిందట సుశీల తన భర్తను తన చేతిలో వున్న గరిటె పెట్టి సత్కరిస్తే, అతడు తన చేతిలో ఏమిలేనందువల్ల అమాంతం ఆమె మీదపడి, నోటికందిన ఆమె ముక్కుపుట్టున కొరికేసి వుమ్మేశాడట. ముక్కుముక్కాడిపోయిన సుశీల స్పృహ తప్పి పడిపోయిందట.

దారుణ హత్య

ధర్మపురికి చెందిన పెన్నాగ్రం అనే వూరిలో సాహిమీరాన్ అనే ఆయన తనపొలంలో వున్న నూతిలో రెండు కాళ్ళు తేలుతూ కనుపించేసరికి పోలీసుకు రిపోర్టు యిచ్చాడట. వారొచ్చి శవాన్ని బయటకు తీశారట. అదొక స్త్రీ శవమట. ఒక యాభైయేళ్ళున్న ఆమె నెవరో దారుణంగా హత్యచేశారట. రెండుచేతులూ నరికి కాళ్ళతో కలిపి కట్టేశారట. పొత్తికడుపు, తొడలు చీల్చి వేశారట. ఎడమస్తనం నరికేశారట. ముఖమంతా చెక్కేశారట. వీపుమీద, పిరుదులమీద, జబ్బల మీదా చేంగుర్తు వచ్చబొట్టు వున్నదట ఇంత ఘోరాతి ఘోరంగా హత్యచేసినవారి కోసం పోలీసు గాలిస్తోందట.



వ్రత భంగం చేయనివి

మనం ఏదయినా వ్రతాన్ని చెయ్యదలచినపుడు కొన్ని నియమాలను పాటించాలి. ఆ వ్రతం పూర్తి అయేవరకూ ఇతర కార్యాలను తలపెట్టకుండా దీక్షతో ఉండాలి. ఉపవాసం చాలా ముఖ్యం. ఆ ఉపవాసం మనోనిగ్రహానికి దోహదమయి ఉంటుంది.

సత్యనారాయణ వ్రతం మున్నగు వాటిని పర్వదినాలలో రాత్రి పూట చేసేవారు. ఆ దినమంతా ఉపవాస ముండి, ఇల్లు కదల కుండా శుచిగా ఉండేవారు. అయితే—ఇలాటి వ్రతాలు చేసే వారిలో బలహీనులు కొందరు ఉంటారు. వారికి శ్రద్ధాభక్తులు, ఆసక్తి ఉంటాయి కాని ఉపవాసం ఉండడం, కట్టి పడవేసినట్లు ఒక చోట స్థిరంగా ఉండడం సాధ్యం కాక పోవచ్చును.

అలాంటి వారి సంగతి ఏమిటి? వారికి ఇలాటి వ్రతాలు చేసే అవకాశం ఉండదా?— అని ప్రశ్నించే వారికి పెద్దలే ఒక సమాధానం చెప్పారు.

ధర్మపథం

వారు కొన్ని అనుమతుల నిచ్చి ఆ నియమాన్ని సడలించారు. అవి ఏవిమిది —

"అష్టౌతా న్యవ్రతఘ్నాని
ఆపో మూలం ఫలం పయః,
హవిః బ్రాహ్మణ కామ్యా చ
గురోర్వచన మౌషధమ్."

జలపానం, కందమూలాల భక్షణ, పండ్లు తీసుకోవడం, పాలు తాగడం, హవిస్సును స్వీకరించడం, విప్రుడు కోరిన పనిని చెయ్యడం, గురువుగారి ఆనతిని నెరవేర్చడం, ఔషధసేవ వ్రత నియమానికి భంగం కలిగించవనీ, దోషాలు కావనీ దీని అభిప్రాయం.

ఆరోగ్యం సరిగా లేకున్నా, వ్రత నియమాన్ని పాటించేటప్పుడు — నిష్ఠలో ఉన్నప్పుడు ఔషధాన్ని సేవించవలసినదే! లేకపోతే నియమం సాగదు. నియమా లన్నిటికంటే గురువుగారి ఆజ్ఞ గొప్పది కాబట్టి మధ్యలో దాన్ని నెరవేర్చడం తప్పు కాదు. అట్టిదే బ్రాహ్మణ కార్య నిర్వహణం కూడా.


నియమానుసారం కొందరు పచ్చి మంచి నీళ్లయినా తాగకుండా ఉపవాసం ఉంటారు. కొందరికి అది సాధ్యం కాదు. అట్టివారు నీరు తాగవచ్చును. అంతకంటే బలహీనులయి, ఉపవాసం ఉండలేనివారు ఏవయినా దుంపలనుగాని, పండ్లనుగాని, ఇంకా శక్తి లేని వారు పాలనుగాని స్వీకరించవచ్చును. చివరకు పవిత్రమైన హవిస్సును తీసుకున్నా దోషం లేదు. వ్రతానికి భంగం కలగదు. ఇది వారివారి పరిస్థితులనుబట్టి ఉంటుంది. అంతేకాని పళ్ళూ, పాలు తీసుకుంటే తప్పు లేదని శక్తి ఉన్నవారు కూడా వాటిని తీసుకుంటూ— మేము నియమాన్ని అతిక్రమించ లేదని అనుకోవడం మాత్రం చాలా పొరపాటు. అట్టివారు పళ్ళూ మొదలైన వాటిని తీసుకుంటే వ్రత భంగమే కాగలదు.

పయి ఎనిమిదిన్నీ ఆపద్ధర్మాలే గాని — ఎవరైనా సరే — వీటిని అనుసరిస్తే తప్పు లేదని అనుకోవడం మాత్రం తగదు.

— ఋలుసు వేంకట రమణయ్య

గడ్డి పోచ

వేమకోటి సీతారామశాస్త్రి



"మీకు బాబాలంటే యెలాంటి అభిప్రాయం వుంది" అనడిగాడు అప్పకవి; వొకనాటి సాయంకాలం చలాన్ని చూసి.

ఆ ప్రశ్న నన్నడగడు అప్పకవి. నా అభిప్రాయాలు అతనికి తెలుసు. నేనూ సింహా చలం, అప్పకవి ముగ్గురం మూడు ప్రాంతాల నుండి వొకే ఆఫీసులో పని చేయడానికి తరలి వచ్చిన వాళ్ళం.

సాయంకాలం రోజూ మురళీకృష్ణా లంచ్ హోమ్‌లో కాఫీ త్రాగి బొంకుల దిబ్బ మీద నిలబడి యేదో విషయం పైన మాట్లాడు కోవటం అలవాటు.

యే సాయంకాలం యే ప్రసంగం వస్తుందో మాకే తెలియదు. యెవరో వొక మహానుభావుడు పాద యాత్ర చేస్తూ పట్టణాన్ని పవిత్రం చేశాడని పేపర్లో వార్త పైన ఆరోజు చిత్రంగా మా ప్రసంగం మలుపు తిరిగింది.

చలం యిబ్బంది కరంగా నావేపు చూశాడు దూరంగా మూడు కోవెళ్ళలో గంటలు మోగుతున్నాయి. చలం మౌనాన్ని చూసి మళ్ళా ప్రశ్నించాడు అప్పకవి.

"చెప్పక తప్పదా!" అన్నాడు చలం యిబ్బందిగా.

"చెప్పు నీ అభిప్రాయం చెప్పటంలో తప్పేముంది" అన్నాను చలానికి వత్తాసు యిస్తూ. నా మాటలతో చలానికి ధైర్యం వచ్చింది. చలం యేం చెబుతాడో నాకు తెలుసు. మేం యిద్దరం పూర్వ పరిచితులం.

"నాకు నమ్మకం లేదు" అన్నాడు చలం నిదానంగా.

ఆశ్చర్యంగా చూశాడు అప్పకవి.

"యేం? యెందువలన నమ్మకంలేదు" రెట్టించి అడిగాడు.

"అది చెప్పాలంటే చాట భారతమంత అవుతుంది" అన్నాడు చలం కొంచెం కోపంగా.

అప్పకవి మాట్లాడలేదు. అతనికి కోపం వచ్చింది. జీవితం అతనికి వడ్డించిన విస్తరి. భార్య మహిళా కళాశాలలో లెక్చరరు. యిద్దరికీ కలసి సుమారు పది హేను వందలకు పైగా వస్తుంది. పిల్లా పీచుకా యెవ్వరూ లేరు ఆఫీసులో అత నంటే అందరికీ మంచి గౌరవం. కావా లంటే ఆఫీసులో కొంతమందికి ఋణమో పణమో. వడ్డీ లేకుండా డబ్బు అప్పిస్తాడు. అతనింటి నిండా బాబాలు స్వాములు, దేవుళ్ళు నిలువెత్తు సైజులో గోడల్ని అలంకరించి ధూపదీప నైవేద్యాల్ని అందుకుంటూ చిరు నవ్వు నవ్వుతాయి.

"నాకొంచెం పనివుంది. మా శ్రీమతిని లేడీడాక్టరు వద్దకు తీసికెళ్ళాలి" అంటూ చివాల్న లేచిపోయాడు అప్పకవి.

"కొంపతీసి అతనికిగాని కోపం రాలేదు కదా" అన్నాడు నావేపు చూస్తూ చలం.

నేను నవ్వేశాను చలం భుజం తట్టి.

* * *

నాలుగు రోజుల తర్వాత ఆఫీసులో నా సీటు దగ్గరకు వచ్చాడు చలం.

"నిజంగానే కోపం వచ్చింది అప్పకవికి నామీద" అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది. ఆరోజు తర్వాత మేం మామూలుగానే కలుసుకుంటున్నాం. మాట్లాడు కుంటున్నాం.

"యెలా అనుకుంటున్నావ్."

ఎడారిలో కూరగాయలా?

మూడోవంతు సముద్రం పోగా మిగిలిన భూమ్మీద మళ్ళీ మూడో వంతు ఎడారి మయంగా వుంది! జపాన్‌లోని "యెడారి అభివృద్ధి సంస్థ" వారు యీ "మరు భూమి"లో కూరగాయల తీగెలను పెంచాలన్న తీవ్రతరమైన కృషి ప్రారంభించారు. దీనికి వారు మధ్యప్రాచ్య దేశాలలో ఎడారి నగరమైన "అబూదబీ" పరిసరాలను యెంచుకుని, అక్కడ ఆరు ఎకరాల మేర– ఒక కూరగాయల క్షేత్రాన్ని తయారు చేశారు. అందులో జపాన్ నుంచి తెచ్చిన ఉల్లిపాయలు, కాబేజీ, టమోటాలు లాంటి కూరగాయల మొక్కలను పాదులను పుష్టిగా పెంచగలిగారు. ఇది ఎట్లా చేశారయ్యా? అంటే ఎడారిలో కురిసిన వర్షాన్ని అందులోకి యింకి యిగిరి పోకుండా పైన ఒక రసాయినిక పొర ఏర్పాటు చేశారు. చెట్లకి, పాదులకి, మనుషులకు పెట్టినట్లు "డ్రిప్" పద్ధతిన నీళ్ళు పెట్టి–లోపలికి ఎక్కించారు!

గడ్డిపోచ

"ఏంలేదు. ఇంట్లో అందరికీ జ్వరాలు డాక్టరు దగ్గరకు వెడితే మందుల లిస్ట్ రాసిచ్చాడు. కొంచెం డబ్బు కావల్సివచ్చింది ఒక అరవై రూపాయలు సర్దమన్నాను. లేదన్నాడు" అన్నాడు దిగాలుగా.

చలం పరిస్థితి నాకు తెలుసు. మాధ్యమిక తరగతికి చెందిన కుటుంబానికి ప్రతినిధి. బరువు బాధ్యతలు యెక్కువ. అప్పుడప్పుడు అప్పకవి దగ్గర డబ్బు తీసుకుంటూ వుండటం తిరిగి జీతాలందిననాడు యిచ్చివేయటం రివాజు.

"సర్లే యేం చేస్తాం. నా దగ్గర ఒక యిరవై రూపాయలు వున్నాయి సర్దుకో" అన్నాను డబ్బు యిస్తూ. నాకు ఆ క్షణంలో అప్పకవి అంటే అసహ్యం వేసింది. పోనీ అతని దగ్గర లేదు, అని అనుకుందామంటే గంట క్రితమే పండుగ అడ్వాన్సు తీసుకున్నాడు. వేరుగా వెళి అడుగుదామనుకున్నాను గానీ తమాయించుకున్నాను.

ఆ రోజు సాయంకాలం కాఫీ త్రాగుతున్నాం.

"ఆ రోజు డబ్బు అడిగితే లేదన్నాను. పాపం డబ్బుకు ఎంత యిబ్బంది పడ్డావో యిందు...యీ వందరూపాయలూ ఉంచు" అంటూ అప్పకవి చలం చేతికి యివ్వబోయాడు వంద నోటును. చలం తటపటాయించాడు. తీసుకోవడానికి కాదు. నెలాఖర్న యివ్వలేనేమోనన్న భయంతో. ఆ మాటే బయట కనేశాడు. "ఫర్వాలేదులే. ఈనెల కాకపోతే వొచ్చే నెలాఖర్లో రెండు వాయిదాలుగా యియ్యి" అన్నాడు అప్పకవి చిరునవ్వుతో.

చలం డబ్బు తీసుకున్నాడు. ఆ తర్వాత మాకు మరేమీ చర్చించడానికి అవకాశం లేకపోయింది. ఆ రోజు అప్పకవికి భజన కార్యక్రమం వుంది. అందువలన భార్య రిక్షాలో వస్తే మందిరం వైపు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత

"ఇది కలా నిజమా..." అన్నాను చలం వేపు చూస్తూ. అప్పకవి ప్రవర్తన నా కర్థం కాలేదు.

"నిజమే!" అన్నాడు చలం నవ్వి.

"అసలేం జరిగింది."

"నిన్న వుదయం అతని సీటు దగ్గరకు వెళ్ళాను. 'సారీ! అప్పకవి! అపచారం చేశాను. అలా అన్నందువల్నే కాబోలు మా యింట్లో అందరికీ జ్వరాలు. నేను మానసికంగా చాలా బాధ పడుతున్నాను. అపరాధమే జరిగింది' అని అన్నాను" అని చెప్పాడు.

"ఆ తర్వాతేం జరిగింది" కుతూహలంగా అడిగాను.

"అప్పకవి ముఖం వికసించింది; మధ్యాహ్నం లంచవర్లో రిక్షాలో యింటికి వెళ్ళి కొంచెం విభూతి తెచ్చి యిచ్చాడు; యింట్లో జ్వరాలుపడ్డ వాళ్ళను నొసట ధరించమని. యిదీ అసలు జరిగిన సంగతి" అన్నాడు చలం నవ్వి.

"అయితే నీ అభిప్రాయాలు మార్చుకున్నావా?" అనడిగాను సందేహాత్మకంగానే.

"లేదు. చిన్న సవరణలు చేసుకున్నాను" అన్నాడు చలం.

"అంటే" బోధపడక నేను వేసిన ప్రశ్న.

"అలాగ నమ్మకం వున్నట్టు నటించకపోతే దైనందిన కార్యక్రమాలలో యేమైనా అకస్మాత్తుగా లోటు పాటులు వస్తే తట్టుకోలేం యిలాంటి అభిప్రాయ భేదాల వల్ల యెవ్వరు సాధించింది యేమీ లేకపోయినా అతను చేసే ఆర్థిక సహాయం కుంటుపడి పోతుంది" అన్నాడు నవ్వి.

ఆ నవ్వు తుఫాను తాకిడికి తల వంచుకుని, తర్వాత తల యెత్తిన గడ్డిపోచ నవ్విన నవ్వులా వుంది. అప్పటికి గానీ నాకు అసలు లింకు బోధపడలేదు.

మాస్కోలో 'జవేరి సిస్టర్స్'

సెప్టెంబర్‌లో భారతదేశం నుండి వచ్చిన 'జవేరి సిస్టర్స్' డాన్సుకంపెనీ మాస్కోలోని రోస్సియా నృత్య ప్రదర్శన శాలలో ప్రదర్శనలు యిచ్చింది. రెండున్నర వేల మంది పట్టే యీ మందిరం ప్రేక్షకులతో కిటకిటలాడి పోయింది. భారత జాతీయ ప్రదర్శన చూడడానికి వచ్చిన ప్రేక్షకుల కోసం యీ డాన్సు కంపెనీ అనేక నృత్య ప్రదర్శన లిచ్చింది.

ఈ కంపెనీ నాయకురాలు రంజనా జవేరి నొవోస్తి విలేఖరితో మాట్లాడుతూ తాను సోవియట్ యూనియన్ సందర్శించడం యిది మూడవ పర్యాయమని చెప్పారు. "మేము పూర్వం వచ్చినప్పుడు భారతీయ ఆచారాల్ను, సంప్రదాయాలు, సంస్కృతిని పోలివున్న ఆచార, సంస్కృతి, సంప్రదాయాలు గల ప్రాంతాలలో పర్యటించాము. ఈ పర్యాయం భారతీయ కళ అంతగా తెలియని ఉత్తర ప్రాంతాలకు వెళ్ళాం. మా నృత్యాన్ని ప్రజానీకం ఎలా అర్థం చేసుకుంటారోనని మేము కొంత భయపడ్డాం. కానీ, మేము విచారించవలసిన పనిలేదు. కారణం మా నృత్య ప్రదర్శన లన్నీ అత్యంత విజయవంతంగా జరిగాయి. ప్రతి చోటా ప్రేక్షకులతో మేము సత్సంబంధాలు నెలకొల్పుకున్నాం" అని ఆమె అన్నారు

"నాగార్జున విశ్వవిద్యాలయం
మూ సి వే త"
[2-9-'78 పత్రికలలో వార్త]
"కాకతీయ విశ్వ విద్యాలయం
నిరవధికంగా మూసివేత"
[అదేరోజు పత్రికలలో వార్త]
"లక్నో విశ్వవిద్యాలయ ఆవరణలో
దౌర్జన్యకాండ : బస్సులకు నిప్పు!"

'భీమవరం కాలేజీలో ఉద్రిక్తత: కొట్లాట''... విజయవాడలో కాలేజీ ఆవరణ, వైజాగ్ కళాశాలల ప్రాంగణాలు బెంగళూరు, నాగపూర్- ఢిల్లీ సంగతి సరేసరి- యిట్లా దేశం మొత్తం మీద విద్యాలయ ప్రాంగణాలు అశాంతికి నిలయాలై పోతున్నాయి! పై శీర్షికలు పత్రికలు చదివేవారికి నిత్యనూతన సత్యాలు! ఇవి చదివి ఆందోళన, ఆవేదన, చిన్నపిసరు ఆవేశం పొందని తలిదండ్రుడు ఉండరు! లెక్కలు- అంకెలు కావాలంటే అట్టే మాయని ఏ ''యియర్ బుక్''లో నుంచో యివ్వవచ్చును- కాలేజీల సంఖ్య రోజూ పెరిగిపోతున్నది. చదువులకోసం విశ్వ విద్యాలయ ప్రాంగణాలకు, రూపాయిలమూటలతో పరుగులు తీస్తున్నవారి సంఖ్య ఎక్కువై పోతున్నది! కరస్పాండెన్సు కోర్సులు- ప్రయివేటు కోర్సులు- లాంటివెన్నో దిన దినాభివృద్ధి గాంచుతున్నాయి! ఇదెంతో గొప్ప సంగతి!... కాని కళాశాలల ఆవరణలో రక్తపు మరకలకి తావులేదన్న సంగతి- పెద్దలు యెంతోమంది గ్రహించినట్లు లేదు- లేకపోతే పిల్లలు తలలు ఎందుకు పగలు గొట్టుకుంటారు?

ఇలాంటి సంఘటనలు — ఏదో చెదురు మదురు సంఘటనలు ఐతే — స్థానికమైన రాజకీయ కుళ్ళు కావేషిల ప్రభావమైతే — దీన్ని గురించి యింత ఆవేదన చెందనక్కర లేదు- కాని దేశవ్యాప్తంగా ఒక అంటు వ్యాధిలాగ అల్లుకు పోతున్నదీ ఎన్నికల జ్వరం! కక్షల విషవలయం!

"కాలేజీలలో రాజకీయాలకి తావు లేదంటే'' దీని అర్థం అవగాహన కాని విద్యార్థులు అమాయకంగా అడుగుతుంటారు — ''భావిభారతపౌరులకు, ప్రజాస్వామ్య వ్యవస్థ సుస్థిరతకోసం పాటుపడే అధ్యాపకులకు రాజకీయా లొద్దంటే విలాగండి?'' అని,

సామాన్యుని సణుగుడు

"మాదిరి ఎన్నికలు!"

చిన్న కాలేజీ ఆవరణ నుంచి పెద్ద సమాజపు రంగస్థలంలోకి దూకే వారికి అవసరమైన ''ట్రయినింగు వద్దంటున్నారే యిదేం మర్యాదా?'' అని—

రాజకీయ అధ్యయనానికి రాజకీయాల కుళ్ళు కావేషిల మధ్య తలమున్కలై — కాళ్ళూ చేతులూ విరక్కొట్టుకోడానికి తేడా లేదా? రాజకీయాలను సిద్ధాంతాలను క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యడం అవసరం — అవసరం ఏమిటీ? — ''అవసరంన్నర'' కూడా — విద్యాలయాలలో, ''మాదిరి పార్లమెంట్లు'', ''మాదిరి అసెంబ్లీ'' లు — ''ఐక్యరాజ్య సమితి మాదిరి సభలు'' అదీ నిర్వహించడం కొన్నిచోట్ల సంప్రదాయం కూడా! కాని ''మాదిరి ఎన్నికలు'' జరిపించడం దానికోసం ''మాదిరి రూపాయిలు'' కాకుండా నిజం పైకం, పంచుల కొద్దీ విప్పి — యిదే జీవిత సర్వస్వం — జీవిత పరమ ధ్యేయం అన్నటు — ఒకే బెంచీలో కూర్చొని ఒక క్లాసులో ఒక ఆవరణలో ఆడుతూ పాడుతూ కలిసి మెలిసి మూడు నాలుగేళ్ళు విదగవలసిన చిన్నారి మనసులను సంకుచితం చేసుకోడం యెందుకు జరుగుతున్నది?


''ఉద్యమాలు!... ఎన్నికలు... కులవర్గ వైషమ్య పోరాటాలు వీటి గురించి మాకు మాత్రమేనా? సరదా! మా అధ్యాపకులకు వీటిమీద మోజు యింకా యెక్కువ.. వాళ్ళు జెండాలు తోరణాలు పట్టుకుని వీధిన పడటం లేదా? మేం పడితేనే? తప్పు వచ్చిందా?'' అని ఒక విద్యార్థి నాయకుడు సాధ్యమైనంత ''సౌలైట్'' గా నన్నడిగాడు — దీనికి జవాబు నా దగ్గర కన్నా మీ మీ 'టీచర్స్' దగ్గరే లభిస్తుందేమో? వెతుక్కొమన్నాను...

''వర్గాలకి; వర్ణాలకి; మతాలకి కులాలకి అతీతమైన వ్యవస్థ ఏదో స్థాపించాలన్న — గ్రంథస్థ సత్యం కోసం—రేపటి సమాజంలో శ్రమదమాలను ధారపోయవలసిన కుర్రవాళ్ళు వర్గ వైషమ్యాల కుళ్ళు కర్కోటపు దారుణ, భీషణ మారణ, హోమంలో యివాళ ''సమిధ'' లై పోతున్నారు.


నేర్చుకోవలసిన చోట రేపటి ఆశల సాఫల్యం కోసం ఆశయాలను నేర్చుకోవలసిన దేవాలయాలకన్నా గొప్పవిగా వెలసిల్లవలసిన విద్యాలయాల్లో...యీ తెల్లకాగితాల్లాంటి యువతీ యువకుల మనస్సు మీద రుధిరాక్షర లిఖితమైన దుష్ట రాజకీయ ముద్రలు పడిపోతున్నాయి!

''పూనుస్పర్థను విద్యలందే వైరముపు వాణిజ్యమందే'' అన్న నీతి వాక్యం మన లాంటి తల్లిదండ్రులు — క్యూలో నిలబడకుండా బియ్యం నుంచి సినిమా టిక్కెట్ల దాకా—యేదీ సంపాయించుకోడం చాతకాని సామాన్యులం చెబితే—యిలాంటి సదుపాయాలెన్నో వాళ్లకి నేర్పిస్తున్న—యితర పెద్దలు యింకోవైపు వాళ్ళకు గడుసు ''కిటుకులు'' నేర్పుతూం టే—పసివాళ్ళు అటువేపే మొగ్గు

(50 వ పేజీ చూడండి)



మమత



మహీధర రామశాస్త్రి

పరంధామయ్య పడక్కుర్చీలో కూర్చుని, పత్రికలో కథ దీక్షగ చదువుతున్నాడు. అలా పత్రికలు చదువుకుంటూ, హాయిగ కాలం గడిపేసేటంత అదృష్టవంతుడేం కాదు, పరంధామయ్య. మేనల్లుడు కిష్టప్ప కథ పత్రికలో కనిపించింది. అందుకని కుతూహలంగా చదువు తున్నాడు.

కథ చదివి ఓ నిట్టూర్పు విడిచి, అలా ఆకాశం అంచుల్లోకి చూపులు మరల్చాడు, పరంధామయ్య. తన యింటి ముందు, ఎత్తుగ ఎర్రకంకర రోడ్డు. రోడ్డవతల పెద్ద కాలవ. తరవాత యింకా ఎత్తుగా ఏటిగట్టు. ఆ వెనక విశాలంగ లంక ఆ తరువాయి వెడల్పైన గోదావరి పాయ గోదావరి పాయపై ఎగురుతున్న పక్షుల ఆకాశంలో అందంగ అగుపిస్తున్నాయి.

పదేళ్ళక్రితం భార్యని, ఆ లంకలోనే బూడిదచేసి గోదావరిలో కలిపాడు. ఆ దిక్కుగ ఆకాశం ఎర్రబడి, సూర్యాస్తమయం అవుతూంటే, భార్య చితిమంటలు గుర్తుకు వస్తాయి పరంధామయ్యకి — సాయంత్రాలు అలా ఓ అయిదు నిముషాలు సూర్యాస్తమయాన్ని చూస్తూ గడపందే తోచదు. అలా కాని రోజున, భార్య ఆత్మకి పెద్ద ద్రోహం చేసినట్టు మథన పడతాడు పరంధామయ్య. అదే ఆతని సంధ్యా వందనం.

కిష్టప్ప కథ బుర్రలో తిరుగుతూంది. రవి, సుజాత ప్రేమికులు. రవి నిరుద్యోగి; సుజాత ఉద్యోగిని. భర్త ఉద్యోగం చేస్తూ, ఉద్యోగి కాని భార్యని గౌరవంగ ప్రేమిస్తున్నపుడు, భార్య ఉద్యోగం చేస్తూ, ఉద్యోగి కాని భర్తని గౌరవంగ ప్రేమించ వచ్చుగదా? అన్న అంశం మీద, బాగ చర్చించుకుని, యిద్దరి సమస్యలకి ఓ కొలిక్కి తెచ్చుకుని, సదవగాహనతో పెళ్ళికి సిద్ధపడతారు.

పరంధామయ్య కథ ద్వారా గ్రహించింది కిష్టప్ప మనసు. తన కూతురు సుజాత టీచరు ట్రైనింగు పాసయి వుంది. రేపో మాపో ఉద్యోగం రావచ్చు ఉద్యోగం వచ్చాక పెళ్ళి చేయాలన్నది తన కోరిక. మేనల్లుడు కిష్టప్ప బి. ఏ పాసయి ఖాళీగ వున్నాడు. ఈడయినవాడే! "బహుశా తన కోర్కెని యీ విధంగ కథ ద్వారా, కిష్టప్ప సూచించలేదు కదా?" అని ఆలోచిస్తున్నాడు, పరంధామయ్య.

లోపల వంటింట్లోంచి, రెండో కూతురు చేస్తున్న వంట ఘాటు వాసనలు బయట పడుతున్నాయి.

సుజాత తల వంచుకుని, నడుచుకుంటూ వస్తూంది. సాయంత్రం నాలుగు నుంచి, ఈపాటివేళ వరకూ, ప్రెసిడెంటు గోపాలరాజుగారి యింట్లో పిల్లలకి పాఠాలు చెబుతుంది.

గోపాలరాజు అభిమానం తనకి కొండంత బలం. రాజకీయ బలం గట్టిగ వున్న గోపాలరాజు సుజాతకి టీచరుగ ఉద్యోగం వేయించగలడన్నది తన విశ్వాసం.

అతను పాలేళ్ళతో, లంకలోనే వుంటాడు రోజల్లా. చీకటి పడ్డాక యిల్లు చేరుతాడు. వస్తూనే భోజనం చేసి, అరుగుమీదకు చేరి, వాలుకుర్చీలో కూర్చుని, లంక పొగాకు పాయలు విడదీసుకుంటూ, ఈనెలు అరుగు క్రిందకి విసిరి పారేస్తూ, లావుగ, పొడుగ్గ చుట్టచుట్టి కాల్చుకుంటాడు. అరుగుమీదకి చేరిన మనుషులతో కబుర్లు చెబుతూ, రాజులాగే బ్రతుకుతాడు గోపాలరాజు. అంత మందిలో వెళ్ళి అడగడానికి చిన్నతనంగ వుంది తనకి. లంకలో వుండగా కలుసుకుని

మ మ త

మాట్లాడాలని అనుకుంటున్నాడు కాని ఆ పని మాత్రం జరగడం లేదు.

సుజాత గుమ్మం ఎక్కుతూ ంటే, పరీక్షగ చూశాడు "బాగా ఎదిగి పోయింది. ఈ వయసుకి తన భార్య కాపరానికి వచ్చేసింది!" అనుకున్నాడు.

సుజాత కూటాబింది తీసుకుని, కాలవ రేవులోకి వెళ్ళింది. రెండు బిందెలు మంచి నీళ్ళు చేరవేశాక, కూతుర్ని పిలిచాడు పరంధామయ్య.

పడక్కుర్చీ పక్కనే, చాపమీద కుదురుగ కూర్చుంది. భోజనాల వేళ వరకూ తండ్రికి తనతో, చెల్లెలితో కబుర్లు చెప్పడం అలవాటే. కుటుంబ స్థితీ, సమస్యలూ, తల్లి జ్ఞాపకాలూ, గ్రామ విశేషాలు సాధారణంగ దొర్లుతాయి ఆ కబుర్లలో. గోపాలరాజు గురించి మాట్లాడుతూ అతను అంటూ వుంటాడు తరుచు.

"ఏదయిన ఉపకారం చెయ్యాలంటే రాజులకే చెల్లింది. వాళ్ళకా సమర్థతా వుంది; సహృదయతా వుంది. నీతోవుందయ్యా అంటే చాలు! చేస్తానని మాటయిస్తే, యిచ్చినమాట నిలుపుకునే తత్వం అతనిది. ఉదాత్తమైన వ్యక్తిత్వం, రాజ రీవి గల మనిషి గోపాలరాజు!"

ఆలోచిస్తూ కూర్చున్న సుజాతని పరంధామయ్య ప్రశ్నించాడు.

"అమ్మా! సుజాతా! మీ బావ కథ పడింది, చదివావా?"

"చదివాను, నాన్నా!" అని వూరుకుంది

"కథలో సుజాత సూచన గురించి నీ అభిప్రాయం ఏవిటి?"

"సుజాత సూచన బాగానే వుంది. కాని ఆ సూచన ఎంతవరకు ఆచరణ సాధ్యం అన్న దానికి, కథలో సమాధానం చెప్పలేదు. ఆడది ఉద్యోగం చేసి పోషిస్తానంటే, సరేనని సయ్యని సిద్ధపడే మగాళ్ళెంత మంది? సంసారంలో వాళ్ల సఖ్యత ఎంత వరకు సుఖ శాంతులతో ఉంటుంది? అన్నది మనం చెప్పలేం!"

"బావ తన అభిప్రాయాన్ని, యీ కథ ద్వారా సూచించాడేమో అనిపిస్తూందమ్మా నాకు!"

"కావచ్చు!"

"అదే బావ అభిప్రాయం అయితే నీ వుద్దేశ్యం ఏమిటి?"

"బావ అభిప్రాయానికీ, నా వుద్దేశ్యానికి సంబంధం ఏవిటి?"

"అదేనమ్మా, నీకు ఉద్యోగం వచ్చాక ఒకవేళ తనకి నిన్ను పెళ్ళాడ్డానికి అభ్యంతరం లేకపోతే, నీ వుద్దేశ్యం ఏవిటి? అంటున్నా!"

అయిదు నిముషాలు మౌనంగా వుండి పోయింది సుజాత.

ఆ నిశ్శబ్దంలో సుజాత మనస్సును అంచనా వేసుకున్నాడు పరంధామయ్య.

"ఉద్యోగం లేందే మగాడికి పెళ్ళాడ్డానికి అర్హత లేదని నా వుద్దేశ్యం. బావకి ఉద్యోగం లేదు ఆస్తి పాస్తులు లేవు. కనీసం వుండడానికి ఓ యిల్లన్నా లేదు. తండ్రి తన చిన్నతనంలో పోగా, తల్లీ తనూ పల్లెటూళ్ళో ఎలా బతుకుతున్నారో భగవంతుడికే తెలియాలి! అటువంటి వాణ్ణి కట్టుకోవడం నా కిష్టం లేదు!"

పరంధామయ్య అంచనా తల్లక్రిందు లయింది.

"బావకేవమ్మా? డిగ్రీ వుంది. మంచి భావుకుడు. ఈవేళ కాకపోతే రేపయిన పైకి రాగలడు— ఉద్యోగవే కావాలా? నిన్ను పిల్లల్ని పోషించక పోలేదు. నీకెలాగు ఉద్యోగం వుంటుంది. ఇద్దరూ అన్యోన్యంగ గడిపెయ్యొచ్చు గదా?"

తల పంకించి ఊరుకుంది సుజాత.

పమిటకొంగుని చేతులు తుడుచుకుంటూ వచ్చి, తండ్రిని అక్కని లోపలకి భోజనాలకి పిలిచింది, ప్రమీల.

2

"నాన్నకి మరికాస్త తగ్గే వరకూ ఉండండి అత్తయ్యా!" అంటూ కోరారు సుజాత, ప్రమీల.

వాళ్లలా కోరిన మీదట, కాదనలేక మరో నాలుగురోజులు ఉండడానికే నిర్ణయించుకున్నారు, కిష్టప్ప-తల్లీ.

పరంధామయ్య మూడు పథ్యాలుతిని లేచి, కాస్త మాట్లాడగలుగుతున్నాడు. కిష్టప్ప, తల్లి తెల్లవారితే వెడతారనగ, పరంధామయ్య తీసుకు రావాల్సిన ప్రసక్తే తీసుకు వచ్చాడు.

పిల్లలు యిద్దరూ యిష్టపడి చేసుకుంటే, తనకేం కావాలంది కిష్టప్ప తల్లి.

ముఖ్యంగ సుజాత, కిష్టప్ప చర్చించు

కుని నిర్ణయించుకుంటే బాగుంటుందని పించింది, ఆ యిద్దరికీ.

మామూలుగ పాఠాలు చెప్పడం కోసం వెళ్ళి, సాయంత్రం గోపాలరాజు యింటి నుంచి తిరిగి వచ్చిన సుజాత ఆ రోజు హుషారుగ వచ్చింది. అందరూ కూర్చున్న ఆ సమయంలో సుజాత శుభవార్త వెల్లడించింది

"మన వూళ్ళో స్కూల్లో రిటైర్మెంటు వేకెన్సీలోకి నన్ను వేయించబోతున్నట్లు గోపాలరాజుగారు చెప్పారు ఈ నెలాఖరుకి రిటైరుమెంటు ఉంది తిరిగి బళ్ళు తెరిచేసరికి నేను జాయిను కావచ్చు. మన ఊళ్ళోనే వేయించడం, మన అదృష్టం, ఆయన మంచితనం!" అని వివరించింది.

పరంధామయ్య సంతోషించాడు–కిష్టప్ప సంతోషించినా, గోపాలరాజు మాట రాగానే ముఖం ముడిచాడు. గోపాలరాజు ఏ విధంగా రాజకీయంగ బలపడుతున్నదీ గ్రహించాడు. అధికార యంత్రాంగాన్ని తన రాజకీయాలకి ఎలా వాడుకుంటున్నదీ పసిగట్టాడు. అంచేత, సంతోషం, బాధ మిళితమై మౌనంగ వుండిపోయాడు.

కిష్టప్ప మౌనాన్ని సుజాత శంకించింది. పరంధామయ్య అర్థం చేసుకోగలిగాడు. ప్రమీల ప్రమోదం ప్రకటించింది.

కిష్టప్ప తల్లి "బావుందమ్మా! బావుంది!" అంది.

ఆ రాత్రి భోజనాలయాక, తీరికగ కూర్చున్న సమయాన నీలాకాశం మీద చంద్రుడు విహరిస్తూ, కాలవ నీటికి వెండి కాంతులు పూస్తున్నవేళ, సుజాత-కిష్టప్ప కష్ట సుఖాలు చెప్పుకుంటున్నట్లు సంభాషణ ప్రారంభించారు.

"సుజాతా! మావయ్య పెద్దవాడయిపోయాడు. నీకు ఉద్యోగం అయింది కనుక, అతన్ని పద్దులకీ, తోటలకీ వెళ్ళనీయకు. ఇంటి పట్టున ఉంచి, జాగ్రత్తగ చూసుకోండి!"

"మా ఉద్దేశ్యం అదే. కానయితే అతను వింటాడనా? కాస్త పుష్టి చేకూరిందంటే కాలిదాసు కొట్టుమీద కూర్చోవాలి అనీ తోటలకి దింపులకి అనీ వెళ్లకుండ వుంటే అంతే చాలు!"

"ప్రమీలనేం చేద్దామని నీ ఉద్దేశ్యం?"

"అది మిషను కుట్టడం నేర్చుకుంటోంది డిప్లమా చేస్తూంది. కేవలం జాకెట్లు, లంగాలు కుట్టడంకాక, మగవాళ్ల పేంట్లు, బుష్ షర్టులు, కోట్లు కుట్టడం శ్మాసీ యంగా నేరుస్తూంది. మిషన్లు విప్పి బాగుచేయడం నేర్చుకుంటుంది."

"దీనివల్ల ఈ పల్లెటూళ్ళో ఏం పని దొరుకుతుంది?"

"అవసరం అయితే పట్నవాసానికి చేరుతుంది విద్య నేర్వడంలో తప్పు లేదుగా? మన బ్లాకు వాళ్ళు మిషన్ సెంటర్ పెట్టి టీచరుని వేశారు. అంతా నేరుస్తున్నారు. ఇప్పుడు మిషనులేని యిళ్ళు లేవు! ఆ మిషన్లు పాడయితే పని దొరుకుతుంది."

"చాలా మంది కేవలం జాకెట్లు కుట్టడం వరకే నేరుస్తున్నారు అధికశాతం మిషన్లు గొప్పకోసం కొనేసి యిళ్ళలో అడ్డంగ పెట్టుకుంటున్నారు! ఆ మిషన్లు పాడవ్వ!"

"చిన్నపిల్లలకి రంగు రంగుల గుడ్డలతో అందంగ రెడీమేడ్ గుడ్డలు కుడితే, పల్లెల్లో మాత్రం డిమాండ్ లేదూ?"

"ఆ మాత్రం ధైర్యం ఉంది, ఫర్వాలేదు!"

"ధైర్యం కాదిది ఆత్మ విశ్వాసం. రెండు పనులు చేయకపోతే, ఎక్కడయిన సరే, సగౌరవంగ బ్రతికేయవచ్చన్న నమ్మకం అంతే!"

"మరి, మీ వివాహాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"చేసుకోవాలనే అవకాశం వస్తే."

"అవకాశం వస్తే అంటే?"

"మా అమ్మాయి పెళ్ళికి వుంది- మీ అబ్బాయికి చేసుకోండి — అంటూ నాన్నని తిప్పడం ఈ పరిస్థితిలో నాకిష్టంలేదు. పెళ్లి అనేది స్త్రీ పురుషులు పరస్పరాకర్షణ, అవసరం అన్న ప్రాతిపదిక మీద ఆధారపడి, కలిపి జీవించడం. దానికి అటు యిటూ, పెద్దవాళ్ళ ప్రమేయం ఎంత తక్కువగ వుంటే అంత మంచిది. ఆకాశం అంత పందిరి, ఏటిగట్టంత పెళ్లి పీట అక్కర్లేదు. కావలసింది ఒకరిపట్ల ఒకరికి నిష్కల్మషమైన అనురాగం-అంతే!"


"కబుర్లు చెప్పినంత సులువు కాదు, అవకాశం రావడం!"

"అదే వస్తుంది — ఆడపిల్లలందరూ యిలా ఆలోచించి, ఆచరించ గలిగితే — మగవాళ్ళు— తనకి నచ్చిన కన్యని తప్పక కోరుకుని, స్వీకరిస్తాడని నా నమ్మకం!"

సంభాషణ డొంక తిరుగుడుగ నడుస్తూందని గ్రహించారు పరంధామయ్య, కిష్టప్ప తల్లీను. కిష్టప్ప తల్లి అంది.

"ఎందుకీ ముసుగులో గుద్దులాట? ఒరేకృష్ణా! నువ్వు సుజాత పెళ్లి చేసుకుని, ఒక యింటి వాళ్ళవడం, మావయ్య నేను కోరుకుంటున్నది. ఆ విషయం మాట్లాడండి."

అనుకోని యీ దారి మళ్ళింపుకి, సుజాత, కిష్టప్ప మౌనంగ ఉండిపోయారు.



అయిదు నిముషాల యాక, కిష్టప్ప అన్నాడు.

"ఇష్టాయిష్టాల ప్రసక్తే అయినట్లయితే నా అభ్యంతరంలేదు!"

"ఇష్టం ఒకటే కాదు చూడవలసింది! మనకిష్టం అయినవన్నీ ఆచరించనూ లేం!"

"మనం పెళ్ళాడి సంసారం సాగించడం ఆచరణీయం కాదంటావా?"

"కాదనలేను. కాని, కొన్ని సందేహాలు!"

"ఏవిటవి?"

"నువ్వు ఆ వర్క్‌షాప్‌లో ఎలా బ్రతుకుతున్నావో నాకు తెలీని విషయం. ఉద్యోగం కోసం, నువ్వు చేస్తున్న కృషి ఏవిటో నాకు అంతుపట్టని విషయం?"

"అదా? నీ సందేహం? నేను మెట్రిక్కు చదివే కుర్రవాళ్ళకి లెక్కలు, ఇంగ్లీషు, హిస్టరీ చెప్పగలను. ఓ పదిమంది స్టూడెంట్స్ వుంటే, మూడు వందలు వస్తాయి."

"ఇలా విడుగూ బొడుగూ లేని వ్యాపకాలతో ఎంతకాలం? గోపాలరాజుద్వారా కృషి చేస్తే, కాస్త మంచి ఉద్యోగం శాశ్వతంగా దొరుకుతుంది కదా?"

"ఆ పేరెత్తకు! నా పేరు చెబితే చిల్లిగవ్వంత ఉపకారం జరగదు. గ్రామ నౌకరు ఉద్యోగానికి కూడ, ఓ రాజకీయనేతని పట్టుకుంటేనేగాని పని జరగదు అని మన పరాల్లోకి ఎక్కించారు. దేశానికి స్వతంత్రం వచ్చాక, యీ ముప్ఫయి సంవత్సరాల్లోనూ

మమత

యువతరానికి మనం అందించిన సందేశం యిది. ఎంత చదివిన వాడికయినా స్వయం కృషి మీద, స్వయం ప్రతిభ మీద. ఉద్యోగం వస్తుందన్న ఆత్మ విశ్వాసాన్ని కలిగించలేక పోయాం. నేను ఉద్యోగం కోసం వీళ్ళని దేవిరిస్తానన్నది కలలో మాట!"

"నీ ప్రతిభ మీద నీకు ఉద్యోగం వస్తుందా?"

"రాదు! నా ప్రతిభ, నా సిన్సియారిటీచాలదు వీళ్ళకి. నా కులం, జిల్లా, పార్టీ కూడా కావాలి. కబుర్లలో దొర్లించే సమత, సర్వ సమానత్వం వాళ్ళ హృదయాలకి లేదు."

కిష్టప్ప తల్లి తిరిగి కలగజేసుకుంది.

"వీళ్ళు ఒకట్రెండు సరిగ సంసారం చేస్తారా అని?"

ఎవరినీ ఉద్దేశించని ఆ ప్రశ్నకి, పరంధామయ్య జవాబు చెప్పాడు.

"ఈ తరంవాళ్ళ వాళ్ళు. అన్నీ తెలుసుకుంటున్నారు. మాట్లాడుకుంటున్నారు. మాట్లాడుకుని నిర్ణయించుకుంటే బాధలు ఉండవు కదా?"

"వీళ్ళకి ఏ బాధలూ రావంటావా?"

"వచ్చినా మనకన్న సవ్యంగా చక్కబెట్టుకోగలరు!"

పరంధామయ్య మాటలు అందరికీ నచ్చాయి. సుజాతకి ధైర్యాన్ని, ఉత్సాహాన్ని యిచ్చాయి.

కిష్టప్ప—తల్లీ వెళ్ళిపోయారు. సుజాత తన వివాహం గురించి ఎట్టూ తేల్చుకోలేకపోయింది.

* * *

ప్రమీలకి, కుట్టుమిషన్ కంపెనీ నుంచి ఆఫరొచ్చింది, సేల్స్ రిప్రెజెంటేటివ్‌గ పని చేయడానికి. విశాఖపట్నంలోని ఉషా షో రూంలో హాజరు కావాలి. ఇంటింటికీ వెళ్ళి కుట్టుమిషన్‌కి ఆర్డర్లు సంపాదించాలి. అమ్మకం అయిన మిషన్లు గ్యారంటీ పీరియడ్‌లో పాడయితే బాగుచేయాలి. జీతం కాక, ఆర్డర్ల మీద కొంత కమీషను, తిరిగి రావడానికి కొంత బేటా అన్నీ నాలుగు వందలు పైన గిడతాయి.

ఆరోజు సాయంకాలం, కూతుళ్ళిద్దరినీ సరసన కూర్చోబెట్టుకుని, ప్రమీల గురించి మాట్లాడుతున్నాడు.

"నువ్వేం చేయకలవమ్మా యీ నౌకరి? ఆర్డర్లు సంపాదించడం మాటలా? ఆ తరువాత రిపేర్లు చూడాలి... పోనిద్దూ మరో నౌకరీ చూసుకోవచ్చు!"

"అలా అనకు నాన్నా! నా కాళ్ళ మీద నేను నిలబడాలిగా? అక్కయ్య మీద ఎంత కాలం? తనూ పెళ్ళి చేసుకోవాలిగా? నా గురించి తను పెళ్ళికి సిద్ధపడ్డం లేదని పిస్తోంది!"

"ఛఛా! అదేంకాదు! ప్రమీలా! ఆ విషయం దేనికిప్పుడు? నీకు చేయగలనన్న ధైర్యం వుందా?"

"ఆ! నిశ్చింతగా చేయగలను. అదేమంత కష్టమైన పని కాదు! నాకొచ్చిన ఎంబ్రాయిడరీ నేర్పడానికి క్లాసెస్ పెడితే, ఆ విధంగ గడించగలను. నన్ను వెళ్ళనీయండి!"

"అక్కడ ఎలా వుంటావమ్మా? అన్నీ ఆలోచించుకోవాలిగా?"


"అదేవిటి నాన్నా! ప్రమీల ఒక్కతే వెళ్ళదు! మీరు కూడా వుంటారు!"

"మరి, నువ్వు ఒంటరిగా వుండగలవా?" ప్రమీల అడిగింది.

"అప్పటికేం కుదిరేది కాదమ్మా?" అనేశాడు పరంధామయ్య.

ఆ మాట యిద్దరు కూతుళ్ళకీ నచ్చలేదు.

[36వ పేజీ చూడండి]



ఇప్పుడు! చురుకైన జీవనంకోసం శక్తినిచ్చే ఇంధనాన్ని సేవించండి.



బూస్ట్

మాల్ట్ చాకొలెట్ మిల్క్ డ్రింకు

రైలు మోస్తరుగానే మీకు కూడా ప్రతి రోజు ఉత్సాహంగా ప్రారంభించేందుకు ఇంధనం కావాలి. అందుచేతనే ప్రతి ఉదయం మీరు బూస్ట్ సేవించాలి.

మీరు చకచకా పనులు చేసుకోవడంలో మీకు తోడ్పడే శక్తిదాయకమైన ఇంధనం. ముఖ్యంగా చదువులోను, ఆటల్లోను అదనంగా శక్తిని వెచ్చించే మీ పిల్లలకు ఇది కావాలి.

వారికి బూస్ట్ యివ్వండి. ఇది మాల్ట్ చాకొలెట్ మిల్క్ డ్రింకు. పౌష్టికాహారం గురించి సంపూర్ణంగా తెలిసిన 'హార్లిక్స్' ఉత్పత్తిదారులు తయారు చేసింది.

సంపన్నమయిన క్రీముతో కూడిన బూస్ట్ మీకు మరింతగా శక్తినిస్తుంది. ఎందుచేతనంటే ఇది సంపూర్ణమయిన మీగడ పాలతోను, గోధుమతోను, బార్లీ మాల్ట్‌తోను, కోకోతోను తయారయింది.

బూస్ట్‌లో మీ పిల్లల పెరుగుదలకుగాను, ఇటువంటి మరే ఇతర చాకొలెట్ డ్రింకులోను లేనంత ఎక్కువగా పౌష్టిక పదార్థాలు ఉన్నాయి.

అంతేకాదు. బూస్ట్‌కి, మీ కుటుంబమంతా కూడా యిష్టపడే క్రీమ్ మాల్ట్ చాకొలెట్ రుచి, సువాసన ఉన్నాయి. బూస్ట్, మీ రోజుని ప్రారంభించేందుకు ఖచ్చితమైన మార్గం—ప్రతి రోజు.

రెండు సైజులలో లభిస్తుంది.

'హార్లిక్స్' ఉత్పత్తిదారులనుంచి.

S-4575-TEL-1

సగంలో ముగింపు

ప్రయాగ రామకృష్ణ

కాదంబరి కృష్ణ చిన్నప్పటి నుంచి కలిసి మెలిసి చదువుకున్నారు. పక్క పక్కనే వుండేవి యిళ్ళు. చిన్నప్పటి నుంచి వొకటే తత్వం కాదంబరిది. తనెంతనుకుంటే అంత. తనకేది తోస్తే అది. చిన్నతనంలో కాదంబరి చేసిన అల్లరి పనులు ఏ మగపిల్లలూ చేసుండరు.



పెద్దకథ

కోతికొమ్మచ్చాడేది కర్రాబిళ్ళ ఆడేది. కత్తులు కటార్లు పట్టుకు తిరిగేది. గోలీకాయలాడి ఆ వీధిలో పిల్లలందర్నీ వోడించి వాళ్ళ గోలీలన్నీ తన వొళ్ళో పోసుకొచ్చేది. వాళ్ళు బిక్కమొగం వేసుకుని నిలబడితే తను నవ్వుతుండేది అదేమంటే మూడుపగళ్ళు మూడురాత్రుళ్ళు యేడ్చేది. వేళకి స్నానము, బొట్టు, కాటుక వుండేవి కావు. బొడ్డు కిందకు చెడ్డీ జారిపోతుండేది. గౌనుకు గుండీలుండేవికావు ఐనా యివేమీలక్ష్యపెట్టేదికాదు. మగపిల్లలతో సమానంగా తిరుగుతుండేది. "నువ్వసలు ఆడపిల్లవేటే ?" అని వాళ్ళమ్మ కోప్పడితే కాదంబరికెంత చిరాకేసేదో...మంచిబట్టలు వేసుకోమనేది వాళ్ళమ్మ. చక్కగా తలదువ్వుకుని పూలు పెట్టుకోమనేది. కాదంబరికి అవన్నీ విసుగు. 'ఏం పూలు పెట్టుకోకపోతే... అబ్బబ్బ అయినా రెండు పూట్ల స్నానం యెవరు చేస్తారే' అనేది తీరుబడి లేనట్టు ఎప్పుడూ హడావిడే; ఆ బళ్ళో కూర్చున్న కాసేపూ యేమోకాని. అప్పుడూ యేవో తగాదాలు తెస్తుండేది ఇంటిమీదకు. అదేమంటే చచ్చేటంత కోపం. మొండిఘటం.

పదమూడో ఏటో యేమో పెద్దమనిషైంది కాదంబరి. 'నువ్వింకా నీ యిష్టం వచ్చినట్టు తిరగడానికి వీలేదు అమ్మడూ' అంది వాళ్ళమ్మ. కాదంబరి ఏమిటోలే అనుకుంది. తరువాత వాళ్ళమ్మేమిటో చెప్పి దూరంగా వెళ్ళి కూర్చోమంది. ఏడుపొచ్చింది ఒకరోజూ రెండురోజులా మూడురోజులు. పెద్ద నరకం! ఎక్కడికీ కదలడానికి వీల్లేదు, కట్టేసినట్టు. ఎప్పుడెప్పుడు బయటకు పోయి బిళ్ళంగోడి ఆడుకుందామా అనుండేది కాదంబరికి. వుహూ పోనిస్తేనా. పొద్దస్తమానం కాపలా వుండేది వాళ్ళమ్మ. తూనీగ కాళ్ళకు దారం కట్టినట్టు యేమిటిది ... యేమిటీ అస్వతంత్రత ... తన చుట్టూ యింతమంది ఆడవాళ్ళేమిటి... యేమిటీ

పెరుగుతున్న సంవత్సరాలు

కాల్షియం-శాండోజ్®

సంవత్సరాలు








పాప పుట్టక ముందు నుంచే, పాప యొక్క పళ్ళూ ఎముకలూ రూపొందటం మొదలెడతాయి. పసిదనం నుంచీ, పెరిగే వయస్సులో అంతా కూడా కాల్షియం ఎంతో కీలకమైనది.

మీ పాపకి గనక, పెరుగుతూన్న ఏ దశలోనైనా సరే, అవసరమైనంత కాల్షియం లభించకపోతే, తరవాత ఎంత యిచ్చినా ప్రయోజనం ఉండదు. అందుకే నేడే మీ పాపకు కాల్షియం-శాండోజ్ యివ్వడం మొదలెట్టండి. రోజుకు నాలుగు కాల్షియం-శాండోజ్ బిళ్ళలు గనక యిస్తే, అవి పెరిగే దశలోని ఆ ఏళ్ళలో అత్యవసరమైన కాల్షియంను సమకూర్చి, గట్టిపళ్ళనూ, పటిష్టమైన ఎముకలనూ రూపొందిస్తాయి. విటమిన్ సి, డి మరియు బి^{12}తో పటిష్టం చేయబడిన కాల్షియం-శాండోజ్ బిళ్లల్లో, పిల్లలకి యిష్టమయ్యే రుచిగల వెనీలా సువాసన ఉంది.

కాల్షియం-శాండోజ్ స్విట్జర్లాండ్‌లోని శాండోజ్ వారు రూపొందించినది, ప్రపంచంలోని అత్యుత్తమమైన కాల్షియం.



ఇప్పుడు అమోఘమైన కొత్త ప్యాక్‌లో దొరుకుతోంది. ఎక్కువ ధర పెట్టకుండానే.

కాల్షియం-శాండోజ్®

గట్టిపళ్ళు, పటిష్టమైన ఎముకల కోసం

SANDOZ

daCunha/CS/26 TEL

ముక్కుపచ్చలారని ముగ్ధకి శిశోదయం !

ఒక జపాన్ పత్రిక యీ మధ్యనే పదకొండు సం.ల వయసు గల స్కూలు విద్యార్థిని — అమాయకంగా గర్భవతియై — తొమ్మిది మాసాలు మోసి — మూడు 'కేజీల' బరువున్న శిశువును కన్న వైనం ప్రకటిస్తూ, యింత పిన్నవయస్సులో గర్భవతియై ఆరోగ్యవంతమైన బిడ్డను కనడానికి, జపాన్‌లో వున్న వాతావరణ పరిస్థితులు, పుష్టికరమైన ఆహారమే కారణమని — గొప్పగా రాసింది — ఈ బాలిక 240 రోజులూ కూడా, తన క్లాసులకు — హాజరైంది — తాను గర్భవతిని అన్న విషయం కూడా తెలీదు పాపం! వాళ్ల స్కూల్లో పెద్ద పరుగు పందెం ఒకటి జరిగితే అందులో పాల్గొని రయ్యిన పరుగులు తీసింది! ఇంతకీ యీ పసిపిల్లమీద యీ అఘాయిత్యంచేసిన పెద్దమనిషి ఎవరా?ని 'ఆరా' తీయగా—ఆ ప్రబుద్ధుడు ఒక టాక్సీ డ్రైవర్ అని తేలింది అతగాడి వయసు 38 సం లు భార్యా, యిద్దరు పిల్లలు వున్న మగధీరుడు!

పాటలు పద్యాలు అమ్మకు చాదస్తం మరీ ఎక్కువవుతోంది చుట్టుపక్కల వాళ్ళందర్నీ పిలిచింది. ఎందుకో తెలీదు తనెప్పుడైనా సినిమాకని అమ్మని ఐదో, ఏదో అడిగితే బోలెడన్ని కూడికలు హెచ్చవేతలు కలబోసి కష్టసుఖాలన్నీ యాకరువు పెట్టేది. మరిప్పుడింత డబ్బెందుకు తగలేస్తున్నట్టో ...

అమ్మ గౌన్లు మానెయ్యమంది లంగాలు, వోణీలు వేసుకోమన్నప్పుడు పెద్ద రాద్ధాంతం చేసింది కాదంబరి 'నేనంత పెద్దదాన్నయ్యానేమిటి' అనేది ఏడుస్తూ తన్లకేం చెప్పాలో తెలీలేదు కాదంబరి గునుస్తూనేవుంది తరువాత తరువాత తనకు తెలీకుండానే ఏదో మార్పు ఆ మార్పేదో వింతగా అనిపించింది ఒంటరిగా గదిలో నిలబడి వొంటివైపు చూసుకుంటే తనకే సిగ్గేసింది సౌందర్యం మైనంలా కరిగి ఆకృతి దిద్దుకున్నట్టు వొళ్ళంతా వంపులు, లాలిత్యం చిదికి విరబూసినట్టు బుగ్గలనిండా సిగ్గుపూలు, కళ్ళనిండా మెత్తగా కమ్ముకుంటున్న మత్తు అలవోకగా కనురెప్పలు మూతబడుతున్నాయి. శరీరం అంతా ఏదో కొత్తగా వుంది వొకటే అలజడి

ఏమిటిది? ఏమో! తన కేమీ తెలీడంలేదు కాని, ఏదో బాధ తియ్యగా హాయిగా

ఈ బాధ ఎలా తీరేటట్టు? ఎవరు తీర్చేటట్టు?

అమ్మ ప్రపంచం వేరు. పూజలు పునస్కారాలు, గుళ్ళుగోపురాలు. తనేమైపోతేనేం. తనోరోజు పుస్తకాలు, క్యారేజి సర్దుకుని స్కూలుకు వెళ్ళబోతుంటే పక్కింటావిడొచ్చింది

వస్తూనే 'మేనమామ యింట్లో వుండనని వొకటే గొడవ. పిల్లవెధవలక్కూడ ఎంతెంత అభిమానాలండీ.. వాళ్ళ నాన్నగారు వెళ్లి తీసుకొచ్చారు నిన్న ఇక్కడే ఏదో స్కూల్లో వేర్పించాలి మా చిన్నవాడ్ని కూడ' అంది అమ్మతో.

స్కూలుకు వెళ్ళబోతున్న కాదంబరి గిర్రున వెనక్కితిరిగి చూసింది — ఎవరా చిన్నవాడు అని.

'అదే మా కృష్ణండీ . మా అన్నయ్య దగ్గరుండి చదువుకుంటున్నాడని చెప్పానే. .వాడు.'

అమ్మ ముక్కాలుపీట తీసుకొచ్చి వేసింది ఆవిడ్ని కూర్చోమని మనసు మనసులో లేదు కాదంబరికి, బడికి వెళ్లిందేకాని.

సగంలో ముగింపు

మాటిమాటికి చిన్నవాడు గుర్తొస్తున్నాడు

సాయంత్రం స్కూలు నుంచి వచ్చేసరికి పక్కింటి గుమ్మంలో మెరుపులా ఓ పసివాడు కనిపించాడు మే మిసమిసి తెల్లటి పైజమా, బనీను ఎంతో అందంగా వున్నాడు కళ్లార్పకుండా చూసింది కాదంబరి అతనే సిగ్గుపడ్డాడు సిగ్గుపడే కుర్రాళ్లని ఏడిపించాలనుంటుంది కాదంబరికి. అతనికి దగ్గరగా వెళ్లింది వెళ్లి, 'కృష్ణకదూ నీ పేరు' అంది

నీకెలా తెలుసు' ఎదురుప్రశ్న వేసాడు

'తెలుసులే' అని నవ్వింది

నవ్వి, వెళ్లబోతుంటే 'కాదంబరీ' అంటూ పిలిచాడు. ఆశ్చర్యంవేసింది తన పేరెలా తెలిసిందా అని

'నీకెవరు చెప్పారు నా పేరు కాదంబరని'

'తెలుసులే' అని నవ్వాడు అతనుకూడ.

కాదంబరికి కోపం వచ్చింది విసురుగా జడ వెనక్కువేసుకుంది. అంది పట్టుకున్నాడు.

'ఏమిటిది వదులు ముందు' కోపంగా అంది

ఐనాసరే అతను వదిలిపెట్టలేదు. మరింత దగ్గరగా వచ్చాడు ముఖాన్ని అరచేతుల్లోకి తీసుకున్నాడు. భయంవేసింది. అంతలోనే సిగ్గేసింది. కోపంకూడ వచ్చింది. అతను రెండు చేతులూ తన చుట్టూ వేసి గుండెలకు హత్తుకున్నాడు. ఒళ్ళంతా వొకటే పులకరింత చక్కిలిగింత పెట్టినట్టు కాదంబరికి కోపం పోయి సిగ్గు ముంచుకొచ్చింది. ఇంతలో అమ్మ గొంతు వినిపించింది లోపల్నుంచి — 'వీధి గుమ్మంలో ఏమిటా యికయికలు పకపకలూనూ. లోపలికిరా.' దూరంగా జరిగింది తను.

* * *

పక్క పక్కనే ఇళ్లు వాళ్లవి. ఎవరి వసారాల్లో వాళ్ళు నిలబడితేచాలు ఎవరింట్లో ఏం జరుగుతోందో స్పష్టంగా తెలుస్తుంది. కాదంబరీ వాళ్లమ్మ ప్రతి శనివారం తలంటిపోసుకుని దేవుడికి పూజ చేసేది. కొబ్బరి వడపప్పు ఆరోజు దేవుడికి నైవేద్యం. అదే చుట్టూవున్నవాళ్లకి ప్రసాదం. ఎప్పుడన్నా శనివారంనాడు కృష్ణ, కాదంబరీ వాళ్లింటికి వెళ్లకపోతే పెరటి గుమ్మంలోంచి తనే పట్టుకొచ్చేది అవన్నీ. కాదంబరిని, రోజూ వచ్చి స్కూలుకు పిలుచుకువెళ్లేవాడు కృష్ణ రాగానే కాదంబరీ వాళ్లమ్మకు నమస్కారం చేసేవాడు ఆవిడ పాపం పొంగిపోయేది.

'ఎంత నమ్రత, ఎంత వినయం చూసి నేర్చుకో బుద్ధొస్తుంది' అనేది అమ్మ.

ఆవిడకేం తెలుసు ఇదంతా నటనని అక్కడున్న కాసేపూ కన్నెత్తయినా చూసేవాడుకాదు తనవైపు ఎక్కడలేని కోపమూ వచ్చేది తనకు కావాలని చేతికున్న గాజులు గలగలలాడించేది ఊహూ. పట్టనట్టు వూరుకునేవాడు ఎందుకింత మంచితనం. ఎవరికోసం? ఏం చేసుకోను?

ఇద్దర్నీ కలిసి బడికి వెళ్లమనేది అమ్మ అలాగే చేసేవాళ్లు కాని వొచ్చిన చిక్కల్లా వొక్కటే గుమ్మం దాటి బయటకు రాగానే మొదలయ్యేవి కృష్ణ లీలలు వెనక బెంచీలో కూర్చుని వొకటే గొడవ చక్కిలిగింతలు పెట్టేవాడు. పాఠం వింటున్నట్టు నటిస్తూనే జడకుచ్చులు లాగుతుండేవాడు పవిట చెరగుకు ముళ్లేస్తుండేవాడు

'ఎంతటి రసికుడవో, ఎంతటి గడుసరివో ప్రియా ప్రియా' అని పాడాలనిపించేది కాని, ఏమీ ఎరగనట్టు వూరుకునేది ఎందుకొచ్చిన పాఠాలు. ఎందుకొచ్చిన పరీక్షలు ఫీజులు దండగ ఎంచక్కా రెక్కలు విప్పుకుని ఆకాశంలోకి ఎగిరి పోవాలనిపించేది.

మూడవ పీరియడ్ తరువాత 'బ్రేక్' బ్రేకులో కలుసుకునే వాళ్లిద్దరూ పక్కపక్కనే కూర్చుని కబుర్లు చెప్పుకునేవాళ్ళు వొక్కోక్కప్పుడు వెనకగా వెళ్లి కళ్ళు మూసేది తనే కనుక్కోలేక పోవడానికేముంది 'కాదంబరివే' అనేవాడు కళ్ళని కప్పిన చేతుల్ని తాకుతూ నవ్వుతూ ఎదురుగా వెళ్లి కూర్చునేది.

కాని ఎంతసేపు.. ఎంతసేపోనా పదినిముషాల్లో మళ్లీ గంట మోగించేవారు. కల కరిగేది

క్లాసు లోపలికి వెళ్లినప్పటినుంచి మళ్లీ ఎప్పుడు గంట కొడ్తారా అనే. ఎప్పుడో ఐదింటికి్కాని విముక్తుండేదికాదు అశోకుడ్ని గురించి, అంగారక గ్రహం గురించి ... పొద్దున పదింటి నుంచి సాయంత్రం ఐదింటి వరకూ యింతే. ఎవరో చేసిన ఘనకార్యాలని మనం తవ్వి తలకెత్తుకోవడం. పెద్ద బోర్. రిలీఫ్ వుండేదికాదు. ఎందుకొచ్చిన చదువులు ఎవరిని వుద్ధరించను మనసుకు శరీరానికి సుఖం లేకపోయాక.

రాత్రి చాలా పొద్దుపోయేవరకూ పుస్తకాలు ముందరేసుకుని కూర్చుంది తను. 'కూతురింత బుద్ధిమంతురాలైందేమిటా' అనుకుంటుంది అమ్మ. తననేం పలకరించలేదు. వెళ్లి నడవలో మంచం వాల్చుకు పడుకుంది. పది ... పదిన్నర.. పదకొండు ... ఐనా సరే నిదుర రావడంలేదు తనకు. వెళ్లి వసారాలో నిలబడింది గుండెలమీద పుస్తకం గుండెలమీదే వుంది కృష్ణ పడకకుర్చీలో పడుకుని కునికిపాట్లు పడుతున్నాడు. కాగితం రాకెట్‌లా చేసి మీదకు విసిరింది. ఉలిక్కిపడ్డాడు కళ్ళు నులుముకు చూస్తే, కాదంబరి కనిపించిం దెదురుగా చుట్టూతా చూసాడు అందరూ గాఢనిద్రలో వున్నారు 'కాదంబరీ' అంటూ

కృష్ణ కంఠం వినిపించింది దగ్గరగా కాదంబరి ఎదురు పలకలేదు

'నిన్నే మాట్లాడవేం' అన్నాడు

'ఏం ఎందుకు మాట్లాడాలి నేను నిదురరాక ఛస్తుంటే నీకు నిదురెలా పట్టిందసలు ' కళ్ళనీళ్ళ పర్యంతం అయింది తను కృష్ణ పెదిమలు వణికాయి కాదంబరి తన్మయత్వంలో కళ్ళు మూసుకుంది మూసుకున్న కనురెప్పల్ని పెదాలతో తాకా ఎంత హాయిగా అనిపిస్తుందో ... కళ్ళు తెరచి అతని కళ్ళల్లోకి చూసింది అతని కళ్ళ వెలుగు తప్పితే అంతా చీకటే చీకటిలో తనూ, కృష్ణ భయం వేసింది భయంవేసి అతన్ని విడిపించుకుని ఒక్క అంగలో వసారాలోకి వెళ్ళి నిలబడింది తన అడుగుల చప్పుడికి అమ్మ మేలుకుంది.

'ఇంతసేపూ మేలుకునేం చేస్తున్నావే' అంది. తనేం మాట్లాడలేను 'లైటార్పి పడుకో' అంది అమ్మ

అలాగే చేసింది తను కాని నిద్రపడితేనా

ఎవరివో తియ్యటి పెదిమలు, మెత్తటి చేతులు ముద్దుపెట్టుకుంటున్నట్టు గుండెల్ని రాస్తున్నట్టు కలట తెల్లవారింది కాని ఎప్పటికీ తెల్లవారంది మాత్రం తన బ్రతుకొకటే ఈ విషయం చాల ఆలస్యంగా తెలిసింది

ఆ యేడు తను పరీక్ష తప్పింది తప్పినట్టు తెలిసిన రోజున భోరున ఏడ్చింది. తనింతవరకూ చదువులో ఎప్పుడూ వెనకబడలేదు. ఈ ఏడు ఆ ముచ్చట తీరింది. చాలనుకుంది కాదంబరి కింకా స్కూలుకు వెళ్ళబుద్ధికాలేదు నేనింకా స్కూలుకు వెళ్ళనని మానేసింది. తనా నిర్ణయం తీసుకున్నప్పుడు అమ్మ కోప్పడ్డానికి బదులు నవ్వింది నవ్వి 'ఎప్పుడూ నీదే పై చేయి అనుకోకు అమ్మడూ! జీవితంలో వొక్కొక్కప్పుడు వోటమిని కూడ అనుభవించాలి సీతాకోకచిలుకలా రెక్కలు సాచి ఎగిరినన్నాళ్ళూ ఎగురుతాం కాని, ఎగరలేని రోజంటూ కూడ వొకటొస్తుంది అప్పుడు మాత్రం గుండెలవిసిపోయేలా ఏడవకూడదు ఓర్పు కావాలప్పుడే నాటకంలో చిత్తం మహాప్రభూ అనేవాడిక్కూడ ప్రాముఖ్యత వుంటుంది అది మాత్రం మరిచిపోకు' అంటూ వోదార్చింది.

వోదార్పో హెచ్చరికో అర్థంకాలేదు

మనసు తేలికబడటానికి బదులు మరింతగా ఏడ్చింది. వోదార్పు ఒత్తిడికి తట్టుకోలేక గుండె చిదికి నీళ్ళు కళ్ళల్లోకి చిందాయి వెచ్చగా కన్నీళ్ళు. కన్నీళ్ళ సెగలో మొహం ఎరుపెక్కి తమలపాకులా మెత్తబడితే; అమ్మ నవ్వుతూ తన మొహాన్ని దోసిట్లోకి తీసుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకుంది.

ఎక్కడో అంతర్యపు లోతుల్లో తలుపు తట్టినట్టు అమ్మ ప్రేమ శరీరాన్ని తడుపుతోంది.

అమ్మ వో రిటైర్డ్ జడ్జీ ముద్దుల కూతురు. వాళ్ళ నాన్నగారికి బోలెడంత ఆస్తి వుండేదిట. ఇంక లోటేమిటి. అమ్మ యేదనుకుంటే అది అక్షరాల జరిగేది. కాలు కింద పెట్టకుండా కార్లల్లో తిరుగుతుండేది అమ్మ బీ.ఏ. పాసైంది. పై చదువులకి యూనివర్శిటీ కెళ్దామను కుంటుంటే పెళ్ళి చేస్తామన్నార్ట యింట్లోవాళ్ళు. అప్పటికే నాన్నగారు తెలుసుట అమ్మకు ఆయన వుండీ లేని స్థితిలో పెరిగారు చిన్న వుద్యోగ మేదో చేస్తుండేవారుట. అమ్మా వాళ్ళింటెదురుకుండా ఓ గదిలో అద్దెకుండేవారు అదీ పరిచయం

అమ్మకు యేవేవో సంబంధాలు చూసారు ఏ ఒక్కటీ నచ్చలేదు ఎవరికీ చివరికి యెవరో 'లా' పాసైన కుర్రాడ్ని వెతికారు తన పలుకుబడితో వున్న వూళ్ళోనే అతనిచేత ప్రాక్టీసు పెట్టించొచ్చుకదా అని తాతగారి అభిప్రాయం. సరే అంటే సరు అనుకుని నిశ్చయ తాంబూలాలు కూడ తీసుకోవడానికి సిద్ధమయ్యారు. కాని అమ్మకు ఇష్టంలేదు. ఇల్లు వదిలి నాన్నతో వచ్చేసింది 'నన్ను కట్టుకుని నువ్వేం సుఖపడలేవని' నాన్న చెప్పినా అమ్మ వినలేదుట మొండిగా వాదించిందిట. 'మీరు లేకుండా నేనొక్క క్షణం కూడ బతకనని' బెదిరించిందిట. అంతే వున్నఫళంగా ఇద్దరూ వచ్చేసారు అయినవాళ్ళకి దూరంగా చాల రోజులు యెక్కడెక్కడో తిరిగారు వున్న వుద్యోగం వదిలేసుకుని 'నా' అన్న వాళ్ళెవ్వరూ లేకుండా చాల ఇబ్బందులు పడ్డారిద్దరూ. కాని, అప్పుడు అమ్మే కొండంత అండట ఆయనకు అమ్మ యెంత గారాబంగా పెరిగినా ఆ సుఖాలేవీ తలుచుకోకుండా నాన్నకు ధైర్యం చెబుతూ తను నవ్వుతూ, ఆయన్ని నవ్విస్తూ వుండేదిట. తరువాత అమ్మా నాన్న బొంబే చేరారు. అక్కడ ఓ చిన్న సంస్థలో నాన్న గుమస్తాగిరికి కుదిరారు. నూటయాభై రూపాయలో యేమో ఇచ్చేవార్ట. వచ్చే డబ్బుకి అయ్యే ఖర్చుకి ఎక్కడా పొంతనుండేదికాదు బొంబేలో బతకడం కష్టమనిపించి మళ్ళీ యిద్దరూ రైలెక్కారు తరువాత విజయవాడ. అక్కడకూడ నాన్న కష్టాలతో కొన్నాళ్ళు గుక్క తిప్పుకోలేకపోయారు ఆ తరువాత మళ్ళీ ఆయనకు ఓ ప్రైవేటు ఫాక్టరీలో వుద్యోగం దొరికింది. తరువాత నేను పుట్టాను నేను పుట్టిన తరువాతనే జీవితం కొద్ది గొప్పో అనుకూలించడం మొదలు పెట్టిందిట అమ్మా నాన్నలతో అందుకే నేనంటే ప్రాణం అమ్మకు. నాకు ఐదారేళ్ళొచ్చేంతవరకూ నాన్న వున్నారు. తరువాత ఓ రాత్రి ఏలూరురోడ్డు మీద కారు ప్రమాదం జరిగింది ఫాక్టరీలో పని చూసుకుని పదైన తరువాత రోడ్డు పక్కగా నడిచొస్తున్న నాన్న మీదనుంచి యెవరో కారు తోలేసారు కారు తోలుతున్న పెద్దమనిషి పీకల వరకూ తాగేసున్నాడు. పోలీసులొచ్చికూడ యేమీ చెయ్యలేకపోయార్ట ఆయన అక్కడకు దగ్గరలో వున్న యేదో ఎస్టేట్ అధిపతిట. పలుకుబడున్న వాడు. కాసులు గలవాడె రాజు ఇంక కేసేమిటి అమ్మకు మిగిలిందేమిటి చీకటి 'నా' అన్నవాళ్ళు నవ్వుతూ పలకరించేవాళ్ళు ఎవ్వరూ లేరు. కాని అమ్మకు ధైర్యం ఎక్కువ గుండె రాయి చేసుకుంది అక్కడే అందర్నీ మంచి చేసుకుని నిలదొక్కుకుంది నాన్న పోయిన తరువాత ఫాక్టరీవాళ్ళు అమ్మకో చిన్న వుద్యోగం ఇచ్చారు. బీ. ఏ వరకూ చదివిన చదువు అప్పుడుపయోగపడింది అమ్మ ఆశలన్నీ నామీదే. నన్ను చూసుకుని నవ్వుతూ కాలం గడిపేది ఎంత నవ్వుతూ బ్రతుకుదామనుకున్నా తరగని పగళ్ళు దీర్ఘ రాత్రులు అమ్మను కలవర పరుస్తుండేవి మోకాళ్ళమీద తలాన్చుకుని అలా శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయేది. ఎప్పటికి తెల్లవారేను. ఈ బ్రతు కెప్పటికి కడతేరేను

ఏడుస్తున్న అమ్మ ఎప్పుడైనా నా కంటబడితే పక్కకు తిరిగి పమిటకొంగుతో కళ్ళు తుడుచుకునేది.

'ఏం అమ్మలూ' అని ఏవీ లేనట్టు పలకరించేది

ఎంత నిబ్బరం.

కాదంబరి కళ్ళు చెమ్మగిల్లాయి. వెనక్కి వొరిగి కళ్ళు మూసుకుంది రెప్పల్ని తోసుకుంటూ కన్నీళ్ళు బుగ్గలమీదగా జారాయి ఏదో బాధ లేచి చన్నీళ్ళతో ముఖం తడుపుకుంటే ఎంతో పెద్ద అలసట తీరినట్టయింది ముఖం



తుడుచుకున్న తరువాత వూడిన జుట్టు దువ్వుకోబోయి, బద్ధకంవేసి వొదులుగా ముడి వేసుకుంది.

సన్నగా చీకటి వసారాలోకి నడిచి గోడ చుట్టూ నిలువుగావున్న చువ్వలమీద చేతులు ఆన్చి — ఆకాశంలోకి చూస్తూ నిలబడింది కృష్ణ వచ్చాడు అతన్ని చూడగానే కన్నీళ్ళాగలేదు

'ఏమిటి కాదంబరీ ఏమైంది '

కాదంబరేం మాట్లాడలేదు

'అమాయకత్వం అంతకుమించేం కాదు ఎరీక్షేదో తప్పినంతమాత్రాన జీవితం తలకిందులైందనుకోకు ఇందాక అమ్మతో చెప్తుంటే విన్నాను— ఈ ఏడో వచ్చే ఏడో మీ అమ్మగారు నీకు పెళ్లి చేస్తార్ట విష్ యు బెస్ట్ ఆఫ్ లక్ '

ఎవరికీ వినిపించనంత గట్టిగా దూరంగా వెళ్లి ఏ శిఖరంమీదనో నిలబడి గుండెలు పగిలేలా ఏడవాలనిపించింది వెళ్ళి వరండాలో లైటార్పి పాదాలచుట్టూ పరుచుకునేలా చీరకొంగులు సరిచేసుకుని కూర్చుంది కృష్ణ కూడా వెళ్ళి, కాదంబరికి దగ్గరగా జరిగి కూర్చున్నాడు

'మీ అమ్మ నిజంగా నీకు పెళ్ళి చేస్తుందా' ఎంత అమాయకంగా అడిగాడో నవ్వి వూరుకుంది కాదంబరి. 'ఏమో నాకేం తెలుసు నువ్వే చెప్పావు'

మాట్లాడలేదు చిన్నపిల్లాడిలా ముఖం పెట్టాడు

జాలేసింది అతన్ని దగ్గరకు తీసుకుని గుండెల్లో ముఖం దాచుకుంది అతను ఆర్తిగా పిచ్చిగా కాదంబరి చేతిని పదేపదే ముద్దుపెట్టుకున్నాడు అతనంత దగ్గరగా వుంటే అతని ఉఛ్ఛ్వాస నిఛ్ఛ్వాసాలు వెచ్చగా తగులుతున్నాయి అతని పెదవులు కాదంబరి జుట్టును తాకుతున్నాయి

కృష్ణా

కాదంబరి పిలుపుకి వులిక్కిపడ్డాడు తప్పు చేసినట్టు దూరంగా జరిగి కూర్చున్నాడు

'అయాం సారీ '

సగంలో ముగింపు

'ఇప్పుడేమైందని ఈ క్షమాపణలు.'

మాట్లాడలేదు

తరువాతెప్పటికో — 'నీకు పెళ్ళయిపోతే ' ఏదో అడగాలనుకుని మధ్యలోనే ఆగిపోయాడు

'వూఁ పెళ్ళయిపోతే '

'నాకు నువ్వు నీకు నేను ఏవీ కావన్నమాట '

ఎంత ప్రయత్నించినా సాధ్యంకాలేదు పెద్దపెట్టున ఏడుపొచ్చింది. ఎప్పుడొచ్చిందో అమ్మ గుడినుంచి. చూడనైనా చూడలేదు.

'ఏమిటా ఏడుపు కాదంబరీ అర్ధంపర్ధం లేకుండా' అంది

పరీక్ష పోయినందుకే ఇంకా బాధపడుతున్నానని అమ్మ వుద్దేశ్యం

కళ్ళు తుడుచుకుంది తను

మరునటి రోజు సాయంత్రం కృష్ణ కొసాడు మళ్ళీ తను కాలేజీలో చేరబోతున్నాడట 'మామయ్యగారూ వెళుతున్నాను ఎప్పుడో సెలవులకొచ్చినప్పుడు కలవడమే మళ్ళీ మనం' అన్నాడు

నిజమా!

కన్నీటి పొర అడ్డుపడింది.

అంతా అలికినట్టయింది.

మౌనంగా యిద్దరూ బయటకొచ్చారు రిక్షా ఎక్కారు. కాదంబరి పక్కకు తిరిగి ఎటో చూస్తోంది

'ఎక్కడికి పోనివ్వాలో చెప్పలేదు '

'బ్యారేజీ దగ్గరకు.'

దోవపొడుగునా కాదంబరేం మాట్లాడలేదు. కృష్ణకూ అలాగే వుంది ఏమీ తోచనట్టుగా అయోమయంగా. బ్యారేజీ దగ్గర ఆగి ఈ మూల నుంచి ఆ మూలవరకూ నడుచుకెళ్ళి కింద యిసుకలోకి దిగారు. దూరంగా వెళ్ళి కూర్చున్నారిద్దరూ. కీనీడ చీకటి వెలుతురూ కలిసి కల్నేత చీరలా వుంది

'కాదంబరీ నిన్నొక మాటడగనా' అన్నాడు

'అడుగు దానిక్కూడ నా పర్మిషన్ దేనికి' అంది నవ్వుతూ.

కృష్ణ వొక్క క్షణం సందేహించాడు.

'నేను నిన్ను ప్రేమిస్తున్నాను '

'ఐ టూ ... అయినా దీనికింత మొహమాట పడాల్సిందేముంది '

కృష్ణ కాదంబరి చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు

'మీ అమ్మ నీకోసం సంబంధాలు వెతుకుతుందేమో నేను నిన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పు మనిషిమీద మనిషికి నమ్మకం వుండాలి ఆ నమ్మకం కొరవడితేనే ఒట్లు, ప్రమాణాలూను వాటితో అవసరం లేదనుకుంటాను అయినా నీకోసం చెబుతున్నాను భగవంతుడిమీద ప్రమాణంగా నిన్ను నాదాన్ని చేసుకుంటాను సరేనా' అన్నాడు.

'నాకోసం చెబుతున్నాడట. మాటలు నేర్చాడు ' మనసులోనే అనుకుంది 'ఏం నేనే యెందుకు చెప్పాలి నువు వచ్చి మా అమ్మతో చెప్పినంత మాత్రాన నీ మగపిల్లవాడి బెట్టేం తగ్గదు నువ్వే వచ్చి చెప్పు '

'ష్యూర్' నవ్వుతూ అన్నాడు

ఆ చిరునవ్వుని హృదయమంతా నింపుకోవాలనిపించింది లేచి నిలబడి చేయందించింది చిటికనవేలు పట్టుకుని పైకి లేచాడు. పక్క పక్కనే నడుస్తున్నారిద్దరూ ఇంతలో ఆటో వచ్చింది. ఎక్కి కూర్చున్నారు వీధి మలుపు దగ్గర ఆపాడు అతను కాదంబరిని ఇంటి దగ్గర దింపేసి వెళ్లిపోయాడు కృష్ణ.

ఆ రాత్రల్లా సరిగా నిదురలేదు. అందీ అందకుండా ఏవేవో ఆలోచనలు.

మరునాడు తను వాళ్ళ మామయ్యగారింటి కెళ్లిపోయాడు. తను శిలాప్రతిమలా నిలబడింది, అలాగే వీధరుగుమీద. అమ్మొచ్చి ఏమిటే 'ఆ పరధ్యానం' అనేంతవరకూ ఏమీ తెలీలేదు తనకు.


'పరధ్యానంకాదు. కృష్ణధ్యానం ' మనసులోనే అనుకుంది చిన్నగా నవ్వొచ్చింది

కృష్ణ ఎప్పటికీ తనదగ్గరే వుంటే, వుండిపోతే ఎంత బాగుండు. అతనితో కబుర్లు చెప్తూ, కలిసిమెలిసి తిరుగుతూ, రోజులు క్షణాల్లా గడుపుతూ — హాయిగా తమాషాగా సరదాగా ఎంత బాగుంటుంది.

కాని, ఎలా — మగపిల్లవాడు చదువుకోవాలి చదువుకుని పైకి రావాలి. నాలుగురాళ్ళు సంపాదించాలి. ఇక్కడుంటే చెడిపోతున్నాడట మేనమామ దగ్గరైతే భయభక్తుల్తో మెలుగుతాడట. వాళ్ళమ్మే చెప్పింది. చచ్చేటంత కోపం వచ్చింది తనకు.

ఏమిటి చెడిపోవడం. చెడిపోవడానికి ఆదెక్కడో అంతమెక్కడో ఎవరికి తెలుసు. అన్నీ మనం అనుకోవడమే. జరిగేవేవో జరగక మానవు.

[ఇంకా వుంది]





ఈ 8 కారణాలకోసం...
అవతలనుండి పొందించు మూత, ఎక్కువ వండే స్థలావకాశం
అతి సులభముగా ఉపయోగించుటకు మరియు సురక్షితానికై పొందపరచబడింది
సాటిలేని సేఫ్టీ వాల్వ్, మూడువిధాలుగా రక్షించుతుంది
ఎక్కువ దార్ఢ్యం మరియు దప్పంగానున్న అడుగు ఎక్కువ కాలం వాడటానికి హామీ
Prestige
ఐ. ఎస్. ఐ. మార్కు : గుణవిశేషాలకు హామి
ఆహారంయొక్క సత్వాంశములనూ, వాటి సువాసననూ కాపాడుతుంది
దేశం నలుమూలల్లోనూ సర్వీస్ కేంద్రాలు
4 లీటర్లనుండి 12 లీటర్ల వరకు వివిధ సైజులు
భారతపు ప్రథమ ప్రెషర్ కుకర్
నేడు కూడా విపులంగా
ఉపయోగింపబడుతున్నది
Prestige
ప్రెస్టీజ్
టి టి. (ప్రైవేట్) లి.
బెంగళూరు–560 016

MCA/TT/50-Tel



రాత్రి ఏడు గంటలైంది. సుశీల పిల్లలిద్దరికీ అన్నాలు పెట్టి వాళ్లను పడుకోమని చెప్పి తను నాలుగు జాకెట్లు తీసుకుని చేతిపని చేస్తూ కూర్చుంది.

మనసంతా అదోలా వుంది. ఆఫీసు పనిమీద వూరు వెళ్లిన భర్త శంకరం మూడు రోజులైనా తిరిగి రాలేదు అసలు క్యాంపుకే వెళ్లారో? లేక మరెక్కడికైనా వెళ్లారో? మొట్టమొదటిసారిగా భర్తమీద అనుమానం, కోపం, చిరాకు, అసహ్యం కలిగాయి

దానికి కారణం లేకపోలేదు. నాలుగు రోజులు క్రితం సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి రావలిసిన శంకరం తెల్లవార్లూ రాకుండా ఉదయం ఎనిమిదింటికి దిగాడు. "ఏమండీ రాత్రి రాలేదేమిటి?" అని అడిగితే "ఎన్నాళ్ళనుండో పెండింగ్‌లో వున్న వర్కంతా కంప్లీట్ చెయ్యమని మా ఆఫీసరు చెప్పాడు. నా స్నేహితుడు మురళి, నేను కూర్చుని తెల్లవార్లూ పని చేశాము. అతనితో కలిసి హోటల్‌కెళ్ళి భోజనం చేశాను పని పూర్తయ్యేసరికి రాత్రి మూడయింది. అంత రాత్రప్పుడు ఇంటికి రావటం బద్ధకం వేసి ఇద్దరం అలాగే బెంచీలమీద పడుకున్నాము అబ్బ నడుం పట్టేసిందనుకో" అన్నాడు.

కాని ఆ మురళి భార్య సుశీలను పరిచయం చేసుకునేందుకు వీళ్ళింటికి వచ్చింది. మాటల సందర్భంలో "అన్నయ్యగారు మొన్న మా ఇంట్లోనే పడుకున్నారు. మా పక్క రూమ్‌లో ఓ బ్రైపిస్టు వుంటున్నాడు అతనికి పెళ్లి కాలేదు. అతని రూమ్‌లో వీళ్ళందరూ సీసాలు తెచ్చుకుని పార్టీ చేసుకున్నారని" చెప్పింది

ఇంకా తన భర్త తాగుడు, పేకాటలాంటి వ్యసనాలకు బానిస అని, అదేమంటే తనను చావబాదుతాడని తమ పుట్టింటివాళ్ళు చాలా పేదవాళ్ళని, పెళ్ళికి ముందే మురళికి చదువు చెప్పించి పెళ్లి చేశారని, కట్నం రూపేణా ఏమీ ఇవ్వలేదని, ఎప్పుడూ పోట్లాడుతాడని, ఏదైనా అంటే మావాళ్ళు పెట్టలేనివాళ్ళని చీటికీ, మాటికీ పుట్టింటికి పొమ్మని అంటాడని, మరో దారనేది లేక పిల్లల కోసం జీవచ్ఛవంలా బ్రతుకుతున్నానని పాపం ఆవిడ మనసులోని వ్యధంతా సుశీల దగ్గర వెళ్ళబోసుకుంది

తొలి పరిచయంలోనే మనసులోని వ్యధనంతా చెప్పుకుంటున్న ఆవిడ అమాయకత్వానికి సుశీలకు చాలా జాలనిపించింది ఆవిడ వెళ్లిన దగ్గరనుండి సుశీలకు మనసు మనసులో లేదు భర్తమీద విపరీతంగా కోపం వచ్చింది. వాళ్ళింట్లో తాగి తందనాలాడివచ్చి ఆఫీసులో వర్క్ చేశానని ఎంత బాగా అబద్ధమాడారు? పదేళ్ళ వైవాహిక జీవితంలో ఏనాడన్నా ఇలా అబద్ధాలాడికాని, చెడు పనులు చేసికాని ఎరగరు.

బదిలీ అయ్యి ఈ వూరొచ్చి మూడ్నెల్లయింది. అప్పటినుండి ఆయనలో ఏదో మార్పు వస్తోంది టైమ్‌కు ఇంటికి రావటం కాని జీతం సరిగా ఇవ్వటంకాని జరగడంలేదు. అదేమని అడిగితే ఏదోవకటి కుంటిసాకులు చెప్తూ తప్పించుకుంటున్నారు ఇదంతా చెడు సావాసదోషమే.

వ్యసనం అనేది లేకుండానే వుండాలికాని ఏ కొంచెంవున్నా వేరుపురుగులా కాపురాల్ని నిలువునా కూల్చెయ్యగలదు. ఏమంటూ ఈ బదిలీ వచ్చిందో కాని అప్పటినుండి తనకు ఎడతెరిపి లేకుండా కుడికన్ను అదురుతోంది ఇన్నాళ్ళు వాతంవల్లనేమో అనుకుంది కాదు, కాదు. తనకేదో తీవ్రమైన ముప్పే వాటిల్లనున్నది తను ముందుగానే మేల్కొని ఆయన్ని వ్యసనాలజోలికి పోకుండా సాధ్యమైనంతవరకు కట్టుదిట్టం చెయ్యాలనుకుంది.

* * *

సుశీల కలవారింట్లో పుట్టి ఎంతో అపురూపంగా పెరిగింది ముగ్గురాడపిల్లల్లో రెండవది సుశీల సుశీలకు హైస్కూల్ చదువే సరిగా ఒంటపట్టలేదు. కట్నం పెద్దమొత్తం ఇచ్చి ఇంజనీర్‌కిచ్చి పెళ్లి చెయ్యాలనుకున్నారు తల్లితండ్రులు కాని వూళ్ళోనే వున్న వేలువిడిచిన మేనత్త కొడుకు శంకరంను ప్రేమించింది సుశీల.

శంకరం స్కూల్ ఫైనల్ పాసై ఓ గవర్నమెంటు ఆఫీసులో ఎల్ డి. సి. గా ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం తప్పించి మరే ఇతర ఆస్తిపాస్తులు లేవు. కుంటా, సెంటూ ఆస్తి లేని శంకరాన్ని అల్లుడిగా చేసుకోవటం సుశీల తల్లి తండ్రులకు సుతరామూ ఇష్టంలేదు "శంకరాన్ని తప్పించి మరెవర్నీ పెళ్లి చేసుకోను. అలా జరిగిననాడు తను జీవించనని గట్టిగా చెప్పింది" సుశీల. చేసేది లేక ఇష్టంలేకున్నా సుశీలను శంకరానికిచ్చి పెళ్లి చేసి బాధ్యత తీరిందనుకున్నారు తల్లితండ్రులు

కాపురానికొచ్చిన ఆరు నెలలకే భర్త జీతంతో ఇల్లు గడవదని తెలుసుకుంది సుశీల. మిషన్ కుట్టటం కొద్దిగా వొచ్చుకనుక ఓ సాయిబాబు దగ్గర నెలకు ముప్పై రూపాయలు ఇచ్చి రెండు నెలల్లో ఆడవాళ్ళవి, మొగవాళ్ళవి

అన్నిరకాల కత్తిరింపులూ, కుట్టటం నేర్చుకుంది.

వాయిదాల ప్రకారం డబ్బు కట్టేట్టు మిషన్ కొనుక్కుని బట్టలు కుడుతూ మిషన్ బాకీ తీర్చేసి ఇంట్లోకి కావలసిన సామానంతా ఏర్పర్చుకుంది. ఇద్దరబ్బాయిల తరువాత ఆపరేషన్ చేయించుకుంది. ఆధునిక గృహిణికి కావలసిన పరికరాలన్నీ రేడియో, ఫాన్, గ్ద్రేజ్ బీరువా, కుక్కర్, గ్యాస్ పొయ్యి, అలారం టైమ్‌పీస్ లాంటివన్నీ ఏర్పర్చుకుంది. చేతులకు గాజులు, మెడలోకి గొలుసు చేయించుకుంది.

భర్తకు వచ్చే జీతం నాలుగొందల్లో నెలకు వంద రూపాయలు బ్యాంకులో వేస్తూ సంసారం ఎంతో పొదుపుగ చేసుకొస్తోంది. శంకరం కూడ చేతి ఖర్చుకి ఓ పాతిక వుంచుకుని మిగిలిన డబ్బంతా సుశీల చేతికిచ్చేవాడు. అలా నెల నెలా బ్యాంకులో వేసిన డబ్బు అయిదు వేలు కాగా వడ్డీ వస్తుందని ఫిక్సడ్‌లో వేశారు ఆ డబ్బుతో గుడివాడలో స్థలం కొనుక్కోవాలని కూడ అనుకున్నారు.

బంధువులెవర్రూ రాకపోకలు లేకపోయినా సుశీల బాబాయి కొడుకు రామారావు మాత్రం అప్పుడప్పుడొచ్చిపోతుంటాడు. అతనికి సుశీలంటే ప్రాణం. రామారావుకు చెప్పారు. గుడివాడలో ఏదైనా స్థలం అమ్మకానికొస్తే కొనిపెట్టమని.

జాకెట్లన్నిటికీ చేతిపని చేసి గుండీలు కుట్టింది. ఇంతలో క్యాంపునుండి శంకరం తిరిగొచ్చాడు. భర్తను చూస్తూనే సుశీలకు పట్టరాని కోపం వచ్చింది. కాని వెంటనే తమాయించుకుంది. భోజనం చేసి పడుకున్నాక మెల్లగా అడిగింది. "స్నేహితుడు మురళి ఇంట్లో పార్టీకెళ్ళి ఆఫీసులో పనిచేసి బెంచీమీద పడుకున్నానని చెప్పారే ?" అని.

అది విన్న శంకరం ముందు కంగారుపడ్డాడు. ఆ తరువాత "నీకెలా తెల్సు ?" అన్నాడు కోపంగా.

"ఎలా తెలిస్తే మీకెందుకు ? జరిగింది నిజమా, కాదా ?" గద్దించింది సుశీల పట్టుబడిన దొంగలా "ఏదో వెళ్ళానంట్లూ" నీళ్ళు నమిలాడు శంకరం.

"చూడండి ఈ వ్యసనాలనేవి జారుడుమెట్లు లాంటివి. తెలిసో తెలియకో వక్క మెట్టు జారితే మిగిలినవి వాటంతటవే జారిపడేలా చేస్తాయి."

"కాని ఈ చెడు వ్యసనాల జారుడుమెట్లు మీదనుండి జారిపడిన మనిషి పాతాళంలాంటి అగాధంలోకి పోతాడు. కనుక ఇంకెప్పుడూ అలాంటి వ్యసనాల జోలికి పోకండి' అంది

"ఏదో సరదాగా స్నేహితులతో కలిసి వక్కసారి పార్టీకెళ్ళినందుకు ఏమిటి నీ గొడవ ?" చిరాగ్గా అన్నాడు శంకరం

"వక్కసారి సరదాగా వెళ్ళారా ? అసలు వకటి అనేది లేనిదే రెండవది ఎలా వస్తుంది ? మీలో బలహీనత వుండబట్టే ఆ వక్కసారికూడ వెళ్ళగలిగారు. నేను రాను అంటే కాళ్ళూ, చేతులూ పట్టి లాక్కెళ్ళేవారా ? లేక బలవంతంగా నోరు తెరిచి గొంతులో పోసేవారా ?" రెట్టించింది సుశీల

ఆమెతో వాదించటం యిష్టంలేని శంకరం "నీతో వాగే ఓపిక నాకు లేదు. నిద్రొస్తోంది" అంటూ అటు తిరిగి పడుకున్నాడు. తెగేదాకా లాగటం మంచిదికాదులే అని సుశీల కూడ వూరుకుంది.

* * *

రోజులు గడుస్తున్నాయి కాని శంకరంలో మాత్రం మార్పు రాలేదు. స్నేహితులతో కలిసి తాగటం, పేకాడ్డం ఏ అర్ధరాత్రికో యింటికి రావటం, జీతం పూర్తిగా తన విలాసాలకే వాడుకోవటం మొదలుపెట్టాడు

సుశీల ఎంతో ఓర్పు, సహనంతో సాధ్యమైనంతవరకు అనునయంగా చెప్పిచూసింది. కాని ఫలితం లేకపోయింది ఓర్పు నశించిన సుశీల ఏదో వకటి అనటం యిద్దరిమధ్యన పెద్ద రాద్ధాంతం జరిగి నాలుగేసిరోజులు మాటలు లేకపోవటం జరుగుతోంది. వీళ్ళిద్దరి తగాదాల మధ్యన అమాయకులైన పిల్లలు మనసులు నలిగిపోతున్నాయి. వాళ్లకు తండ్రి అంటే ఒకవిధమైన అసహ్యం కలిగి శంకరం నీడను చూడగానే పులిని చూసినట్లుగా భయపడి పోతున్నారు.

సుశీలకు మనసు మనసులోలేదు. కడుపునిండా భోజనం చెయ్యలేకపోతోంది. కంటినిండా నిద్రపోలేకపోతోంది. ఎక్కడ కూర్చున్నా ఏ పని చేస్తున్నా మనసుకు ఏదో ఆరాటంగా వుంది. ప్రశాంతత అనేది కరువైంది. ఏదో చెయ్యాలన్న ఆవేశం, ఏమీ చెయ్యలేని అసహాయత. కంటికీ, మంటికీ ఏకధారగా ఏడుస్తూ బాధపడుతోంది.

ఓ రోజు ఆఫీసు ప్యూన్ యింటికి వస్తే అడిగింది, "వీళ్లు ఎక్కడ కూర్చుంటారని ?"

ఆఫీసరుగారు వెళ్లిన తరువాత ఆఫీసులోనే కూర్చుంటారని, సీసాలతోపాటు కావలసిన సరంజామా అంతా తనతోనే తెప్పించుకుంటారని, అసలీ మురళీబాబుగారి మూలానే చాలామంది చెడిపోతున్నారని, ఏదైనా అంటే ప్యూన్ ముండావాడ్ని మూడు నిమిషాల్లో ఆఫీసరుగార్కి రిపోర్టిచ్చి బదిలీ చేయించగలరని, అందుకే తనేమీ అనకుండా వాళ్ళు చెప్పిందల్లా తెచ్చిస్తుంటానని" ఎంతో బాధపడిపోతూ చెప్పాడు

ఆర్రాత్రి పదిగంటలైనా శంకరం యింటికి రాలేదు. పిల్లలిద్దర్రూ నిద్రపోతుంటే బయటి తలుపుకు తాళంవేసి ఆఫీసుకు వెళ్లింది సుశీల. వాచ్‌మెన్ వరండాలోనే కూర్చున్నాడు. "అయ్యగారున్నారా ?" అని అడిగింది. వాడు లోపలికెళ్లి చూడకుండానే "ఉన్నారండి" అన్నాడు "అమ్మగారొచ్చింది. మిమ్మల్ని రమ్మంటున్నారని చెప్పరా" అంది. వాడు లోపలి కెళ్ళొచ్చి "వస్తా పదమన్నారండి" అన్నాడు.

అది విన్న సుశీలకు చిర్రెత్తుకొచ్చింది. గబగబ లోపలికెళ్లి "లేచొస్తారా" అంది కటువుగా. శంకరం మాట్లాడలేదు. పక్కనున్న వాళ్లంతా సుశీలను అదోలా చూస్తున్నారు. ఓ నిముషమాగి "లేచొస్తారారండి. లేకపోతే నేను కూడ కూర్చుని ఆడతాను" అంది కోపంగా.

అది విన్న మురళి "ఏం గురూ వ్యవహారం ఇంతదాకా రానిచ్చావ్ ? ఫస్టులోనే యివ్వాల్సింది వార్నింగ్. మావాళ్ళకూడ మొదట్లో యిలాగే గొడవచేశారు. వక్కసారి డోసిచ్చాను. బస్ మళ్లీ నోరెత్తదనుకో" అన్నాడు వెకిలిగా.

సుశీలకు అరికాలిమంట నెత్తికెక్కింది. "దుర్మార్గుడా నా వచ్చనికాపురంలో నిప్పులు పోసినందుకు నా వుసురు, నా బిడ్డల వుసురు ఏదోనాటికి తప్పకుండా తగులుతుంది" అంటూ మురళిని తిట్టటం మొదలుపెట్టింది.

శంకరం ఏమనుకున్నాడోఏమో ? చేతిలోవున్న పేకముక్కలను విసురుగా బల్లకేసికొట్టి చరచరా బయటకు నడిచాడు దారిలో ఎవరూ మాట్లాడుకోలేదు. ఇంటికి రాగానే "ఆఫీసుకు వచ్చి నా పరువుతీస్తావా ?" విసురుగా సుశీలను కొట్టటానికి మీదికి వెళ్లాడు.

"ఆగు వక్కడుగు ముందుకు వేశావో నీ మర్యాద దక్కదు." దెబ్బతిన్న ఆడబెబ్బులిలా అరిచింది సుశీల.

"ఏం చేస్తావ్ ? ఎదురుతిరిగి కొడతావా?" కోపంగా అడిగాడు శంకరం.

"తప్పకుండాను." సూటిగా సమాధాన మిచ్చింది సుశీల.

క్రోధంతో సుశీల వంక కాసేపు చూసి "ఛీ! ఛీ! యిది ఇల్లుకాదు నరకం" అంటూ బయటకు వెళ్లిపోయాడు.

వాయిదాల ప్రకారం ఇంట్లో ఫర్నిచరంతా కొని అప్పులన్నీ తీరిపోయిననాడు సంతోషంగా తన భుజాలమీద చేతులువేసి వడిపిస్తూ "స్వర్గమిదే ఇలలో" అంటూ ఈలపాట పాడిన శంకరమేనా ఈయన అనుకుంది సుశీల

ఆ పోవటం, పోవటం రెండురోజుల వరకూ ఇంటికి రాలేదు శంకరం.

మూడవరోజు అర్ధరాత్రి వచ్చాడు. ఆ తెల్లారి వెళ్తూ సుశీల చూడకుండా అలారం టైమ్‌పీస్ పట్టుకుపోయాడు. రోజూ యిలాగే వచ్చి ఏదో వక వస్తువు పట్టుకుపోతాడని ఆ రాత్రి శంకరం ఎంతగా తలుపుకొట్టి పిలిచినా పలక్కుండా తలుపు తియ్యలేదు సుశీల

మర్నాడు ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతంలో ఇంటికొచ్చాడు శంకరం. "నన్ను క్షమించు సుశీలా ! ఆ మురళిగాడి మాటలు విని వ్యసనాలకు బానిసనై నిన్ను నవసరంగా కష్టపెట్టాను. ఈరోజు నుండి వాటన్నిటికీ స్వస్తి చెప్పేశాను." తనలోని నమ్మకాన్నంతా మాటల్లో పొందుపరుస్తూ అన్నాడు.

భర్తలో కలిగిన ఈ మార్పుకు సుశీలకు చాలా సంతోషం కలిగింది. ఆమె మనసిప్పుడు తేలిగ్గా దూదిపింజలా ప్రశాంతంగా వుంది పనులన్నీ చురుగ్గా చేసేస్తోంది. స్నానానికి వేణ్ణీళ్ళుపెట్టి చకచక వంట చేసేసింది. ఇద్దరూ కలిసి భోజనం చేశారు.

సుశీల నడిగి తాళాలు తీసుకుని బీరువాలో నుండి బట్టలుతీసి వేసుకుని ఆఫీసుకువెళ్లిపోయాడు. సాయంత్రం ఆఫీసు కాగానే యింటికి వచ్చాడు కాఫీ, టిఫిన్ రడీగా వుంచింది సుశీల కాఫీ తాగుతూ హాయిగా నవ్వుతూ ఎన్నో కబుర్లు

[32 వ పేజీ చూడండి]



సినిమా విశేష

సుభాషిణి చిత్రాలు

"అగ్రదర్శకుడు" శ్రీ దాసరి ఎవర్ని పరిచయం చేసినా ... వారు "బిజీ" అవడం, ప్రేక్షకులు గ్రహించిన నిజం ప్రముఖ నటి కుమారి జయసుధ తోబుట్టువు సుభాషిణికి "శివరంజని"లో ప్రాముఖ్యతవున్న పాత్రను శ్రీ దాసరి యివ్వడం ... జనవిదితం.

ఇప్పుడామె ఎన్ని చిత్రాలలో నటిస్తున్నదో తెలుసా ?

మారుతీ కంబైన్స్ వారి "శివకేశవులు", శ్రీధర్‌గారు నిర్మిస్తున్న కొత్త చిత్రం, శ్రీ దాసరి రూపొందించనున్న "సీతాకోకచిలక" గాక వీనస్ కంబైన్స్ తలపెట్టిన కొత్త చిత్రం

అక్కయ్యకు పోటీగా నిలబడగల "కెపాసిటీ" కుమారి సుభాషిణికి వున్నదని, విజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు

అడ్డమైన చిత్రాలను తిరస్కరిస్తూ . తనకు చక్కటి భవిష్యత్తును ఏర్పరచగల చిత్రాలను మాత్రమే అంగీకరించడానికి నిర్ణయించిన సుభాషిణికి . సినిమారంగంలో ప్రముఖస్థానం లభించడం తథ్యము.

సురేష్ అధినేత నిర్మిస్తున్న ప్రయోగాత్మక చిత్రం "కళ్ళు"లో కూడా సుభాషిణికి కథానాయిక పాత్ర వచ్చే అవకాశం కనిపిస్తున్నది ఈ చిత్రానికి శ్రీ తాతినేని రామారావు దర్శకుడు.

'అమ్మ' వద్దు ?

"రామబాణం" చిత్రంలో శోభన్ ... కృష్ణంరాజుగార్లకు తల్లిగా పాత్రపోషణ గావిస్తున్న "ప్రజానటి" జమున ఒక సమంజస నిర్ణయాన్ని తీసుకున్నారు.

ముమ్మందు "అమ్మ" పాత్రను "వద్దు" అని చెప్పడానికి నిర్ణయించాను, అన్నారు శ్రీమతిజమున.

ఆమె తీసుకున్న నిర్ణయం సమంజసమైనదని ఈ కలం భావిస్తున్నది. ఎందుకో తెలుసా ? "ఎవర్‌గ్రీన్"గా వుండే ఆమె "గ్రే లేడీ"గా నటించడంకన్నా ... పీక్‌లో వున్నప్పుడే విరమించడం మంచిదని ఈ కలం భావిస్తున్నది

వీనస్ కంబైన్స్ స్కోప్ వర్ణ చిత్రం

"మంచివాడు, పవిత్ర బంధం" చిత్రాలను నిర్మించిన వీనస్ కంబైన్స్ చాలాకాలం తరువాత.. తెలుగు చిత్ర నిర్మాణానికి వుపక్రమించారు.

అండమాన్ దీవిలో నవంబరు... డిశంబరు నెలలలో జరిగే చిత్రీకరణలో డాక్టర్ నాగేశ్వరరావు, కుమారి వాణిశ్రీ, చంద్రమోహన్ పాల్గొనగలరని, నిర్మాణ నిర్వాహకుడు శ్రీ శాస్త్రి తెలిపారు.

విక్టరీ మధుసూదనరావు దర్శకత్వంలో రూపొందే యీ నవరసభరితమైన వర్ణ చిత్రానికి మహదేవన్... ఆచార్య ఆత్రేయ... బాలకృష్ణ ప్రధాన సాంకేతిక శాఖలను నిర్వహిస్తున్నారు.

నవయుగ ద్వారా విడుదలయ్యే యీ చిత్రానికి శ్రీ గోవిందరాజన్ నిర్మాత

'రామచిలక'లో వాణిశ్రీ

భారతం ప్రథమాంకం పూర్తయ్యింది

మహాభారతం ప్రథమాంకం పూర్తయింది. కాదు "కలియుగ మహాభారతం" ప్రథమాంకం పూర్తయింది శ్రీ సత్యం ఎంటర్‌ప్రైజస్ పతాకం క్రింద శ్రీ జి. సత్యనారాయణ నిర్మిస్తున్న వెరైటీ సినిమాస్కోప్ వర్ణ చిత్రం "కలియుగ మహాభారతం" ఆగస్టు 21 న ప్రసాద్‌లో ప్రారంభమై, సెప్టెంబర్ 5కు ఫస్టు షెడ్యూల్ పూర్తిచేసుకుంది విక్టరీ మధుసూదనరావుగారి క్లాప్, శ్రీ చటర్జీ స్విచ్ఆన్‌లతో ఆరంభమైన "కలియుగ మహాభారతం" శ్రీ హనుమాన్‌ప్రసాద్ దర్శకత్వంలో క్రొత్తపుంతలు త్రొక్కింది

హోప్‌ఫుల్ స్కోప్ చిత్రంగా "కలియుగ మహాభారతం"ను పేర్కొనవచ్చు అని కొందరు రసజ్ఞులు రషస్ చూచాక చెబుతున్నారు. "హనుమాన్‌ప్రసాద్ హై థింకింగ్ ప్రతి ఫ్రేములో కన్పిస్తుంది ఆర్టిస్టుల కాంట్రిబ్యూషన్ చాలా బాగుంది" అని కూడా అంటున్నారు.

కృష్ణుడు, కౌరవ, పాండవులుగా

చలం (కృష్ణుడు), నూతన్‌ప్రసాద్ (కలియుగ దుర్యోధనుడు), వంకాయల సత్యనారాయణ (కలియుగ ధృతరాష్ట్రుడు), పి యల్. నారాయణ (కలియుగ శకుని), సత్యేంద్ర కుమార్ (కలియుగ కర్ణుడు), నర్సింహరాజు (కలియుగ అర్జునుడు), హరిబాబు (కలియుగ ధర్మరాజు), రంగారావు (కలియుగి భీముడు) నటిస్తున్న ఈ రంగుల చిత్రంలో మాధవి, లత సహాయ పాత్రలను ధరిస్తున్నారు

క్రొత్తదనం చూపించాలన్నదే నా ఆకాంక్ష అంటారు స్క్రీన్‌ప్లే రైటర్ అండ్ డైరెక్టర్ శ్రీ హనుమాన్‌ప్రసాద్ "అందుకే ఈ తపన. అనుకున్నది సాధించడానికే ఈ తపస్సు" అంటారు చక్కటి భావాలున్న దర్శకుడు శ్రీ హనుమాన్ ప్రసాద్ "ప్రయోగం చేయాలి, ప్రయత్నం చూపాలి, ఫలితం రావాలి" అనే నమ్మకం వున్న శ్రీ హనుమాన్‌ప్రసాద్ దర్శకత్వంలో తయారౌతున్న "కలియుగ మహాభారతం" చిత్రానికి పరుచూరి కథ, మాటలను, సత్యం స్వరాలను, లక్ష్మణగోరే కెమేరాను, భాస్కరరాజు కళను, బాలు కూర్పును, రంగస్వామి కో–డైరెక్షన్ను, కోటిలింగం ప్రొడక్షన్ను సమకూరుస్తున్నారు.

ఇద్దరూ అసాధ్యులే

క్రైమ్ పిక్చర్స్ కింగ్ కె. యస్. ఆర్. దాస్ దర్శకత్వంలో శ్రీ సారధీ స్టూడియోస్ నిర్మిస్తున్న "ఇద్దరూ అసాధ్యులే" సినిమాస్కోప్ వర్ణ చిత్రం విజయా గార్డెన్స్‌లో జరిగిన "సంకురాత్రి సంబరాల జాతరోయి" అనే సాంగ్ రికార్డింగ్‌తో ప్రారంభమయింది. సారధీ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ పంద్రెండవ చిత్రంలో కృష్ణ, రజనీకాంత్, నాగభూషణం, చలం, అల్లురామలింగయ్య, గిరిబాబు, షావుకారు జానకి, లత, మాధవి, గీత ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. శ్రీ జి. డి. ప్రసాదరావు, శ్రీ పి. శశిభూషణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ స్కోప్ వర్ణ చిత్రానికి కథ, మాటలను మహారథి, సంగీతాన్ని సత్యం, ఫొటోగ్రఫీని యస్. యస్. లాల్, కూర్పును పి. వెంకటేశ్వరరావు, కళను వి. కృష్ణమూర్తి, సహకార దర్శకత్వాన్ని కె. రంగారావు సమకూరుస్తున్నారు.

శ్రీధర్ చిత్రంలో నర్సింహరాజు


నర్సింహరాజుకి ఇటీవల ఓ చక్కటి ఆఫర్ వచ్చింది. ప్రముఖ దర్శకుడు శ్రీధర్ దర్శకత్వంలో నర్సింహరాజు నటించబోతున్న శుభదినం అతి దగ్గిరలోనే వుంది. "హనుమాన్‌ప్రసాద్‌గారి "కలియుగ మహాభారతం", ప్రతాప్ ఆర్ట్స రాఘవగారి క్రొత్త చిత్రం, శ్రీ శ్రీధర్‌గారి క్రొత్త చిత్రం, శ్రీ యం. మల్లికార్జునరావుగారి సొంత చిత్రం, నేను క్రొత్తగా సైన్ చేసిన చిత్రాలు" అన్నాడు నర్సింహరాజు.


యోగీ తీస్తున్న "ఎర్రగులాబీ"

యోగీ పూర్తి పేరు యోగానంద్. పరిశ్రమలో అతడ్ని అందరూ పిలిచే పేరుయోగీ. దర్శకత్వ శాఖలో వలసినంత అనుభవాన్ని సంపాదించాడుయోగి. కానీ అతని అనుభవాన్ని వుపయోగించుకునేవారే దొరకలేదు చాలాకాలంవరకు. ఇటీవలె సాంబశివరావు, నర్సింహరావు అనే మంచి మనుషులు యోగి మంచితనాన్ని, చురుకుదనాన్ని గుర్తించి తమ చిత్రానికి దర్శకుడిగా నియమించారు. చిత్రం పేరు "ఎర్రగులాబీ". అరవంలో "ఒరు వూదావూ కనేసిమెట్టు కిరదు" పేరుతో ప్రజాదరణ పొందిన చిత్రానికి తెలుగు రూపకమే "ఎర్రగులాబీ". "చంద్రమోహన్, ఈశ్వరరావు, పద్మప్రియ ఇంతవరకూ ఎన్నికైన తారాగణం "గులాబీ"ని అన్వేషిస్తున్నాము. బాలసుబ్రమణ్యాన్ని సంగీత దర్శకుడిగా, వేటూరిని పాటలకర్తగా, వీరేంద్రనాథ్‌ను మాటలకర్తగా, మధును ఛాయాగ్రాహకుడిగా ఎన్నుకోవడం జరిగింది "గులాబీ" పాత్రకు సరైన నటి దొరకగానే సెట్స్‌పైకి వెళ్లాలనుకుంటున్నాము" అన్నారు దర్శకుడు యోగానంద్, నిర్మాణ నిర్వాహకుడు సంజీవి.



'కటకటాల రుద్రయ్య'లో జయసుధ





సి ని మా

వెంకటేష్ కృషి

అగ్రదర్శకుడు శ్రీ దాసరి చిత్రీకరణలో లక్ష్మి ఫిలిం కంబైన్స్ రూపొందిస్తున్న "రావణుడే రాముడయితే" స్కోప్ వర్ణ చిత్రానికి, సంగీత దర్శకుడు జి. కె. వెంకటేష్ మధురమైన ... మనోజ్ఞమైన సంగీతాన్ని సమకూర్చారు. శ్రీ దాసరి కాంబినేషన్‌లో తన తొలి చిత్రం ... ప్రజామోదాన్ని పొందాలన్న తాపత్రయం వెంకటేష్‌లో ఏర్పడిన కారణంగా ... ప్రతి పాటకు అవిరళకృషి సలిపారు.

"రావణుడే రాముడయితే" స్కోప్ వర్ణ చిత్రాన్ని చూశారు, కొందరు. (సినిమాలకు దూరంగా వుండేవాళ్ళు). నిశితంగా విమర్శించే ఆ వ్యక్తులు..."రావణుడే రాముడయితే" చిత్రాన్ని ఎంతో బావుంది అని ప్రశంసించడం గమనార్హం.

శ్రీమతి ఎన్. ఆర్. అనురాధాదేవి నిర్మిస్తున్న "రావణుడే రాముడయితే" స్కోప్ వర్ణ చిత్రానికి వస్తున్న బిజినెస్ ఆఫర్లు. ఎంతో ఆశాజనకంగా వున్నాయి.

శ్రీ నాగేశ్వరరావు కొత్తతరహా పాత్రధారణ చేస్తున్న ఈ చిత్రంలో జయచిత్ర, లత, మోహన్ బాబు, అల్లురామలింగయ్య, ప్రభాకరరెడ్డి, మాడా, కె. వి. చలం ప్రధాన భూమికలను నిర్వహిస్తున్నారు

అక్కినేని చిత్రాలు

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్, జగపతి ఆర్ట్ పిక్చర్స్, వీనస్ కంబైన్స్, దేవర్ ఫిలింస్, విజయమాధవీ పిక్చర్స్, విజయలక్ష్మి పిక్చర్స్, ఏ. ఏ. కంబైన్స్, లక్ష్మి ఫిలిం కంబైన్స్, శ్రీ లక్ష్మీనరసింహా పిక్చర్స్, సుగుణా పిక్చర్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్.

– జనప్రియ ★

జి. వి. జి. పేజీ



రామచిలక

సుందర్‌లాల్ నహతా సమర్పించే విజయలక్ష్మి పిక్చర్స్ "రామచిలక" పంచవన్నెల చిత్రం సెట్‌లో కామరాజు (రావుగోపాలరావు) విరహబాధ అనుభవిస్తూంటే, ఇరువైపులా వున్న ఆనంద్ (సాక్షిరంగారావు), వరద (రావికొండలరావు) ...

వరద : అయ్యో, దాన్ని మరచిపోండి.

కామరాజు : మరువలేనురా వరదా! ఆ రామచిలక ఇరవైనాలుగుగంటలూ నా గుండెల మీద పట్టికొడుతోందిరా.

ఆనంద్ : దాని రెక్కలు విరగ్గొట్టండి

కామరాజు : రెక్కలు విరిచి ఒళ్ళో పెట్టుకోవాలనిరా నా ఆశ. కాని, చిలక చిక్కనంటుందే!

ఆనంద్ · ఆ చిక్కు నా కొదిలేయండి.

సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీకాంత్ నహతా నిర్మించే ఈ చిత్రంలో వాణిశ్రీ, రంగనాథ్, చంద్రమోహన్, జయలక్ష్మి, కాంతారావు, రాధాకుమారి ఇతర పాత్రధారులు.

ఎం. ఆర్. రాధా. ఛలోక్తులు

'వరుడు — వధువు' పదాలకు భేదం తెలీకుండా పదాలు ప్రయోగించేవారిపై డైరెక్టర్ కె. విశ్వనాథ్ "సీతామాలక్ష్మి" చిత్రంలో చంద్రమోహన్ ద్వారా ఓ చిన్న విసురు విసిరిన విషయం ప్రేక్షకులకు యింకా జ్ఞాపకం వుంటుంది.


ఇటీవల మద్రాసు రాఫ్ థియేటర్‌లో ఎం. ఆర్. రాధా నటించిన ఒక పాత చిత్రం ప్రదర్శింపబడినప్పుడు పోస్టర్లలో 'స్వర్గీయ ఎం. ఆర్. రాధా నటించు' అని అచ్చయింది. ఆ విషయం తెలిసిన రాధా "నాకు విచారం కలగలేదు గాని, ఈ పొరబాటు నా విరోధులకు సంతోషం కలిగిస్తుందేమో! నాకొచ్చిన బాధల్లా — అర్థం తెలియని పదాలను ఉపయోగించడమెందుకని?" అన్నారు.

ఆయనకు, ఆయన కొడుకు ఎం. ఆర్. వాసుకు ఏదో కుటుంబకలహ కారణంగా మాటల్లేవు. ఇద్దరూ "వేలంపట్టి వీరాయ్" అనే తమిళ చిత్రంలో బుక్ అయ్యారు. ప్రారంభోత్సవానికి వచ్చిన వాసు, తండ్రిని చూసి నిర్లక్ష్యంగా తలను పక్కకు తిప్పుకునేసరికి "వీడొక బడుద్దాయి కొడుకు," అని కొడుక్కి వినిపించేలా గొణుక్కున్నాడట రాధా.

ఎం. ఆర్. రాధా వేరే యింటికి మకాం మార్చవలసివచ్చింది. ఇందిరా నగర్‌లో ఒక ఇల్లు ఖాళీగా వుందని తెలిసింది. ఇల్లుగలాయన "మీతో నిజం సంగతి చెప్పేస్తున్నాను. ఈ ఇంట్లో కొంతకాలం క్రితం ప్రేమ అనే యువతి హత్య చేయబడింది. ఆమె దయ్యమై యిక్కడే నివసిస్తోందట. అందుకని యిక్కడ అద్దెకు రావడానికి అందరూ భయపడుతున్నారు," అనేసరికి "నాకేం భయంలేదు. అద్దె ఎంత?" అని అడిగాడు రాధా. అయిదువందలన్నాడు ఇంటి యజమాని. "నేను రెండువందలయాభై మాత్రమే చెల్లిస్తాను. ఒక ఆడదయ్యం నివసిస్తోందన్నావుగా? మిగతా సగం చెల్లించాల్సిన బాధ్యత దానిది," అన్నాడట రాధా నవ్వుతూ.

శ్రీ పినిశెట్టి వితరణ

పాతికేళ్ళుగా తన నాటక నాటికలను ప్రదర్శిస్తూన్న రంగస్థలోపాసకులందరికీ రచయిత




'మూడు పువ్వులు—ఆరు కాయలు'లో సత్యనారాయణ

శ్రీ పినిశెట్టి తన షష్టిపూర్త్యుత్సవ సందర్భంగా కృతజ్ఞత లందజేస్తూ, తన నాటకాలు "పల్లెపడుచు, అన్నాచెల్లెలు, ఆత్మీయులు, పంజరంలో పక్షులు", నాటికలు "ఆడది, రిక్షావాడు, చలిజ్వరం, అమ్మ" ఇటుపైన తన అనుమతి పత్రం పొందనక్కరలేకుండానే యథేచ్ఛగా ప్రదర్శించుకోవచ్చని ప్రకటించారు.



'శివరంజని'లో హరిప్రసాద్, సుభాషిణి

* జి. వి. జి. పేజీ *



'శ్రీరామ రక్ష'లో ఒక దృశ్యం

అతనికంటె ఘనుడు

అబ్బు (అబ్బు రామలింగయ్య) కత్తి చేతపట్టి ప్రవేశించేసరికి సుందరి (జయవిజయ) బిత్తరపోయి "ఎవరు మీరు ?" అంది

"నన్ను బెంజిబండి అని పిలిచే ఆ కుంటి కులాసంగాడు నా అసిస్టెంటు - మీరిద్దర్నూ కలిసి ఈ ఇల్లాలికి అన్యాయం చేస్తున్నారు అందుకే మి పని పట్టుకుడమా! హత్యలు చేయడం నా వృత్తి" అన్నాడు అబ్బు

"వద్దండి పొడిస్తే పోలీసులు వస్తారు. అన్ని సంగతులూ రచ్చకెక్కుతాయి"

"మరి, నా కోపం శాంతించేదెలాగ ?"

"చెబుతాగా రండి" అంటూ సుందరి మంచంమీద కూర్చోబెట్టగానే "ఏమిటిది ? ఈ వీరపురుషుడ్ని, సాహసవంతుడ్ని, సింహబలుడ్ని వలలో వేసుకుందామని పథకం వేస్తున్నట్టున్నావ్ ! నాకు కుదరదు" అన్నాడు అబ్బు

"పథకం కాదండి కత్తి చేతిలో పట్టుకొని, రాజకుమారుడిలా ఉన్న మిమ్మల్ని చూసిన క్షణంలోనే నా మనసు చలించింది"

"నాకూ చలిస్తున్నట్టుందే!" అని అబ్బులు అంటుండగా తలుపు తట్టిన చప్పుడైంది.

"మీ జూనియర్ అండీ . ఇప్పుడు చంపడాలు, పొడవడాలు చేస్తారేమిటీ కొంపతీసి ?" అడిగింది సుందరి భయంగా.

అబ్బు కంగారుగా "ఈవేళ మంగళవారం. చంపటం కుదరదు. ఎక్కడైనా దాక్కుంటాను... ఇది భయం కాదు సరదాగా కంగారుపడుతున్నానంతే !" అంటూ ఇటు అటు చూసి, మంచం కింద దూరాడు,

జి. సి. శేఖర్ దర్శకత్వంలో అడుసుమిల్లి లక్ష్మీకుమార్ నిర్మించే మారుతీ ప్రొడక్షన్స్ "అతనికంటె ఘనుడు" వర్ణ చిత్రంలో కృష్ణ, జయప్రద నాయకా నాయికలు. సత్యానంద్ రచయిత. చక్రవర్తి సంగీత దర్శకుడు. పుష్పాల గోపీకృష్ణ ఛాయాగ్రాహకుడు. నిర్వహణ : జాస్తి.

ముగ్గురు మూర్ఖరాళ్ళు

రచయిత, దర్శక నిర్మాత మహేష్ ఆంధ్ర ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించే లావణ్య పిక్చర్స్ "ముగ్గురు మూర్ఖురాళ్ళు" సెట్‌లో రాజ్‌బాబు, పొట్టిప్రసాద్ ...

బాబు : ఏరా పొట్టీ ? నాకెందుకురా పెళ్ళి కావడంలేదు ?"

పొట్టి : ఏంలేదండి. తమకు డబ్బు, అందం, తెలివి అన్నీ వున్నాయిగాని, ఒక్కటిమాత్రం లేదండి."

బాబు : ఏం ? ఫేస్ లేదా ?

పొట్టి : అదేం కాదండి. పెర్సనాలిటీ. కండబలం — ఆ ఒకటే మన దగ్గర లేదండి.

బాబు : అయ్‌బాబోయ్! దానికి మార్గమేమైనా వుందా ?"

పొట్టి : రోజూ అరడజను కోడిగుడ్లు తిన్నారంటే—ఏడాదిలో ఏనుగంతబలం వచ్చేస్తుంది.

బాబు : ఏనుగంత బలమా! అయితే, ష్యూర్ ... వెరీగుడ్...

పొట్టి : వెర్రిగుడ్డు కాదండి. కోడిగుడ్డు.




'ముగ్గురు మూర్ఖురాళ్ళు'లో సూర్యకాంతం

సంక్షిప్త చిత్ర వార్తలు


★ విజయనిర్మల స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో విజయకృష్ణ మూవీస్ 4 వ చిత్రం షూటింగ్ అక్టోబర్ 10 న ప్రారంభమవుతుంది. నవంబర్, డిసెంబర్ మాసాలలో షూటింగ్ పూర్తిచేసుకొని, సంక్రాంతికి విడుదలవుతుంది. కృష్ణ, శోభన్‌బాబు, రజనీకాంత్, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, గుమ్మడి, గిరిబాబు, రాజ్‌బాబు, విజయనిర్మల, జరీనావహాబ్, జయమాలిని, కృష్ణకుమారి వగైరా తారాగణం రచన : రాజశ్రీ. సంగీతం : రమేష్‌నాయుడు.

★ పట్టు దర్శకత్వంలో డాక్టర్ బాబూరావు నిర్మించే ఊర్మిళా పిక్చర్స్ "డాక్టర్ జానకి" వర్ణ చిత్రంలో మోహన్‌బాబు, మాధవి, ప్రవీణ, విజయభాను ఆదిగా గలవారుంటారు. వేగి రాసిన కథకు ఎన్. ఆర్. నంది స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూర్చారు. సి. నా. రె. గీతాలకు బి. శంకర్ స్వరకల్పన చేశారు. డి. రాజగోపాల్ ఛాయాగ్రాహకుడు. శిల్పం : వి. కృష్ణమూర్తి. కూర్పు : కందస్వామి.



'కుమార రాజా'లో మోహన్‌బాబు, కృష్ణ


రామిశెట్టి నళినీరంజనరావు సమర్పించు
రాజలక్ష్మి ఆర్ట్సు పిక్చర్స్
తప్పక చూడండి!
పదహారేళ్ళ వయసు
స్క్రీన్ ప్లే-దర్శకత్వం: కె. రాఘవేంద్రరావు బి ఏ
ఈస్ట్మన్ కలర్
నిర్మాతలు: అంగర సత్యం, మిద్దే రామారావు, అంగరలక్ష్మణరావు
తారకరామ రిలీజ్
THARAKARAMA
Bachi


తప్పక చూడండి!
నటశేఖర
కృష్ణ నటించు..
గిరిబాబు
సమర్పించు
జయభేరి
ఇంటర్నేషనల్స్..
సింహగర్జన
స్కోప్ & కలర్
స్క్రీన్ప్లే-దర్శకత్వం కొమ్మినేని
నిర్మాతలు మాగంటి వెంకటేశ్వరరావు-యర్రా శేషగిరిరావు
తారకరామ . నవభారత్. .శ్రీతారకరామ..
THARAKARAMA
Bachi

★ కె. హేమాంబరధరరావు దర్శకత్వంలో శశి నిర్మించే శశి మూవీస్ "కొత్త కోడలు" చిత్రంలో చంద్రమోహన్, రోజారమణి, నాగభూషణం, శరత్‌బాబు, ఈశ్వరరావు, సురేష్, వంకాయల సత్యనారాయణ, సారథి, రవి, పరశురామయ్య, రమాప్రభ, రాజశ్రీ, విజయలక్ష్మి, జయమాలిని, ఫణి పాత్రధారులు. ఆదుర్తి నరసింహమూర్తి రచయిత. సత్యం సంగీత దర్శకుడు. లోగసింగ్ సగాయిచ్ ఛాయాగ్రాహకుడు. కూర్పు : చౌదం. శిల్పం : బి. ఎన్. కృష్ణ. సహకార దర్శకుడు : టి. వి. ఎస్. రాజు.

సంక్షిప్త చిత్ర వార్తలు

★ వి. మధుసూదనరావు దర్శకత్వం వహించిన 48వ చిత్రం శాంతిశ్రీ పిక్చర్స్‌వారి "అంగడి బొమ్మ" వర్ణ చిత్రం విజయవాడలో జూలై 16న ప్రారంభింపబడి, ఆగస్టు 12న అనుకున్న గడువుకు మూడు రోజుల ముందే పూర్తయింది శ్రీధర్, నారాయణరావు, నాగభూషణం, నరసింహరాజు, సీమ, అంజలీదేవి, నిర్మల, ఉమ రాళ్ళపల్లి, బేబీ సుమతి, మాస్టర్ రాజు మున్నగువారితో విజయవాడకు చెందిన ఔత్సాహిక కళాకారులు రాజ్యలక్ష్మి, మహీజా, ఆనంద్, కోకా సంజీవరావు ప్రభృతులు పాల్గొన్నారు. ఆత్రేయ రచయిత. ఎస్. వెంకటరత్నం ఛాయాగ్రాహకుడు. సత్యం సంగీత దర్శకుడు కూర్పు : సంజీవి. శిల్పం : బి. ప్రకాశరావు. నిర్మాతలు : కె. ఎస్. ప్రకాశరావు, డి. ప్రసాదరావు.

★ భరణీ చిత్ర ఎంటర్‌ప్రైసెస్ వారి తొలి వర్ణ చిత్రానికి ఇటీవల శివసముద్రం జలపాతం వద్ద సుభాషిణి, నూతన నటుడు ప్రసాద్ పాల్గొన్న కొన్ని సన్నివేశాలు చిత్రీకరింపబడ్డాయి. మురళీమోహన్, లత, నరసింహరాజు, రావి కొండలరావు, పుష్పకుమారి ముఖ్య పాత్రధారులు. వసంతకుమార్ సంభాషణలకర్త. ఇళయరాజా సంగీత దర్శకుడు. తివారీ ఛాయాగ్రాహకుడు. శిల్పం : సూర్యకుమార్. టి. భరణీకుమార్ నిర్మించే ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : శ్రీధర్.

★ జయసుధ, కమలహాసన్ నాయికానాయకులుగా కె. బాలచందర్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో టి. విశ్వేశ్వరరావు నిర్మించే భారత్ ఫిలిమ్స్‌వారి "ఇది కథ కాదు" చిత్రానికి ఆగస్టు 28న "ప్రియుడే సంగీతము – ప్రియురాలే నాట్యము" అనే ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల గానం చేసిన యుగళగీతం ధ్వనిముద్రిక చేయబడడంతో ప్రారంభోత్సవం జరిగింది. అక్టోబర్ నించి డిసెంబర్ వరకు మద్రాసులో జరిగే షూటింగ్‌తో పూర్తయ్యే ఈ చిత్రానికి గణేశ్ పాత్రో సంభాషణలకర్త. ఎం. ఎస్. విశ్వనాథం సంగీత దర్శకుడు. లోకనాథ్ ఛాయాగ్రాహకుడు.



'రామ బాణం'లో జమున, శోభన్

చెప్పుకున్నారు. వారిద్దరూ సఖ్యతగా మాట్లాడుకుంటుంటే పిల్లలిద్దరూ విస్మయంతో వారివంక చూశారు.

ఆరోజే సుశీల బాబాయి కొడుకు రామారావు వద్ద నుండి ఉత్తరం వచ్చింది. ఒక పది సెంట్ల స్థలం బేరానికి వచ్చినట్లు బావగారొచ్చి చూసి సర్దేనంటే మిగిలిన పనులు నేను చూసుకుంటానని రాశాడు.

శంకరం రెండురోజులు సెలవు పెట్టి గుడివాడ వెళ్లివస్తానన్నాడు. సుశీలకు చాలా ఆనందంగా వుంది. వ్యసనాలకు అలవాటుపడిన భర్తలో ఇంత త్వరగా మార్పు వస్తుందనుకోలేదు. భగవంతుని దయవలన భర్త వ్యసనాలకు స్వస్తి చెప్పటం, అదృష్టంకొద్దీ స్థలం బేరానికి రావటం అంతా విచిత్రంగానే వుంది. ఏదో అన్నయ్య దయవలన స్థలం కుదిరితే ఒక ఇల్లనేది ఏర్పర్చుకోవచ్చు అనుకుంది. తాము కట్టబోయే ఇల్లు ఎలా వుండాలి? ఏమేమి చెయ్యాలని వూహించుకుంటూ ప్రశాంతంగా నిద్రపోయింది.

జారుడు మెట్లు

[25 వ పేజీ తరువాయి]

తూరుపు తెలతెలవారుతూవుండగా సుశీల పెద్దకొడుకు తట్టిలేపుతూ "అమ్మా, అమ్మా రాత్రి తలుపులు వెయ్యకుండా పడుకున్నావే" అని అడుగుతుంటే సుశీల అదిరిపడి వక్కవుదుటున లేచి కూర్చుంది.

పక్క మంచంమీద శంకరం లేడు ఇల్లంతా ఓసారి చూసొచ్చి ఏదో అనుమానం రాగా గబగబ బీరువా తెరిచి చూసుకుంది. శంకరం బట్టలు, గాజులు, గొలుసు కనిపించలేదు. ఆతృతగా బ్యాంక్ పాస్ బుక్ తెరిచి చూసింది. వడ్డీతోసహా మొత్తం డబ్బు డ్రా చేయబడి వుంది.



"ఓడిపోయాను శంకరం. నేనోడిపోయాను. నేనేకాదు నా వెనక పవిత్రమైన ప్రేమ, అనురాగం, ఆప్యాయత, నీతీ, నిజాయితీ, న్యాయం, ధర్మం అన్నికూడ ఓడిపోయాయి." అనుకుంటూ కుప్పలా నేలమీద కూలబడిపోయింది.

* * *

శంకరం బొంబాయి వెళ్లే ట్రెయిన్‌లో కూర్చున్నాడు. ఆతని మనసిప్పుడు చాలా ఆనందంగా వుంది. జేబు తడిమి చూసుకున్నాడు. వత్తుగా నోట్లకట్టలు తగిలాయి. బొంబాయిలో ఉద్యోగాలు ఈజీగా దొరుకుతాయట. హోటల్ సర్వర్‌కే అయిదారు వందలు జీతం ఇస్తారంట. రోజుకు వంద రూపాయలు టిప్పు కూడ దొరుకుతుందట. పెద్ద పెద్ద వాళ్ళంతా ఫారిన్ సరుకు తాగినంత తాగి మిగిలింది సర్వర్లకే వదిలేసి పోతారంట తనెలాగైనా సర్వర్ ఉద్యోగం సంపాదించాలి.

తన వునికి అనేది ఎవ్వరికీ తెలియనంత దూరం వచ్చేశాడు. "పెళ్ళాం, పిల్లలు. ఛీ, ఛీ వెధవ సంత. సుశీల కెంత అహంకారం? ఏదో గుడ్డలు కుట్టి నాలుగు డబ్బులు సంపాదిస్తున్నానని ఎంత పొగరు? అర్ధరాత్రి వచ్చి తలుపు కొడితే తియ్యదా? పైగా ఆఫీసుకు వచ్చి అందరిలోనూ నన్నల్లరి చేస్తుందా? ఎదురు తిరిగి కొడతానంటూ బెదిరిస్తుందా? ఇప్పుడు తెలుస్తుంది తన సంగతి" కసిగా అనుకున్నాడు శంకరం.

ఆకురాలు కాలపు
మీ విశ్రాంతి కేవలం కొద్ది గంటల దూరంలోనే ఉంది.



భారత దేశంలోని ప్రతీ ప్రాంతం వెయ్యి వసంతాల శోభలతో మీకు ఆనందం కలిగిస్తుంది. కొద్ది గంటల లోనే మీరు మీ గమ్యాన్ని చేరుకోగలరు —విమానంలో

ఉత్తరం

కులు దేవతల లోయ అందమయిన దసరా వేడుకలతో మిమ్మల్ని అలరిస్తుంది ఏపిల్ పళ్ళ తోటలతో ప్రకృతి సౌందర్యానికి నిలయం. **అతి దగ్గరలోని విమానాశ్రయం— చండీఘడ్.**

కాశ్మీర్ · చక్కటి చీనార్ చెట్లు, బంగారు కాంతుల సూర్యాస్తమయాలు. అతి దగ్గరలోని విమానాశ్రయం —శ్రీనగర్.

నైనిటాల్ నిర్మలమయిన సరోవర జలాల సమీపంలో, మనస్సుని ఉల్లాసపరిచే ప్రశాంత విశ్రాంతి కేంద్రం అతి దగ్గరలోని విమానాశ్రయం— **ఢిల్లీ.**

దక్షిణం

మైసూరు : బండీపూర్ వన్యమృగ కేంద్రం కేవలం రెండు గంటల దూరంలోనే ఉంది. నగర రాజప్రాసాదాన్ని తిలకించండి. హిందూ, సంసెనిక్ శిల్పకళా సమ్మిళిత సౌందర్యం బృందావన్ గార్డెన్స్, పార్కులు, ఉద్యానవన మార్గాలు

పెరియార్ సరస్సు, వన్య మృగ కేంద్రం. భారత దేశపు ఉత్తమ వన్య మృగాలలో కొన్నింటిని మీరు ఇక్కడ చూడగలుగుతారు అతి దగ్గరలోని విమానాశ్రయం — తిరువనంతపురం.

హైదరాబాదు · ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సాలార్‌జంగ్ మ్యూజియం నెలకొన్న నగరం ఇక్కడి బిద్రి వస్తువులు, నిర్మల్ పెయింటింగ్‌లు కనులకు పండుగ. చార్మినార్ పైనుంచి నలువైపులా వ్యాపించిన నగరాన్ని పరిశీలించండి.

తూర్పు

కలకత్తా దుర్గా పూజా కాలంలో పండుగ వేడుకలతో పరవశించే మహా నగరం విక్టోరియా కాలపు ప్రాచీన కట్టడాలు. అనువుగా అంతర్జాతీయ విమానాశ్రయం

డార్జిలింగ్ · ప్రశాంతమయిన పర్వత విశ్రాంతి కేంద్రం అక్కడ నిలబడితే హిమవత్పర్వతాలు నేత్రపర్వంగా దర్శనమిస్తాయి. విమానాశ్రయం : బాగ్‌డోగ్రా— సిక్కిం వెళ్ళేందుకు ముఖద్వారం

పూరి · జగన్నాథస్వామి నిలయం తూర్పు భారత దేశంలోని అతి చక్కటి బీచ్‌లలో ఒకటి. అతి దగ్గరలోని విమానాశ్రయం — భువనేశ్వర్. కోణార్క్‌కు వెళ్ళేందుకు ముఖద్వారం

పడమర

గిర్ గుజరాత్‌లోని వన్య మృగ కేంద్రం అక్కడ భారత దేశపు మృగరాజు రాచఠీవితో దర్శనమిస్తాడు అతి దగ్గరలోని విమానాశ్రయం భావనగర్ పాలితాణా, మొదేరా దేవాలయాలకు వెళ్ళేందుకు మార్గం

గోవా . సూర్యకిరణాలతో తడిసి, తాటితోపుల తోరణాలతో తళతళ మెరిసే బీచ్-భూతల స్వర్గం కోటలు, కేథెడ్రల్స్, ప్రాచీన దేవాలయాలు. అతి దగ్గరలోని విమానాశ్రయం - డబోలిమ్.

అజంతా-ఎల్లోరా భారత దేశపు అద్భుత గుహలు ఔరంగాబాద్ —అతి దగ్గరలోని విమానాశ్రయం

ఎక్కడ నుంచి అయినా సరే కొద్దిసేపు విమానప్రయాణం

ఇండియన్ ఎయిర్‌లైన్స్ అతి వేగంగా వెళ్ళే అధునాతన విమానాలతో, దేశమంతటా ఉన్న సర్వీసులతో మిమ్మల్ని ఎక్కడకి అయినా సరే చేరవేస్తుంది.

మీ ట్రావెల్ ఏజెంట్, అన్ని ఏర్పాట్లతో మీకు సహాయ పడతారు.

పలు ప్రదేశాలకు ద్వారా ప్రయాణం చేయండి

ఇండియన్ ఎయిర్‌లైన్స్

జారుడు మెట్లు

బొంబాయి నగరం చూసేసరికి శంకరానికి కళ్ళు తిరిగినంత పనైంది అక్కడి భాష అతనికే మాత్రం అర్థం కావటంలేదు ఎలాగో టాక్సీ మాట్లాడుకుని ఓ హోటల్లో బస చేశాడు డేన్నియల్ అని ఓ పేకాట గ్యాంగ్ లీడరుతో పరిచయం చేసుకున్నాడు అతనికి ''సర్వర్ ఉద్యోగం కావాలని'' చెప్పాడు. ''ఓ నెల రోజుల్లో ఆ హోటల్లోనే సర్వర్ ఉద్యోగం ఇప్పిస్తా'నన్నాడు''

డేన్నియల్ హోటల్లో తింటూ, డేన్నియల్ గేంగ్‌తో పేకాడుతూ వారం రోజులు గడిపాడు.

ఈ వారం రోజుల్లోనూ డేన్నియల్ శంకరం ఆనూ, మూనా మొత్తం తెలుసుకున్నాడు ఆరోజు శంకరానికి ఫారిన్ సరుకు చిత్తుగా తాగించి అతను తెలివి తప్పి పడిపోగానే అతని డబ్బంతా సర్వం దోచుకున్నారు

సర్వం దోచుకోబడిన శంకరం పిచ్చివాడి లాంటి బికారిలా బొంబాయి వీధులన్నీ తిరిగాడు జీవనోపాధికి ఎలాంటి అవకాశం దొరకలేదు తినటానికి తిండి దొరకక తల దాచుకోను ఇంత చోటు దొరకక అష్టకష్టాలూ పడుతూ మూడు నెలలు గడిపాడు అతని ఆకారం పిచ్చివాడిలాగా ఓ బిచ్చగాడిలాగా తయారైంది

అప్పుడు భార్య పిల్లలు గుర్తువచ్చారు. ఇంటిదారి పట్టాడు. స్టేషన్‌లో బండి దిగగానే తను మసిలిన వూరు, తనవాళ్ళు వున్న వూరు అనుకోగానే ఒంట్లోకి కొత్త సత్తువ వచ్చింది. కాళ్ళు అలవాటుచొప్పున వడివడిగా నడుస్తున్నాయి

సుశీలను పిల్లల్ని చూసి కొన్ని యుగాలు గడిచినట్లుగా వుంది. తను చేసిన పనికి సుశీల తనను క్షమిస్తుందో లేదో ? ఇంకెప్పుడూ యిలాంటి వ్యసనాల జోలికి పోకూడదు బుద్ధొచ్చింది. మనసులోనే చెంపలు వేసుకున్నాడు. ''భగవంతునిసాక్షిగా ఇంకెప్పుడూ యిలాంటి పని చెయ్యనని సుశీలకు ప్రమాణంచేసి చెప్పాలి'' అనుకున్నాడు.

ఇల్లు వచ్చేసింది. గుమ్మంలో నిలబడి ఆత్రుతగా తలుపుమీద దబదబ కొడుతున్నాడు. సుశీల తలుపు తీస్తుంది. తనను చూసి ఆశ్చర్యపోతూ గట్టిగా కౌగిలించుకుంటుంది ''ఏమండీ నన్నూ, పిల్లల్నీ నిర్దాక్షిణ్యంగా ఒదిలేసి ఎక్కడికెళ్ళారు.'' అని బావురుమంటుంది. తను సుశీలను గట్టిగా హృదయానికి హత్తుకుని ఇంకెప్పుడూ మిమ్మల్నొదిలిపోనని ఓదారుస్తాడు. గట్టిగా, మరింత గట్టిగా తలుపులు దబదబ బాదుతున్నాడు, ''సుశీలా, సుశీలా'' అంటూ.

''ఎవరది ? తలుపులు విరిగిపోయేలా బాదుతున్నావు ? తాళం వేసివుంది కనపడటం లేదూ ?'' ఇంటాయన గొంతు ఖంగుమంటూ వినిపించింది.

''నేనండీ శంకరాన్ని. నా భార్య సుశీలను పిలుస్తున్నాను'' అన్నాడు శంకరం.

''ఇంకెక్కడి సుశీలయ్యా ? నువ్వెళ్ళిన మర్నాడే ఆవిడ ఉరేసుకుని చచ్చిపోయింది. సామానూ, పిల్లల్నీ మీ తండ్రిగారు తీసుకెళ్ళారు. ఏమయ్యా శంకరం నీకేమన్నా బుద్ధుందయ్యా ? తాగుడు పేకాటంటూ వ్యసనాల కలవాటుపడి పచ్చని సంసారాన్ని భార్యా పిల్లల్ని ఒదిలేసి దేశాలమ్మట పోతావుటయ్యా ? పాపమూ ఇల్లాలు అభిమానవంతురాలు కనుక ఆత్మహత్య చేసుకుంది. అన్నట్టు నీ స్నేహితుడు మురళి లేడూ? తప్పతాగి లారీ క్రింద పడి రెండు కాళ్ళూ విరగ్గొట్టుకున్నాడు. ప్రాప్తుడు ఎందరి కాపురాలకు చిచ్చుపెట్టాడో కర్మఫలం అనుభవిస్తున్నాడు'' అన్నాడు ఇంటాయన.

''వ్యసనాలనేవి జారుడుమెట్లు లాంటివి వాటిమీద నుండి జారిపడిన మనిషి అఘాతంలాంటి ఊబిలో చిక్కుకుంటాడు.'' సుశీల మాటలు చెవిలో గింగురుమంటుంటే కుప్పలా అరుగుమీద కూలబడిపోయాడుశంకరం.



మ మ త

(16 వ పేజీ తరువాయి)

సుజాత అంది: "ఉన్న ఊళ్ళో నాకేం భయం? పైచోట నీకు నాన్న సహాయం కావాలి! మీ ఇద్దరూ రేపే బయల్దేరండి!"

ప్రమీలకి హుషారొచ్చింది. సుజాత నిబ్బరంగానే వుంది. పరంధామయ్య పరాగ్గా యింకా ఏదో ఆలోచిస్తూనే వున్నాడు.

కూతుళ్ళు యిద్దరూ ఒకటయారు. స్వయంగ బ్రతకడానికి పాకులాడుతున్నారు. తనెందుకిలా కృంగదీస్తున్నాడు వాళ్ళ ఉత్సాహాన్ని? అనుకొని "సరేనమ్మా! కానియ్యండి! ఎప్పటికేది జరగాల్సి వుంటే అదలా జరుగుతుంది. ప్రయాణం ఏర్పాటు చూడండి!"

తండ్రి ఆ మాట అనగానే, సుజాత, ప్రమీలల మనస్సులు తేలిక పడ్డాయి.

"మాటల్లో పడితే టైము కూడా తెలియదు చంద్రుడెంత పైకి వచ్చాడో? లేవండి భోజనాలు చేద్దాం!" అంటూ పరంధామయ్య కాలవ రేవులోకి నడిచాడు. సుజాత, ప్రమీల కొంగులు నడుంకు బిగించి, వంటింటివైపు కదిలారు.

3

మనిషిని ఒంటరితనం ఎంత బాధిస్తుందో సుజాతకి అనుభవంలోకి వచ్చింది. తోడు కోసం మనసు విలవిల్లాడుతూంది. చుట్టూ ప్రశాంత వాతావరణం. తన వూపిరి తనకే వినబడేంత నిశ్శబ్దం. ఇంటికి రాగనే తండ్రి కబుర్లు; ప్రమీల తోడు వుండేవి. అది కరవయిన కొత్త అనుభవం.

నిర్మలాకాశం నీలంగ మెరుస్తూంది చంద్రకాంతికి కాలవలో నీరు నిర్మలంగ ప్రవహిస్తూంది. పడమర గాలి పైట నెగరకొడుతూ వీస్తూంది. ఈ దృశ్యాన్ని, ఈ గాలినీ భరిస్తూ ఎంతకాలం గడపడం? ఈ కాలవ కూడా ఏడాదికోమారు, ప్రవాహాన్ని కాదని, ఓ నెల విశ్రాంతి తీసుకుంటుంది! వసంతాలు దొర్లుతున్నా తనకేదీ విశ్రాంతి? మార్పు?

తాను కోరుకుంటున్నమార్పేవిటి? వివాహ జీవితమేనా? మరి కిష్టప్పనెందుకు జీవితంలోకి ఆహ్వానించలేక పోతూంది? కిష్టప్పలో ఏదో వెలితి తనకి కనిపిస్తూంది! అది అతను నిరుద్యోగి కావడమా? అతను ఏ గుమాస్తాగానో ఎక్కడో పని చేస్తూంటే, తానిష్టపడేనా? అతను గుమస్తాగిరి యీ పల్లెలో కుదరక. దూరంగ వుంటే తనూ అతనూ కలిసి వుండేది ఎప్పుడు? తనూ అతనితోపాటు పట్నంలో ఉద్యోగం చేస్తూ గడపవచ్చుగా? ఆ జీవితం ఎలా వుంటుంది?

ఈ కాలవ, తన మెదడు ఒక్కటే! ఆ ప్రవాహం యీ ఆలోచనా ప్రవంతి ఆగడం ఉండదు!

తెగూ తెంపూలేని ఆలోచనలు మెదడును మొద్దుబరుస్తాయి. మెదడు మొద్దుబారేక, యింక పని చెయ్యదు, మత్తులో పడుతుంది. ఆ దశలో శరీరానికి చల్లగాలి సోకితే నిద్ర తెలియకుండ వస్తుంది

సుజాత నిద్రపోయింది- కాలవమాత్రం పారుతూనే వుంది.

4

"అదేనిటే! ప్రమీలా అలా చిక్కిపోయావు?" లోపలికి వస్తూనే అడిగింది, సుజాత సామాను లోపల పెట్టించి, రిక్షా మనిషిని పంపించి వచ్చింది ప్రమీల.

"నా మాట అలా వుంచు! నాన్న యీ మధ్య నీ గురించి ఒకటే కలవరింతలు! రాత్రిళ్ళు నిద్ర కూడా పోవడంలేదు. భయంవేసి ఓ కార్డు వ్రాసి పడేశా! నువ్వొచ్చావు, నాకు కొండంత ధైర్యం వచ్చింది!"

"నీకు తిరగడం ఉద్యోగం పడనట్టుంది. బాగా చిక్కిపోయావు!"

"నువ్వు మహా లావుగ వున్నట్టు ఆ కళ్ళలో కాంతి లేదు! పొడారిపోయిన కళ్ళూ నువ్వూను!"

"ఎడారిలో జీవిస్తున్నా కదూ? అందుకు!"

"హాస్యంకాదు. నాన్న నీ గురించి ఎంత ఆలోచిస్తున్నారని? వచ్చే వేళయింది! అలా బీచ్‌కి వెళ్లారు నువ్వు లేచి తెములు, స్నానం చెయ్యి!" అంటూ తను బాత్‌రూమ్ వైపు నడిచింది.

సుజాత ఆ కాస్త చిన్న గదిని, ప్రమీల ఎంత అందంగ సర్దిందీ గమనించింది.

ఇద్దరూ పోటీపడిసట్టు ముస్తాబుఅయి వీధి గేటు దగ్గర నిలబడ్డారు. పరంధామయ్య వస్తూనే సుజాతను చూసి పొంగిపోయాడు.

"బాగున్నారా? నాన్నా ?"

"నా బాగుకేం? నువ్వెలా వుంటున్నావు? అలా పొడుగెదిగి పోయావేం?"

"పొడుగెదగడం కాదు! చిక్కింది. పైగా నన్ను ఆక్షేపిస్తోంది"

"రండి లోపలికి! అమ్మా ప్రమీలా! నాన్నగారి కుర్చీ బయట పడెయ్యి తల్లీ! నా పక్కన చాపమీద కూర్చోండి! ఇలా కబుర్లు చెప్పుకుని ఎన్నాళ్లయిందో?"

తండ్రి, ప్రమీల కబుర్లు వింటూ, అలా కళ్ళప్పగించి చూస్తూ కూర్చుంది సుజాత బుద్ధిమంతురాల్లా!

* * *

"ప్రమీలా! నిన్నోమాట అడగాలి! ఆ ఎదురింటి వాటాలో వుంటున్న వాళ్లెవరే? ఆవిడ డ్యూటీకి వెడుతుంది. అతనెప్పుడూ డ్యూటీకి వెడుతున్నట్టు కనబడదు! ఎవరు వాళ్లు ?"

"ఏం? వాళ్లమీద పడింది నీ దృష్టి ? నువ్వేమనుకుంటున్నావు వాళ్ల గురించి?"

"అబ్బే! మరేం కాదు! వాళ్లది ఆదర్శ దాంపత్యం అనిపిస్తోంది. ఒకే కొడుకు ఆమె ఆఫీసుకి వెడుతుంది. అతను కొడుకుని స్కూలుకు దింపి, మధ్యాహ్నం వస్తాడు. సాయంత్రం ఆమెరాగానే, అందంగ తయారయి ముగ్గురూ బయటికి వెడతారు. ఎప్పుడూ నవ్వుతూ వుంటారు! వాళ్ళకి సమస్యలు, చికాకులు ఏమీ లేవేమో అనిపిస్తుంది! నాకు నచ్చారు! వాళ్లెవరు ?"

"విను! ఆమె చెల్లమ్మ అని మళయాళీ. చాలా మంచిది. ఆమె ద్వారా అరడజను ఆర్డర్లు సంపాదించా. నాకు బాగా తెలుసు. ఇక్కడ ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తోంది. ఏడెనిమిది వందలు తెచ్చుకుంటోంది. కులానికి నాయిర్ బ్రాహ్మణులు వాళ్ళు. ఇక్కడ వున్న మళయాళ బ్రహ్మచారులను పెళ్లి కోసం ప్రయత్నించింది. కుదిరింది కాదు. ఓ సారి యింటికి వెళ్ళినప్పుడు అతన్ని పెళ్లాడి, తీసుకు వచ్చింది. అతను మెట్రిక్యులేటు. ఒంటి గంట దాకా, బజారులో పెద్ద శలూన్‌లో పని చేస్తాడు. సాయంత్రం పెళ్లాం పిల్లల్ని తీసుకుని షికారుకి వెడతాడు !"

ఏమ్మ లేనట్లు అలా వుండిపోయింది, సుజాత మాటా మంతీ లేకుండా !


* * *


ఇంటికి తిరిగివచ్చిన వెంటనే కిష్టప్పకో లేఖ వ్రాసింది సుజాత.

లేఖ అందుకుని కిష్టప్ప వచ్చాడు.

"బావా ! మనం పెళ్లి చేసుకుందాం !" అని మాత్రం అనగలిగింది - మరింక మాటలు రాక తన గుండెలోని మమతని బావ గుండెకు వినిపించ జేసింది.

బయట కాలవలో రెండు పడవలు జంటగ వెడుతున్నాయి. ఆ జంటను తనలో చూసుకుని, తన జన్మ ధన్యమయినట్లు పులకించి పోయింది, కాలవ !





సీరియల్

రాగద్వేషాలు

శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్

రోజులు హాయిగా గడిచి పోతున్నాయి.

ఇన్ని రోజుల్లోనూ ఒకటి గమనించింది ఇందిర.

నాన్సీ ఇప్పుడు ఒక్క పని కూడా ముట్టుకోడంలేదు మొదట్లో ఏ ఒకటి రెండు రోజులో తనకి సహాయం చేసింది. అంతే అన్నీ తనే చేసుకుపోతోంది ఇప్పుడు సహాయానికి కూడా రావడం లేదసలు నాన్సీ! ఈ మాటే ఒకరోజు భర్తతో అంటే—

"అమెరికన్లు అంతే ఇందూ! ఇప్పుడు

(గత సంచిక తరువాయి)

అవసరం మనది. మనం సర్దుకుపోవాలి" అన్నాడు.

"పోనీ ఆవిడని ఆవిడ వంట చేసుకోమంటే సరి. తెలిసొస్తుంది" అంది.

"మరీ అంత కరాఖండీగా మాట్లాడితే మనల్ని ఇంట్లోంచే పొమ్మంటుందేమో... జాగ్రత్త... మనమేమో ఇంకా ఇల్లు దొరకలేదాయె... పొమ్మంటే ఎక్కడికి పోతాం?"


"అసలు మీరు చూస్తున్నారా ఇంటి కోసం?"

"సరే! నా మీదికి తిరిగిందా నీ విసురు?"


నవ్వాడు ఛలోక్తిగా.

ఛాంపియన్ డిటర్జెంట్ కేక్ !

1అప్




మురికిపై విజయం!



అధికశక్తిగల వన్-అప్,
మురికిని నామరూపాలు
లేకుండా తుదముట్టించి,
మురిపించే మెరిపించే
శుభ్రత నిస్తుంది!

వన్-అప్ లోని అధిక శక్తివంతమైన పదార్థాలు, లోపలికి చొచ్చుకుపోగల, తీవ్రంగా పనిచేసే నురగనూ, అధికంగా తెలుపుచేసేవాటినీ సమకూరుస్తాయి. అందుకే వన్-అప్, లోపలదాగిన మురికిని అంతా తీసేసి, బట్టలని శుభ్రపరుస్తుంది—దాంతో తెల్లవాటికి మరింత తెలుపు, రంగువాటికి మరింత మెరుపూ వస్తుంది.

బట్టలకు సంరక్షణ!



సుతిమెత్తని వన్-అప్ మీ
బట్టలను పూర్తిగా సంరక్షించి,
వాటికి సుగంధాన్నిచ్చే ఓ
తాజాదనాన్ని తెస్తుంది!


వన్-అప్, శక్తివంతమైనదైనా ఎంతో మృదువుగా పని చేస్తుంది. ఎందుకంటే దీనిలో హానికరమైన పదార్థాలేమీ లేవు గనక. చక్కని సుగంధం చిందించే వన్-అప్, మీ బట్టలపై మృదుత్వంతో పనిచేస్తుంది. దాంతో అవి సుగంధం తాజాదనంతో రూపొందుతాయి.

డబ్బు ఆదాతో ఉపకారం!



వన్-అప్‌లోని మన్నగల
శక్తి, మరీ మరీ, ఉతికిన
ప్రతిసారీ డబ్బును ఆదా
చేస్తూనే ఉంటుంది!

వన్-అప్, మరే యితర డిటర్జెంట్ కేక్ కన్నా ఎక్కువ కాలం మన్నుతుంది. ఎందుకంటే, వాడగానే డబ్బున అరిపోతుంది గనక. అంటే వాడే ప్రతిసారీ మీరు డబ్బును ఆదా చేస్తున్నారన్నమాటే!



1అప్

శుభ్రతా, సువాసనా, మెరుపూ
సమకూర్చే ఛాంపియన్!

ASP/WL-1 UP IA

విట్కో లిమిటెడ్, కాలోల్ 389 330, గుజరాత్.

జరిగిన కథ 8 : లక్షాధికారి హనుమంత రావుగారు 'వివాహమాడిన బెంగాలీ యువతి గీత, ఇందిరను కనిన కొంతకాలానికి మరణిస్తుంది. ఆయన అక్క సుగుణ తన కొడుకు ఫారిన్ రిటర్న్‌డ్‌ను ఇందిరకు యిచ్చుటకు ఆమె అత్త మామలు నిరాకరించారని ఉత్తరంలో విచారం వెలిబుచ్చుతుంది. ఇందిరను చేసుకునే విషయములో విశ్వనాధం వ్రాసిన ఉత్తరం హనుమంతరావుని గుండె పోటుకు గురిచేయగా, ఆయన కుమారుడు శ్రీకర్ వ్రాసిన ఉత్తరం ఊరట కల్గిస్తుంది. హనుమంతరావుగారు ఇందిరకి వేరే సంబంధాలు చూస్తుంటారు అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఆనంద్‌తో ఇందిరకు ఘనంగా వివాహం జరిపిస్తారు రావుగారు. కాపురానికి కావలసిన అన్ని వస్తువులూ ఇచ్చి, ఇందిరను అత్తవారింటికి పంపుతారు. దురదృష్టవశాత్తు తుఫాను భీభత్సంలో తల్లిదండ్రులను కోల్పోయిన అల్లుడ్నీ, కూతుర్నీ తనింటికి తెస్తారు రావుగారు ఇందిర తండ్రిని ఒంటరిగా వదిలివేసి ఆనంద్‌తో అమెరికా వెళ్ళిపోతుంది. 'నాన్సీ' స్నేహితుని భార్య అని చెప్పి యిందిరను ఆమె యింటికి చేరుస్తాడు.

ఏం మాట్లాడలేదు ఇందిర. 'ఇదంతా ఈయన ఎల్లకాదూ?' అనుకుంది తనలో తనే! ఎందుకో ఆనంద్ అవిణ్ని సమర్థించడం తనకి గతిలేనట్లు అక్కడే పడి వుండడం నచ్చలేదు ఇందిరకి. కానీ ఏం చెయ్యగలదు? కలత బారింది మనసు.

12

"ఇందూ— సాయంత్రం ఒక ఫ్రెండింట్లో పార్టీ వుంది. నువ్వూ వస్తావా?" అడిగాడు ఆనంద్ వస్తూనే.

కాఫీ అందిస్తున్న ఇందిర అడిగింది— "పార్టీలంటే తాగుడు పార్టీలేనా?"

"అవును. ఇక్కడంతే మరి! నిన్నెవరూ బలవంతం చెయ్యరులే తాగమని! ఇక్కడ పార్టీలను గూడా చూసిన అనుభవం రావద్దూ? వస్తావు గదూ? నాన్సీ గూడా వస్తోంది మనతో" కాఫీ తాగి సిగరెట్ ముట్టించాడు.

"ఆవిడెందుకు మధ్య మనతో?" మొహం చిట్లించి అడిగింది. ఆనంద్ అలవాట్లన్నీ ఒక్కొక్కటే బయట పడుతున్నాయి! ఒక్కొక్కటి చూస్తున్న కొద్దీ ఇందిరకి బాధగావుంది. అవి మనసుని ముల్లులాగా గుచ్చుతున్నాయి.

"మా ఇద్దరికీ తెలిసిన ఫ్రెండేలే అతడు. ఆవిణ్ణి గూడా పిల్చాడు. అందుకే వస్తోందావిడ— అయినా ఆవిడ వస్తే నీకేం..."

మాట్లాడలేదు ఇందిర.

వెళ్ళాలని లేకపోయినా బయల్దేరింది. ఎదురొచ్చి లోపలికి తీసుకొని వెళ్ళారు అందర్నీను.

"షి ఈజ్ మిసెస్ ఇందిర" పరిచయం చేశాడు ఆనంద్ అక్కడున్నవాళ్ళకి.

ఆ పార్టీలో ఏ విధమైన ఆకర్షణ కనిపించలేదు ఇందిరకి. ఆ ఫ్రెండ్ సిస్టర్ ఆదివాళ్ళ వెడ్డింగ్ ఆనివర్సరీట, అందుకే పార్టీ! రకరకాల పదార్థాలు వున్నాయి తినడానికి. కానీ ఇందిరకి ఏవీ తినబుద్ధి కాలేదు.

నాన్సీ వాళ్ళతో కలిసి మాట్లాడుతూ కలిసిపోయింది. అందరూ తాగుతున్నారు. రకరకాల డ్రింకులు! ఆనంద్, నాన్సీ గూడా తాగారు. డాన్స్ మొదలయింది. అసలా ఆడా మగా డ్యాన్సులంటే అంత నచ్చవు ఇందిరకి. పండ్లరసం మాత్రం తీసుకుని ఒక మూలగా కుర్చీలో జారగిలబడింది. ఆనంద్ ఈ లోకంలో లేడు. పెద్దగా నవ్వులు, ఛలోక్తులు

"అదేమిటి— ఇంకా తాగుతున్నాడు!? మరీ అంతగా తాగితే..."

తనలో తనే ఆందోళనగా అనుకుంది ఇందిర. అయినా మరీ ఈ అలవాట్లేమిటి ఇతడికి? భయంగా చూస్తోంది అటువేపే.

అంతలో ఒక యువకుడు అటుగా వచ్చాడు. పలకరింపుగా ఇందిరని చూసి నవ్వాడు.

ఎవరితడు? తనని చూసి నవ్వుతున్నాడు? అనుకుంటూండగానే—

"ఇక్కడ కూచున్నారేం? మీకా డ్యాన్సులు ఇష్టంలేవా?" అడిగాడు తెలుగులో!

ఆశ్చర్యంగా చూసింది— తలెత్తి. ఇతణ్ని



CONCEPT-SK-3661 TEL

రాగద్వేషాలు

ఎక్కడో చూసినట్లే వుంది తనకు. ఎక్కడ అనేది గుర్తుకు రావడం లేదు

"నన్ను మీరు గుర్తుపట్టలేదు కానీ మిమ్మల్ని నేను మర్చిపోలేను మీరు ఇందిర. హనుమంతరావుగారి అమ్మాయి మీరు! కలకత్తా మీ వూరు!"

"అవును. మీకెట్లా తెలుసు?"

నవ్వాడతడు "నా పేరు శ్రీకర్. నేను మిమ్మల్ని పెళ్ళి చూపుల్లో చూశాను..."

గుర్తుకొచ్చింది ఇందిరకి. ఇతడి తండ్రి ఉత్తరంవల్ల తన తండ్రికి హార్ట్ ఎటాక్ రావడం- ఆ తరువాత ఈతడు ఉత్తరం రాయడం- అన్నీ గుర్తుకొచ్చాయి.

"మీకు పెళ్ళయిందా?" అడిగింది అప్రయత్నంగా.

"ఆ- అయింది! మీ పెళ్లి తరువాతే" అని- "మిమ్మల్ని, ఆనంద్ కారులోనించి దిగుతుండగా చూశాను. అతడు మీకు...?" అడిగాడు.

"మావారు" అంది ఇందిర.

"ఓ... ఐ సీ..." అన్నాడు శ్రీకర్.

కాసేపు మాటలురానట్టు నిల్చిపోయాడు.

"మీ ఆవిడని తీసుకురాలేదా?" అడిగింది ఇందిర తనే!

"లేదు. ఆవిడ కిట్లాంటివి నచ్చవు - నేనూ తప్పనిసరై వచ్చాను. పీటర్ నా బెస్ట్ ఫ్రెండ్. అందులో ఇవాళ వాళ్ళ వివాహ వార్షికోత్సవం కావడం వల్ల రావలసి వచ్చింది..."

తరవాతేమీ మాటలు జరగలేదు కొంత సేపయాక శ్రీకర్ తనజేబులోంచి విజిటింగ్ కార్డు తీసి ఇందిర కిచ్చాడు.

"ఎప్పుడయినా మీకు వీలయినప్పుడు మా ఇంటికి రండి. మీ కభ్యంతరం లేకపోతేనే సుమా!" అన్నాడు నవ్వుతూ.

ఆనంద్- నాన్సీ కలిసి వస్తున్నారు - చేతిలో చెయ్యేసుకుని!

"ఇందూ- వెళ్దామా?" అల్లంత దూరం నించే అన్నాడు ఆనంద్. శ్రీకర్ ఎదురుగుండా వాళ్ళిద్దరూ అట్లా కలిసి రావడం ఇందిరకి అవమానంగా తోచింది. తొందరగా కుర్చీలోంచి లేచింది. మర్యాద కోసం భర్తకి శ్రీకర్ని పరిచయం చెయ్య బోయింది,

"నాకు తెలుసీయన..." ఎగతాళిగా అన్నాడు ఆనంద్.

అతడి ధోరణి వింతగా తోచింది ఇందిరకి. శ్రీకర్ నవ్వి సెలవు తీసుకున్నాడు.

"వీడు- వీకెట్లా తెలుసేం?" అడిగాడానంద్ దోవలో.

శ్రీకర్ పట్ల సద్భావం లేదని తెలిసిపోయింది ఇందిరకి.

"కలకత్తాలో ఏదో పని మీద మా ఇంటికి ఒకటి రెండుసార్లు వచ్చా- -" అంది- కానీ ఏ సందర్భంలో వచ్చాడో చెప్పలేదు.

“ఐ- సీ-” అన్నాడానంద్ నవ్వి.

ఆ తరువాత ఎవ్వరూ ఏమీ మాట్లాడ లేదు మౌనంగా ఇంటికి తిరిగి వచ్చారు. రాత్రంతా ముభావంగా వున్నాడు ఆనంద్ ఎందుకో అర్థం కాలేదు ఇందిరకి. కానీ- అతడ్ని పలకరించలేదు ఆమె కూడా!

* * *

రోజులు గడుస్తున్నాయి. మునుపటంత

రాగద్వేషాలు

ఉత్సాహం లేదు ఇందిరలో. ఊహలున్నంత అందంగా వుండవు అనుభవాలు. విదేశంలోని అలవాట్లూ- ఆచారాలన్నీ కృత్రిమంగా అనిపించ సాగాయి! దూరపు కొండలు నునుపు. మానవుడికి ఏవి అందుబాటులో వుండవో వాటికోసం అర్రులు చాస్తాడు. అవి అందాక వాటి విలువ తగ్గుతుంది.

అట్లాగే విదేశీయానం గురించి-

విదేశంలో వుండడం గురించి — ఎన్నో కలలు కంది. ఆ కలలు నిజమైనాయి.

కానీ అవి — అనుకున్నంత మధురంగా లేవని ఇప్పుడే తెలిసొస్తోంది!

ఆనంద్ లో చాలా మార్పు కనబడుతోంది. తనని నిర్లక్ష్యం చేస్తున్నాడా-అనిపిస్తోంది. నాన్సీ — ఆనంద్ ఈమధ్య ఎక్కువగా మాట్లాడుకోవడం — ఛలోక్తులు విసురుకోవడం చూస్తోంది. తను ఉన్నది ‘అమెరికా’ అని ఎంతో సరిపెట్టుకోవాలని చూస్తోంది ఇందిర.

వాళ్ళిద్దరూ మొదటినుంచీ పరిచయమున్నవాళ్ళు — మాట్లాడుకోవడంలో తప్పేం లేదని తనని తనే సమాధానపరుచుకోవాలని చూస్తోంది ఇందిర.

వాళ్ళు తన పనులు లెక్కచెయ్యడంలేదు. చూడగా — చూడగా — తనని కేవలం పనిమనిషి లాగా చూస్తున్నారా — అనే సందేహం కూడా కలగ సాగింది.

వీకెండ్సుకి మొదట్లో అంతా కలిసి ఎక్కడికో అక్కడికి వెళ్ళేవారు ఇప్పుడు పిల్లవాణ్నిగూడా తనదగ్గరే వదిలి వాళ్ళిద్దరే వెళ్తున్నారు. ఆనంద్ తను అడక్కముందే- “నీ కట్లాంటి పార్టీలంటే ఇష్టం వుండదుగా-” అనడం ప్రారంభించాడు.

తాగుడు యధేచ్ఛగా సాగుతోంది.

ఇంట్లోనే తాగడం ప్రారంభించారు ఇద్దరూ కలిసి!

నాన్సీ ఆకర్షణలో పడుతున్నాడని గ్రహించడానికి ఎంతో కాలం పట్టలేదు ఇందిరకి. మంచిగా తనభర్తకి నచ్చచెప్పాలని నిశ్చయించు కుంది.

ఒకరోజు రాత్రి- “చూడండీ ఈవిధంగా తాగడం మంచిది కాదండీ- నా మాట విని మీరు ఆరోగ్యం పాడుచేసుకోకండి. తాగుడు మానెయ్యండి ప్లీజ్” ఆ మాటలకి పెద్దగా నవ్వాడు ఆనంద్. అప్పుడు మత్తులోనే వున్నాడు.

“నన్ను తాగద్దనడానికి నువ్వెవరివి? నా ఆరోగ్యం పాడయితే నీకేం? ఇక్కడసలు తాగని వాళ్ళు ఎవరూ వుండరు తెల్సా? దీని మజా నీకేం తెల్సు? నువ్వూ తాగు తెలుస్తుంది. లేకపోతే నాన్సీ లేదూ- నా డార్లింగ్ నాన్సీ-? నాన్సీ నడుగు నీకుకూడా నేర్పిస్తుంది...”

“ఛీ- ఛీ-” దూరంగా జరిగింది.

“నా దగ్గిరికి రాకండి, నాకు తాగిన వాళ్ళంటే అసహ్యం!”

"ఊఁ ? ఎంత పొగరు ? నన్ను చీదరించుకునే స్థితికి వచ్చావా నువ్వు? నీ తిక్క కుదురుస్తానుండు" తరువాత మాటలు వినలేదు ఇందిర. గట్టిగా కళ్ళు మూసుకుంది. నిద్ర రాలేదు.

అయినా కళ్ళు తెరవలేదు ఇందిర.

ఆనంద్ నిద్రపోయాడనుకుంది.

కాసేపటికి వెనక్కి తిరిగిన ఇందిరకి భర్త కనబడలేదు. గబుక్కున లేచి లైటు వేసింది. భర్త కోసం వెదికింది. ఎక్కడా లేదు. లేచి ఇవతలికి వచ్చింది. ఆమెకి భయం వేసింది. తనను కుదుట పరుచుకుంటూ— ఎక్కడికి వెళ్ళి వుంటాడా అని ఆలోచించుకుంటూ వుండగా— నాన్సీ గదిలోనుంచి ఏవో మాటలు వినబడసాగాయి. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. అస్పష్టంగా వినబడుతున్న మాటల్లో వినబడుతున్న మగగొంతు ఆనంద్‌దే !

భగ్గున మండింది ఇందిర మనసు ! వింతకు తెగించారు? నాన్సీ విందుకో ఏడుస్తోంది. ఆనంద్ ఓదారుస్తున్నాడు. ఇంక ఆగలేక గబుక్కున తలుపు తోసుకుని లోపలికి వెళ్ళింది. నాన్సీ అతణ్ని కావలించుకుని వుంది... ఆనంద్ చేతులు ఆమెని చుట్టేసి వున్నాయి!

"భగవాన్ ఈ పరిస్థితి పగవాళ్ళకి కూడా వద్దురా......" అనుకుంది.

ఆనంద్ లేచి వచ్చేశాడు. ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. ఇందిర గుండె ఈర్ష్యతో కుతకుత లాడిపోతోంది.

"పాపం— ఆమె భర్తకేదో వంట్లో బాగుండ లేదుట. అది తల్చుకుని ఏడుస్తోంది. నాకు జాలేసింది. వెళ్ళి సంగతేమిటో అడుగుతున్నాను. అంతే! పద— పడుకుందాం..." ఏమీ జరగనట్టుగా అన్నాడు ఆనంద్.

కానీ ఇందిర అనుమానం వదల్లేదు. మౌనంగా వచ్చి పడుకుంది. ఓదార్చడమా? అట్లాగా?... ఉహూఁ— ఇతణ్ని మంచిగానే లొంగదియ్యాలి. ఎట్లా? ఆ రాత్రల్లా ఆమెకు నిద్ర పట్టలేదు. తన భర్తకి అన్ని వ్యసనాలూ వున్నాయి! ఇదీ ఆమెని పీడిస్తున్న బాధ! ఏ విధంగా వీటిని వదలగొట్టాలి? అన్నది శేష ప్రశ్న! ఏదున్నా లేకపోయినా స్త్రీ వ్యసనం— అది— అది వుండకూడదు !

అతడు మామూలు మూడ్‌లో వున్నప్పుడు తను చెప్పదల్చుకున్నది చెప్పేసింది ఇందిర.

"చూడండి— ఇది అమెరికానే. ఇక్కడ స్త్రీ— పురుషులు మాట్లాడుకున్నా — కొన్నాళ్ళు కలిసివున్నా కూడా తప్పేమీ లేకపోవచ్చు. కానీ— మనం భారతీయులం. మనలో భారత రక్తమే ప్రవహిస్తుంది. కానీ ఈ గాలి పీల్చి— ఈ తిండి తిన్నంత మాత్రాన— మన సాంప్రదాయాల్ని వదులుకోవాలనేది ఎక్కడా లేదు! మనం మన హద్దుల్లో వుండాలి— అన్నది నా ఉద్దేశం. పెళ్ళయిన మీరు ఇంకొక పెళ్ళయిన పరాయి స్త్రీని గౌరవంగా చూడాలన్నది మనదేశ సాంప్రదాయం అన్నది నేను మీకు చెప్పక్కర్లేదు మీరు నాన్సీతో ప్రవర్తిస్తున్న తీరు నాకు నచ్చలేదు— అది మంచిది కూడా కాదు. రేపు ఆమెభర్త వస్తే మీ గురించి ఏమనుకుంటాడు ? తిన్నయింటి వాసాలు లెక్కపెడుతున్నాడనుకోడూ? ఈకారణంగా అతడామెని వదిలేస్తే ఆ పాపం మనది కాదూ ? అసలయినా ఆ పాపపు పనులు మన కెందుకు చెప్పండి. మన దోవన మనం గుట్టుగా మన పబ్బం గడుపుకుని — మనకి వేరే యిల్లు దొరికాక అవతలి కెళ్ళిపోదాం. అంతదాకా మీరీ పన్లు మానేయండి. ఇవాళే వేరే ఇంటి కోసం ప్రయత్నాలు ప్రారంభించండి. ఇంతకు ముందు మీ కున్న వ్యసనాలన్నీ భరిస్తాను నేను. కానీ స్త్రీ వ్యసనాన్ని మాత్రం నేను భరించలేను.

జరిగిందేదో జరిగింది. ఇంకనించీ నాన్సీ జోలికి పోనని నాకు మాట ఇవ్వండి !" చెయ్యి చాపింది ఇందిర.

"భేష్ — భేష్ — ఉపన్యాసం బాగా ఇస్తావే—" పెద్దగా నవ్వాడు ఆనంద్.

అంతలో ఆనంద్‌కోసం ఎవరో వచ్చారు— లేచి వెళ్ళాడు.

నిస్సహాయంగా నిల్చిపోయింది ఇందిర !

13

అహరహమూ దీర్ఘంగా ఆలోచిస్తోంది ఇందిర.

ఏదో చెయ్యాల్సి. దీనికి ఏదో చెయ్యాలి.

ఇది ఇట్లా జరగడానికి వీలు లేదు. ఆనంద్ నల్లా విచ్చలవిడిగా నాన్సీతో తిరగనీయకూడదు. వాళ్ళట్లా ఉండడానికి వీలు లేదు. ఆనంద్ మారాలి. మారితీరాలి.

ఇల్లు మార్చేస్తే కొన్త మెరుగు కనబడుతుందేమో? కానీ ఇల్లుమారాలంటే ఎట్లా ? కొత్తయిల్లు ఎవరు చూపిపెడతారు ? ఆనంద్ ఇంక ఇల్లు చూడడు. అది నిశ్చయం. ఎవరు తనకి ఈవిషయంలో సహాయం చేసేవాళ్ళు? హఠాత్తుగా ఒంటరితనం— నీరసం ఆవరించాయి ఆమెని అయినా అధైర్యపడిపోలేదామె. ధైర్యాన్ని తెచ్చుకుని ఆలోచించసాగింది.

ఏపని చేస్తున్నా ఇదే ఆలోచన !

ఆలోచించగా — ఆలోచించగా ఒక ఉపాయం తోచింది. శ్రీకర్ ... శ్రీకర్ ! అవును శ్రీకర్ని అడిగితే ఇల్లు చూసి పెట్టమని? ఆమాత్రం సహాయం చేసి పెట్టడా? ఇల్లు చూసినా ఆనంద్ మారతాడా ? అసలీ ఇల్లు మారడానికి ఒప్పుకుంటాడా ?

ఇంకా వ్యవహారం అంతగాముదర్లేదుగా? ముందే మేలుకుంది తను. ఫరవా లేదు— అతణ్ని ఒప్పించవచ్చు.

వెతికి వెతికి చివరకి శ్రీకర్ విజిటింగ్ కార్డ్ తీసింది దాంట్లో అతడి ఫోన్ నెంబరు వుంది ఆనంద్, నాన్సీ లేని టైములో శ్రీకర్‌కి ఫోన్ చేసింది. ఫోన్‌లో ఇందిర గొంతువిని ఆశ్చర్యపోయాడు శ్రీకర్

"మీ రేటైములో ఇంటో ఉంటారు?" అడిగింది.

"ఏం. ఏమన్నా హెల్ప్ కావాలా? ఏ విషయంలో?"

"ఏం లేదు నేను మీ యింటికిరావాలను కుంటున్నాను మీ ఆవిణ్ని చూడాలని! ఎట్లా రావాలో మీరు రూట్ చెప్తే వస్తాను. ఇంట్లో వుండి వుండి విసుగ్గా వుంది— అందుకని !..."

రూట్ చెప్తూ "మీరు ఎప్పుడు రావాలనుకుంటున్నారో చెప్తే — నేనే వచ్చి మిమ్మల్ని స్వయంగా మా యింటికి తీసికెళ్తాను. మీ ఇల్లు నాకు తెలుసులెండి—" అన్నాడు.

క్షణం ఆలోచించింది.

"ఆయన కూడా వస్తారా?" అడిగాడు శ్రీకర్.

"లేదు ఆయన రారు. నేనొక్కదాన్నే రావాలనుకుంటున్నాను. ఆయనకి టైముండదు. రేపు మధ్యాహ్నం రెండు గంటలకి

నేను రెడీగా వుంటాను. మీరు వస్తారుగా?...''

''తప్పకుండా– విత్ ప్లెజర్– మీరు లంచ్‌కి వచ్చేయండి...?...''

రాగద్వేషాలు

''వద్దండి– ఇంకోరోజు... అవన్నీ–'' 'థాంక్స్' అంటూ ఫోన్ పెట్టేసిందిఇందిర.

తరువాతరోజు శేఖర్ అన్న టైముకి వచ్చాడు. ఆరోజు లక్కీగా నాన్సీ తన కొడుకుని వెంటపెట్టుకుని ఎక్కడికో తీసుకు వెళ్ళింది. (ఇంకా వుంది)

హైదరాబాద్ నోట్‌బుక్ —తిరుమల రామచంద్ర

కేంద్రవిద్యాలయ బాల చిత్రకళ :—

గోలకొండలోని కేంద్రీయ విద్యాలయం ఆగస్టు 21 నుంచి 27 వరకు కళాభవన్‌లో సప్తమ అఖిలభారత అంతరకేంద్రీయవిద్యాలయాల బాలచిత్రకళా ప్రదర్శనం ఏర్పాటు చేసింది. దేశంలోని 43 కేంద్రీయ విద్యాలయాల బాల బాలికలు దీనిలో పాల్గొన్నారు; 451 చిత్రాలు పంపారు. వీటిలో 217 చిత్రాలు ఎన్నికయాయి. వీరిలో 64 మందికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు, తక్కినవారికి మెరిట్ సర్టిఫికెట్లు వచ్చాయి. బహుమతులలో 13 ఆంధ్రప్రదేశ్ పిల్లలకు వచ్చాయి. 5-7వయో వర్గంలో తిరుపతి విద్యార్థి చక్రధర్‌కు (5 సం.) ప్రథమబహుమతి, 8-10వయో వర్గంలో తిరుపతి విద్యార్థి రామానుజాచారికి (8 సం.) ద్వితీయ బహుమతి, 11-13 వయో వర్గంలో గోలకొండ విద్యార్థి కె. చంద్రశేఖర్‌కు ప్రథమ బహుమతి, 14-16వయోవర్గంలో గోలకొండ విద్యార్థి ఆనందకుమార్‌కు (15 సం) తృతీయ బహుమతి వచ్చాయి. చిత్రాల ఎన్నికకు నిర్ణేతలుగా శ్రీయుతులు మామిడిపూడి కృష్ణమూర్తి, నరేందర్‌రాయ్ వ్యవహరించారు. పిల్లలు తమ రచనారామణీయకంతో నూతన ప్రపంచాన్నే చూపారు. వారిలోని కళాభిరుచి, కల్పనా చమత్కృతి ప్రేక్షకులకు ఆశ్చర్యం కలిగించాయి. ప్రదర్శనాన్ని ఆగస్టు 21వ తేదీ మధ్యాహ్నం ప్రారంభమయింది. బొంబాయిప్రాంతం కేంద్రీయ విద్యాలయాల అసిస్టెంట్ కమీషనర్ శ్రీ ఎస్. రామచంద్రన్ ప్రదర్శనం ప్రారంభిస్తూ, బాలబాలికల సర్వతోముఖ వ్యక్తిత్వ వికాసానికి ఇలాటి ప్రదర్శనలు అవసరమన్నారు. గోలకొండ కేంద్రీయ విద్యాలయం నిర్వాహ సంఘం అధ్యక్షులు; ఆర్టిలెరీసెంటర్ కమాండెంట్ కర్నల్ ఎస్.కె. మాథుర్ ప్రత్యేకసంచిక ఆవిష్కరిస్తూ, మానవుని చరిత్ర నిర్మాణానికి కళలు అవసరమన్నారు. శ్రీ కుల్కర్ణి "నన్హేమున్నే కళాకారకీ కళా అనూఠీహై," అనే హిందీ గేయం ఆలపించారు. ప్రారంభంలో గోలకొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాలు శ్రీ ఎస్. రామేశ్వరం స్వాగతం చెప్పారు. శ్రీమతి రామయ్య వక్తలను పరిచయం చేశారు. సుప్రసిద్ధ కళాకారుడు శ్రీ బి. ఎ. రెడ్డి వందన సమర్పణ చేశారు



మాస్టర్ చక్రధర్ (తిరుపతి-5 సం.) ఆగస్టు చివరి వారం కళాభవన్‌లో జరిగిన అఖిలాభారత అంతరకేంద్రీయ విద్యాలయ బాల చిత్రకళా ప్రదర్శనంలో 5-7 వయోవర్గంలో ప్రథమ బహుమతి పొందిన చిత్రం.

పట్టాభిరామ్ ఇంద్రజాలం :—

యునైటెడ్ డ్రామా మ్యూజికల్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సహాయార్థం సుప్రసిద్ధ ఇంద్రజాలికుడు శ్రీ బి.వి. పట్టాభిరామ్ ఆగస్టు 27న రవీంద్రభారతిలో ఇంద్రజాల ప్రదర్శనం చేశారు అంతకుముందు ఆయన కళ్ళకు గంతలు కట్టుకొని మోటారు సైకిలును పురవీధులలో నడిపారు. శ్రీ పట్టాభిరాం ఇంతవరకు దాదాపు 600 ప్రదర్శనాలు చేశారు. వాటర్ ఆఫ్ ఇండియా, గెలిజిన్, అపూర్వపానీయం, మున్నగు గారడీలు చూపారు. అంతకుముందు శ్రీ సుధాకర్ ధ్వన్యనుకరణ ప్రదర్శనం చేశారు. ఈ సందర్భంలో భారత-బల్గేరియా సాంస్కృతిక మైత్రీ సంఘం అధ్యక్షుడు శ్రీ ఎం. రాజేశ్వరరావుకు, ఆస్థమా స్పెషలిస్టు డాక్టర్ సుంకు బలరాముకు, సంఘ సేవకురాలు శ్రీమతి విజయలక్ష్మి షెకావత్‌కు, శ్రీ కె.వి. రాజారావ్ సన్మానం జరిపారు. సన్మాన సభకు ప్రభుత్వ అనువాదశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ఎస్.వి రమణారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ బి. కృష్ణ, శ్రీ తాజ్‌మల్ హుసేన్ ముఖ్యాతిథులుగా వున్నారు. సాంస్కృతిక వికాసానికి నిర్దిష్టమైన పథకాలు తెలిపితే ప్రభుత్వం సహాయం చేస్తుందన్నారు

ఉపశ్రుతి :—

"ఏమ్‌సార్, మిమల్ని పేశారేమిటి, 60 సం॥ల వృద్ధులను బాలల అకాడెమి గౌరవ కార్యదర్శిగా?" అనడిగారొక పెద్దమనిషినన్ను. "అరవైఏళ్ళ తర్వాత ద్వితీయబాల్యం ప్రారంభమవుతుందంటారు కదా! ఆయనకు ఇప్పుడు ఐదు సంవత్సరాలే మరి వృద్ధులెలా అవుతారు?" అని ప్రశ్నించాడు పత్రికా రచయిత శ్రీ మార్పు గోపీనాథ్.

వారఫలం

మహేష్

29-9-1978 శుక్రవారం మొదలు
5-10-1978 గురువారం వరకు

మేషం:— వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. రావలసిన డబ్బు అందుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం:— మీ కార్యక్రమాలు అడావుడిగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. ఇతరుల నిమిత్తం మీరు శ్రమ పొందవలసి వస్తుంది. స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

మిథునం:— సంతోషకరమైన వార్తలను వింటారు. మిత్రులకు సహాయం చేస్తారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషిరాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. అలంకార వస్తువులు కొంటారు.

కర్కాటకం:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో పోటీవారి పోటీ తగ్గుతుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. ఏ వ్యవహారంలోను మొగమాటాలకు లొంగిపోవడం తగదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్య కార్యాలు చేస్తారు.

సింహం:— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తిలో ఆదాయం బాగుంటుంది. రావలసిన డబ్బు అందుతుంది. భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

కన్య:— సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. మీ విలువైన వస్తువులు పోవచ్చును. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

తుల:— వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు లాభిస్తాయి. వారంమధ్యలో శ్రమ కలుగుతుంది. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాల్లో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం: అన్ని వ్యవహారాల్లోనూ గౌరవం లభిస్తుంది. బంధువులకు సహాయం చేస్తారు. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. వారం ఆఖరులో వ్యతిరేక పరిస్థితి యేర్పడగలదు స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

ధనుస్సు:— మీ కార్యక్రమాలు బాగుంటాయి. అనుకూలమైన వార్తలను వింటారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మకరం:— చేజిక్కిన అవకాశాలు కూడా జారి పోవచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారంమధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

కుంభం:— మీ ఆలోచనలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. చికాకులకు గురికాగలరు. వారం ఆఖరులో వృత్తివ్యాపారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం:— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. సాటివారితో వాద ప్రతివాదాలు తగవు. రావలసిన డబ్బు అందుతుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. వారంఆఖరులో ప్రయాస కలుగుతుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

రచయితలకు మనవి

స్థానికంగా వున్న రచయితలు, కార్టూనిస్టులు కూడా మా కార్యాలయానికి వచ్చి వారి రచన అందజేస్తున్నప్పుడు వాటితోపాటు స్వంత చిరునామా గల స్టాంపులంటించిన కవరు పెట్టడం అవసరం —సం


ఫిల్టర్ కాఫీ సువాసన, చిక్కదనం
మేము యిలా తీసుకెళ్లి...
...ఇందులో అలా చేర్చేసాం
రికరి®
ఇన్‌స్టెంట్
SPECIAL TUMBLER PACK
Ricory
ఇది నెస్ కాఫీ ఉత్పత్తిదారులదే-ప్రపంచమంతటా కాఫీ నాణ్యత
RIC/CAS-2/78 TEL

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఏస్ ఎస్ — బందరు.

ఆడవారిని ఉద్ధరించడానికి మీరు మగవారిని విమర్శిస్తున్నారు?

★ ఇది మరీ బాగుంది. ఆడవాళ్లని ఉద్ధరించడానికీ మగవారిని విమర్శించడానికీ సంబంధం ఏమిటి?...వారేకారణమా? వారిలా ఉద్ధరింపబడవలసిన పరిస్థితిలో వుండిపోడానికి!!

బి. వి. ఆర్. — అనంతపురం.

నాకు ఒక బాధ వుంది. అది నా పేరు. నాకా పేరు యిష్టంలేదు.

★ ఇష్టంలేకపోతే మార్చేసుకోవడమే. కని పెంచిన వాళ్ళు తమకిష్టమైన పేరు పెట్టుకుంటారు. పెరిగి పెద్దయ్యాక నచ్చకపోతే మార్చేసుకోడం మీ యిష్టాయిష్టాలమీద వుంటుంది. తమిళులలో ఒక ఆచారం వుంది. అది-పెళ్ళికూతురికి అత్తవారికి నచ్చిన పేరు పెట్టడం.

డి జె. ఆర్. — పోర్టుబెయిర్.

సత్యము ప్రేమ వంటి శాశ్వత గుణములు అమూల్యమైనవి పొందడానికి మానవుని ప్రేరేపింపజేస్తేనే-జీవితానికి ఇహంలోనూ పరంలోనూ శాంతి సంతోషం నిండి వుంటాయి. సుఖం ఆనందం శాంతి కంటే ఆదర్శమానవునికి పరమావధి మరొకటి కలదా?

★ కలదు! అదే భుక్తికి మార్గాన్వేషణ-ఈ అన్వేషణలో మానవుడు ఆదర్శాలనే కాదు మీరంటున్న శాశ్వత గుణాలనీ, తన శక్తి సామర్థ్యాలనీ పణంగా ఒడ్డేస్తున్నాడు...

పి. ఏస్. — బొంబాయి-2.

అక్కడి మాటలు యిక్కడ ఇక్కడి మాటలు అక్కడ చెప్పేవారికి ఏం శిక్షవిధించాలి?

★ ఎందుకు శిక్షించడం? మనపని సులువు చేస్తున్నందుకు నిజంగా వారిని బహూకరించాలి. మనం అనదల్చుకొన్నవీ అనలేనివీ యిలాంటి వారి దగ్గిర చెప్పేస్తే-పోస్టు ఖర్చులు పెట్టుకుని మోసేస్తారు. మనపని తేలిక అవుతుంది!

ఏస్. ఏల్. ఎస్. — మునిపల్లి.

మానవుని కోర్కెలు ఎంతవరకు పరిమితం?

★ తెలుగు సినిమాలలో స్వప్న సన్నివేశాలు చూస్తూ కూడా కోరికలకి పరిమితి వుంటుందనుకోడం అమాయకత్వం. కోరికలే గుర్రాలైతే ముష్టివాడుకూడా రౌతు అవుతాడు అడ్డేముంది?

జి. వి. ఏస్. — ఖమ్మం.

ఏది వాస్తవికత? ఏది కాదు?

★ దైనందిన జీవితసంఘటనలు గుదిగుచ్చడం కాదు వాస్తవికత. ఆ సంఘటనలను కుతూహలం రేకెత్తించ కలవిగా చిత్రీకరించడం వాస్తవికత. ఫొటోగ్రఫి చిత్రకళ కానట్టే-యధాతధ వర్ణన-రిపోర్టింగు అవాలి. రచన కాదు.

యు. వి. — ఎమ్మిగనూరు.

మీ ప్రశ్నావళి ఈ మధ్యకొన్ని రోజులు పత్రికలో కనబడలేదు. మేము చాలా బాధపడ్డాం. కారణం ఏమిటి?

★ ఏమని చెప్పను సంజయా! ఏంలేదు తమ్ముడూ-నాకు మనవడు పుట్టాడు-వాడితో మాట్లాడి మాట్లాడి-నోటితో పాటు చెయ్యి అలసిపోయింది! రెస్టు తీసుకోవాలనిపించింది.

కొందరు అన్యాయం అన్యాయం అంటూ అరుస్తారేగాని అన్యాయన్ని ఎదిరించలేరేం?

★ అరవడం తేలిక. రంగంలోకి దిగడం కష్టం.

వి. ఏస్. ఆర్. - విశాఖపట్నం.

తమ స్వంత తల్లి తండ్రుల మాట వినని సంతానం ఎందుకు?

★ అంటే మీ మాట కెదురు చెప్పడమనా మీ ఉద్దేశ్యం? చూడండి రావుగారూ పిల్లల్ని ప్రేమతో ఒప్పించ వచ్చు కాని వాళ్ళ వూహలు మీ ఊహల్లాగానే ఉండాలని నిర్బంధించకూడదు. వాళ్ళని పెంచి పోషించవచ్చు. అంతమాత్రం చేత వాళ్ళ అంతరాత్మల కంట్రోల్ మీదంటే ఎలా? వాళ్ళని వాళ్ళలాగా ఎదగనివ్వాలి మన లాగే తయారుచేయాలను కోవడం శుద్ధ దండుగ.

సి. ఏం. ఆర్. — పాలసముద్రం

అసలు తనకంటూ వ్యక్తిత్వంలేని వ్యక్తిత్వం లేనిమనిషితో ఎలా ప్రవర్తించాలి?

★ నేనైతే ఆ చుట్టుపక్కల కనబడను.

సామాన్యుని సణుగుడు

(11వ పేజీ తరువాయి)

తారుగాని మనవేపు "జాలి" వడి కూడా చూడరు! 'యువతరం' మీద నిజంగా ప్రేమగల నాయకులు, టీచర్లు ఎంత మందున్నారు?— వాళ్ళమీద ఆశలుపెట్టుకుని, తల్లిదండ్రులు ఐన నేరానికి— వాళ్ళ "వర్తమానం" చుట్టూ తమ భవిష్యత్ స్వప్నాల అల్లిబిల్లి మధురోహ లల్లుకున్న యీ పవిత్ర భారతదేశపు సామాన్యులు తప్ప — యీ దేశాన్ని అవలీలగా రూపాయిలు పారేసి కొనుక్కున్న "వోట్ల"తో "కనిపించని" అంకుశంతో పొడిచి నడిపించే ఏనుగును నడిపిస్తున్నట్లు నడిపించాలను కుంటున్న రాజకీయనాయకులకు; కని పెంచే వాళ్లకున్న ప్రేమ వుంటుందా? ని ...


ఐదేళ్ల తర్వాత వీళ్ళనుంచి వోట్లు మాత్రం కోరే "అరవై కోరల యిరవై కొమ్ము"ల వాంక లోకానికి — వీళ్ళు వోట్లువేట నాటికి "మంచి చెడ్డల" విచక్షణ తెలిసిన; ఎదిగిన పౌరులవడం ఎందుకు యిష్టం వుంటుంది?

ప్రచ్ఛన్న యుద్ధానికి రాజకీయవేత్తలు— పార్టీల నేతలు విద్రోహ శక్తులు విద్యాలయ ప్రాంగణాలను "మాదిరి కదనరంగాలు" (మాడల్ ఏరీనాస్)గా వాడుకోకపోతేచాలు! తల్లిదండ్రులంతాకలసి యీసారి ఎన్నికల్లో వీళ్లకే వోట్లు వేస్తామని యిప్పుడే హామీ యిస్తారు. ఏవరొద్దన్నారు? విద్యాలయాల్లో ఎన్నికలొద్దని? ఏవరన్నారు? కాని యివి మాదిరి ఎన్నికలు! ఫుట్‌బాల్, చెడుగుడు లాంటి ఆటల్లో పోటీపడ్డ రెండు సహాధ్యాయ బృందాలు — ఆ పోటీలైనాక క్లాసులో కలసి మెలసి హాయిగా కూర్చున్నట్లు ఎలక్షన్లైపోయాక —ఆ 'వేడి'ని మరిచిపోయే తీరు ఎన్నికలు— ఇవి. ఆట పాటల మీద — ప్రపంచంలో జరుగుతున్న పరాక్రమోపేత సాహస చర్యల మీద యీ విద్యార్థుల దృష్టి పడేలాగ చూడవలసిన బాధ్యత "విద్యారంగాన్ని" తమ "గుప్పిట" పెట్టుకున్న మహానుభావులదే కాని — పిల్లికూనలై రాజకీయ నాయకులకోసం "గచ్చపిక్కలు" తీస్తున్న యువతరానిది కాదు. యువత ఒక "డైనమైట్". దాన్ని "కొండ"ను పగుల కొట్టేటందుకు వాడుకోవచ్చును. లేదా పరస్పరం బుర్రలు పగులగొట్టుకొనేటందుకు ఉపయోగించవచ్చును! అంచేత ప్రభుత్వం "విద్యావిధానాన్ని" "హృదయం"తో తరచి చూసి తయారు చెయ్యాలి! దేశం మొత్తం మీద కూలంకషమైన పరిశీలనకి తరుణమాసన్నమైంది విషయంలో ... మౌలికమైన మార్పు ఏదో అవసరమా? అనిపిస్తున్నది!

[పిరాజీ]


Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3 Editor: S. Radhakrishna

వనితలకు స్వాగతం!



దాంపత్యాన్ని మధుర స్వప్నంలా రూపొందించుకో గోరుతూ, పిల్లల్ని అత్యున్నతంగా తీర్చిదిద్దాలనుకొనే వనితలకు రేపు స్వాగతం పలుకుతోంది.

తమ కలల్ని నిజం చేసుకోవడానికి తోడ్పడే ఈ గ్రంథాలను మీ అభిమాన పత్రిక ఉచితంగా అందిస్తోంది



ఇదొక అరుదైన అవకాశం!!

రేపు మాసపత్రిక నూతన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తోంది!

జీవనమకరందాన్ని అందుకోమని ఆహ్వానిస్తోంది!!

వనితలకింతటి విలువైనబహుమతి మరెక్కడా లభించబోద